thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 352 కరీంనగర్ గురువారం, 27 ఫిబ్రవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## రైళ్లలో మహిళల భద్రతకు 'వాట్సాప్ గ్రూప్'

చెన్నై: మహిళ సురక్షితంగా ప్రయాణించేలా 'వాట్సాప్' గ్రూప్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర రైల్వే పోలీసులు నిర్ణయించారు. రైళ్లలో ప్రయాణిస్తున్న మహిళలపై లైంగిక వేధింపులు, సెల్‌ఫోన్, చైన్ స్నాచింగ్ ఘటనలు అధికమవుతున్నాయి. రాత్రి సమయాల్లో స్టేషన్ లో ఒంటరిగా ఉంటున్న మహిళలు, రైళ్లలో ఒంటరిగా ప్రయాణిం చే మహిళలపై వేధింపులు జరుగుతున్నాయి. ఈ చర్యలు అడ్డుకొనే లా రైల్వేస్టేషన్లు, రైళ్లలో పోలీసు భద్రత పెంచారు. ఈ నేపథ్యంలో, సబర్బన్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో తరచూ ప్రయాణించే మహిళలను గుర్తించి, వారితో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేయాలని రైల్వే పోలీసు లు నిర్ణయించారు. రైల్వేస్టేషన్లు, రైళ్లలో సంచరించే అనుమానాస్పద వ్యక్తుల వివరాలు, దోపిడీలు, వేధింపుల ఘటనపై సభ్యులు వాట్సాపలో పోస్ట్ చేసిన వెంటనే సత్వరం చర్యలు చేపట్టేందుకు ఈ గ్రూప్‌లు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.

# పోవుడు.. వచ్చుడే..!

## 'రేవంత్ రెడ్డి 36 సార్లు ఢిల్లీకి పోయినా మూడు రూపాయలు రాలే!




ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నా రాష్ట్రానికి తీసుకొచ్చింది రూపాయ లేదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలు సమస్యలతో అల్లాడుతుంటే రేవంత్ రెడ్డి ఢిల్లీకి, ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సెల్బీసీ సొరంగం కూలి ఎనిమిది మంది కార్మికులు చిక్కుకుంటే ఎన్నికల ప్రచారంలో మునిగి తేలావని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా ఉండి రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు.
'మూడు నెలలుగా జీతాల్లేక అల్లాడుతున్నామని కార్మికులు వాపోతుంటే ఎన్నికల ప్రచారం ముగించుకుని నిమ్మలంగా మళ్లీ హస్తిన బాటపట్టావు. సొరంగంలో సహాయక చర్యలు ఒక్కడుగు ముందుకు .. వందడుగులు వెనక్కి అన్నట్లుగా ఉంది' అని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. 'అక్కడ ఆక్సిజన్ లేదు. కన్వేయర్ బెల్టు తెగిపోయింది. 96 గంటలు దాటినా ఒక్కడుగూ ముందుకు పడడం లేదు' అని కేటీఆర్ వివరించారు. 'కాళేశ్వరం పర్రెల మీద.. శ్రీశైలం అగ్నిప్రమాదం మీద కారుకూతలు కూసి, విషపు రాతలు రాసిన మేధావుల నోళ్లు ఎస్సెల్బీసీ విషయంలో మాత్రం నోరెత్తడం లేదు' అని కేటీఆర్ అసహనం వ్యక్తం చేశారు. హస్తిన యాత్రలు మాని ఆ కార్మికుల గోడు వినండి అని విజ్ఞప్తి చేశారు. ఎస్ఎల్బీసీ సొరంగంలో చిక్కుకున్న కార్మికుల కుటుంబాలకు ధైర్యాన్ని ఇవ్వండని కోరారు. అక్కడ చిక్కుకున్నవి సాధారణ ప్రాణాలు కాదు .. ఈ జాతి సంపద అని గుర్తుచేశారు. కాగా శ్రీశైలం ఎడమ కాలువ సొరంగం పనుల్లో ప్రమాదం సంభవించి మూడు రోజులు గడిచినా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సహాయ చర్యలు నామమాత్రంగా జరుగుతుండగా.. మంత్రులు, రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలు.. ఎన్నికల ప్రచారంలో తిరుగుతున్నారు. కానీ ఎస్ఎల్బీసీ సొరంగం ప్రమాదంపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించడం లేదు. 8 మంది ప్రాణాలు గాల్లో దీపాలుగా ఉన్నా వారిని కాపాడేందుకు చేయాల్సిన స్థాయిలో స్పందించడం లేదు. దీంతో రేవంత్ రెడ్డి, మంత్రుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇక ప్రమాదంపై నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ రేపు ప్రమాద స్థలాన్ని సందర్శించనుంది.




## ఆప్ మాస్టర్ ప్లాన్.. డైరెక్ట్‌గా పార్లమెంట్‌కు కేజ్రీవాల్..?

న్యూఢిల్లీ: ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమి పాలైన విషయం తెలిసిందే. దేశ రాజధానిలో ఆప్ 11 ఏళ్ల విజయ పరంపరకు బీజేపీ బ్రేకులు వేసింది. ఆప్‌ను ఓడించడమే కాకుండా ఏకంగా ఆ పార్టీ అధినేత కేజ్రీవాల్‌ను కూడా బీజేపీ ఓడించింది. ఢిల్లీలో ఓటమితో తీవ్ర నిరాశలో ఉన్న కేజ్రీవాల్ రాజ్య సభకు వెళ్లనున్నట్లు ప్రచారం ఊపందుకుంది. ఆప్ అధికారంలో ఉన్న పంజాబ్ నుంచి కేజ్రీవాల్ పెద్దల సభకు వెళ్తారని దేశ రాజకీయాల్లో చర్చ మొదలైంది. ఈ క్రమంలో.. తాజాగా పంజాబ్ పాలిటిక్స్‌లో జరిగిన ఓ పరిణామం ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చించింది. ఇటీవల లూథియానా వెస్ట్ అసెంబ్లీ ఆప్ ఎమ్మెల్యే గురుప్రీత్ గోగి తన పిస్టల్ శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు ఫైర్ అయ్యి మరణించాడు. దీంతో లూథియానా వెస్ట్ అసెంబ్లీకి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ బైపోల్‌కు అధికార ఆప్ తమ పార్టీ అభ్యర్థిగా రాజ్య సభ ఎంపీ సంజీవ్ అరోరా పేరును ప్రకటించింది. ఉప ఎన్నికలో ఎంపీ సంజీవ్ అరోరా గెలిస్తే ఆయన ఏదో ఒక పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. కాబట్టి ఆయనను రాజ్య సభకు రాజీనామా చేయించి.. అతడి స్థానంలో కేజ్రీవాల్ రాజ్య సభకు వెళ్తారని ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో పార్లమెంట్‌కు కేజ్రీవాల్ వెళ్తారన్న ప్రచారంపై ఆప్ స్పందించింది. ఈ మేరకు ఆప్ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ బుధవారం (ఫిబ్రవరి 26) మీడియతో మాట్లాడుతూ.. కేజ్రీవాల్ రాజ్యసభకు వెళ్లడం లేదని.. పంజాబ్ నుంచి ఆప్ అధినేత రాజ్య సభకు వెళ్తారంటూ జరుగుతున్నదంతా తప్పుడు ప్రచారమని ఆమె ఖండించారు. కేజ్రీవాల్ పంజాబ్ సీఎం అవుతారని, రాజ్య సభకు వెళ్తారని కాంగ్రెస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డాయి. సంజీవ్ ఆరోరా వ్యక్తిత్వం, ఆయన పని తీరు కారణంగానే లూథియానా వెస్ట్ బైపోల్‌లో బరిలోకి దింపామని.. అంతేకానీ కేజ్రీవాల్ రాజ్య సభకు వెళ్లేందుకు ఆయనను ఉప ఎన్నికలో పోటీ చేయిస్తున్నారనేది ఫేక్ ప్రచారమని క్లారిటీ ఇచ్చారు. మరీ ప్రచారం జరుగుతున్నట్లుగా కేజ్రీవాల్ రాజ్య సభకు వెళ్తారా లేదా అనేది చూడాల్సి ఉంది.




## పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటాం

హైదరాబాద్: బయో ఏషియా-2025 సదస్సుకు తాము ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన వచ్చిందని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. బయో ఏషియా సదస్సు ముగింపు సమావేశంలో ఆయన ప్రసంగించారు. "బయో ఏషియా చరిత్రలో ఈ ఏడాది సదస్సు ఒక మైలు రాయిగా నిలుస్తుంది. దేశ, విదేశాల నుంచి 4వేల మంది ఫార్మా, హెల్త్ కేర్ ఇండస్ట్రీ లీడర్స్, పాలసీ మేకర్స్, ఆవిష్కర్తలు హాజరయ్యారు. హెల్త్, ఫార్మా రంగాలకు చెందిన 100 మంది నిపుణులు ఆయా రంగాల్లో నెలకొన్న సవాళ్లను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ఈ సదస్సులో 200కు పైగా బీ టూ బీ (బిజినెస్ టూ బిజినెస్) మీటింగ్స్ జరిగాయి. గతేడాది కంటే ఈసారి ఎక్కువ పెట్టుబడులు వచ్చాయి. అమెరికాకు చెందిన బయో టెక్నాలజీ దిగ్గజ సంస్థ 'ఆమ్జెన్' మన దగ్గర భారీగా పెట్టుబడి పెట్టింది. ఈ సంస్థ వల్ల సుమారు మూడు వేల మందికి ఉపాధి లభిస్తుంది. ఈ ఏడాది సదస్సుకు దేశ భవిష్యత్తును మార్చే సత్తా ఉన్న ప్రతిభ గల యువ ఆవిష్కర్తలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. వారి ఆలోచనల్లో నుంచి పుట్టుకొచ్చిన ఈ ఆవిష్కరణలు ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపిస్తాయి. మొత్తం 84 స్టార్టప్స్ సదస్సులో పాల్గొన్నాయి. ఆవిష్కరణలకు అండగా ఉండేందుకు, కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు, పరిశ్రమలతో కలిసి పని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. తెలంగాణను నాణ్యమైన మానవ వనరులకు హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్‌పై దృష్టి సారించాం. సంబంధిత రంగంలో అనుభవమున్న 4 పరిశ్రమల సహకారంతో 'సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ' పేరిట ప్రత్యేక కోర్సును ప్రారంభించాం. మొదటి బ్యాచ్‌లో 140 మంది విద్యార్థులు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరిలో 82 మంది అమ్మాయిలే ఉండటం విశేషం. 60 శాతం మంది అభ్యర్థులు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే. పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటాం. మీతో పాటు కలిసి నడుస్తాం. ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటాం. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని బయో ఏషియా-2025 వేదికగా పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేస్తున్నా" అని శ్రీధర్‌బాబు తెలిపారు.




## మెట్రో విస్తరణ కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు: రేవంత్

ఢిల్లీ: హైదరాబాద్ మెట్రో విస్తరణ అంశం కేంద్ర కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వివిధ అంశాలపై స్పందించారు. ప్రధానితో భేటీ సందర్భంగా 5 ప్రధాన అంశాలపై విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్ కమ్ రైలు ప్రాజెక్టు, డ్రైపోర్టు, రక్షణరంగ ప్రాజెక్టులకు సహకరించాలని కోరినట్టు తెలిపారు. "కాళేశ్వరంపై పిటిషన్ వేసిన రాజలింగమూర్తి హత్యకు గురయ్యారు. కేసు వాదించిన సంజీవరెడ్డి అనుమానాస్పదంగా మృతి చెందారు. కేటీఆర్ వ్యాపార భాగస్వామి కేదార్ దుబాయ్‌లో అనుమానాస్పదంగా చనిపోయారు. ర్యాడిసన్ బ్లూ డ్రగ్స్ కేసులో కేదార్ కీలక నిందితుడు. ఈ అనుమానాస్పద మరణాలపై కేటీఆర్ ఎందుకు స్పందించట్లేదు? జ్యుడిషియల్ విచారణ ఎందుకు కోరట్లేదు. కాళేశ్వరం సహా ప్రాజెక్టుల అక్రమాలపై సాంకేతిక నివేదికలు రాకుండా ప్రస్తుతం ఏమీ మాట్లాడను. ఫోన్ ట్యాపింగ్ కేసులో విదేశాల్లో ఉన్న వారిని తీసురావాల్సిన బాధ్యత ఎవరిది? త్వరలో డ్రగ్స్ కేసు విచారణకు రాబోతోంది. రాష్ట్ర విజ్ఞప్తులు ఐదింటికి కేంద్ర కేబినెట్ ఆమోదం అవసరం. కేబినెట్ ఆమోదం తేవాల్సిన బాధ్యత కిషన్‌రెడ్డి, సంజయ్‌లదే. మెట్రో విస్తరణ కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు. కేంద్రానికి విజ్ఞప్తి చేసిన ఐదు ప్రాజెక్టులు సాధిస్తే కిషన్‌రెడ్డికి గండపెండేరం తొడుగుతా" "పదేళ్లుగా ఎస్ఎల్బీసీ పనులు జరగలేదు. కాంగ్రెస్‌కు పేరొస్తుందనే కేసీఆర్ ఎస్ఎల్బీసీ పనులు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే పనులు మళ్లీ మొదలయ్యాయి. సొరంగంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు యత్నిస్తున్నాం. ప్రస్తుతం ఎస్ఎల్బీసీ వద్ద 11 సంస్థలు పనిచేస్తున్నాయి. సొరంగం వద్ద జరిగింది ప్రమాదం. కాళేశ్వరంలో జరిగింది డిజైన్, నిర్మాణ లోపంతో జరిగిన దుర్ఘటన. హైదరాబాద్‌కు మెట్రో రావడానికి ప్రధాన కారకుడు జైపాల్‌రెడ్డి. కేసీఆర్ వచ్చాక మెట్రో కోసం చేసిందేమీ లేదు. మెట్రో విస్తరణపై కేసీఆర్ పదేళ్లు తాత్సారం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీకి రూ.22,500 కోట్లు అవసరం. ప్రస్తుతం ఆదాయం రూ.18,500 కోట్లు మాత్రమే ఉంది. జీతాలకు రూ.6,500 కోట్లు, వడ్డీలకు రూ.6,800 కోట్లు చెల్లిస్తున్నాం. ఆదాయం రూ.22వేల కోట్లకు పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం" అని సీఎం వివరించారు.




# ఉపాధి కూలీల అకౌంట్లలో...
# భరోసా పైసలు!


హైదరాబాద్ : ఉపాధి కూలీలకు తెలంగాణ ప్రభుత్వం మహా శివరాత్రి కానుక అందించింది. కూలీలకు సంబంధించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. ఎన్నికల కోడ్ అమల్లో లేని ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల్లో ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు జమ చేసింది. మొత్తం 18,180 మందికి 6 వేల చొప్పున నిధులు జమయ్యాయి. జనవరి 26వ తేదీన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ప్రారంభమైన విషయం తెలిసిందే.

ఈ కార్యక్రమం కింద ప్రతి మండలంలోని ఒక పైలెట్ గ్రామంలో గ్రామసభలు నిర్వహించి కూలీల ఖాతాల్లో నిధులు జమ చేస్తోంది. శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమాళి అమల్లోకి వచ్చింది. ఈ కారణంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమం నిలిచిపోయింది. అయితే ఎన్నికల కోడ్ అమలులో లేని జిల్లాలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తులు రావడంతో ప్రభుత్వం తాజాగా నిధులు విడుదల చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రెండు ఉమ్మడి జిల్లాల్లో 66,240 మంది ఉపాధి కూలీ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను ప్రభుత్వం చెల్లించింది. 66,640 మంది కూలీల ఖాతాల్లో 39.74 కోట్లు జమ చేసింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా ఇప్పటివరకు మొత్తం 83,420 మంది ఉపాధి కూలీలకు 50.65 కోట్లు ప్రభుత్వం చెల్లించింది.

ఎన్నికల కోడ్ ముగియగానే లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒక సీజన్‌కు రూ.6000 చొప్పున ఉపాధి కూలీలకు భరోసా కల్పిస్తోంది. డీబీటీ పద్ధతిలో ఉపాధి కూలీల ఖాతాల్లోకి నేరుగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను జమ అవుతున్నాయి.

చురకలు





# మోదీతో సీఎం రేవంత్ భేటీ..

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ ఇవాళ (బుధవారం) ఉదయం ప్రధాని అధికారిక నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై ప్రధానితో రేవంత్ చర్చించారు.

తెలంగాణలో చేపట్టిన పలు ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పెండింగ్ నిధులు విడుదల చేయాలని కోరారు. ఫేస్-2 మెట్రో లైన్, ఎయిర్‌పోర్ట్ పొడగింపు.. దానికి కావాల్సిన ఆర్థిక సహాయం.. అనుమతులు, మూసీ నది సుందరీకరణ నిధులు, కేంద్రం నుంచి వెనకబడిన జిల్లాలకు రావాల్సిన నిధులు, తెలంగాణకు ఐటీఐఆర్, ఐఐఎం, రీజనల్ రింగ్ రోడ్డుకు అనుమతులు, ఆర్థిక సహాయం వంటి అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని పెండింగ్ సమస్యలను ప్రధాని దృష్టికి తెలంగాణ ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. వాటిని త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అయితే చర్చ సందర్భంగా ఎస్ఎల్బీసీ ప్రమాదం గురించి ప్రధాని మోదీ అడిగారు. పరిస్థితి ఎలా ఉందంటూ ఆరా తీశారు. టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులను కాపాడేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని రేవంత్ చెప్పారు.

భారీగా నీరు, బురద పేరుకుపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రేవంత్ రెడ్డితోపాటు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, డీజీపీ జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం పలువురు కేంద్రమంత్రులను రేవంత్ రెడ్డి కలిసే అవకాశం ఉంది.



# కీసరగుట్ట శివరాత్రి వేడుకల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం, రాహుల్ గాంధీ పేరిట పూజలు నిర్వహించినట్టు తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. జాతరలో చిన్న నాటి మిత్రులతో కలిసి మిఠాయిలు కొనుక్కొని సందడి చేశారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ప్రపంచం లో తెలుగు ప్రజలు ఎక్కడ ఉన్నా వారంతా క్షేమం గా ఉండాలని ఆ శివపార్వతులను వేడు కున్నట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం ఆయన సతీమణి మల్లు నందినితో కలిసి స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురం లోని పురాతన శివాలయం లో, మధిర నియోజకవర్గ కేంద్రంలో నీ శివాలయం లో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శివరాత్రి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తండ్రి రాజీవ్ గాంధీ కుటుంబం పేరిట దేవాలయాల్లో మల్లు భట్టి విక్రమార్క పూజలు చేయించారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వానికి శివపార్వతుల ఆశీస్సులు ఉండాలని ఆయన పూజలు నిర్వహించారు. స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో శివపార్వతుల పూజ అనంతరం జాతరలో ఏర్పాటుచేసిన దుకాణాల్లో చిన్ననాటి మిత్రులతో కలిసి కలియతిరిగారు. మిఠాయిలు కొనుగోలు చేసి మిత్రులకు పంచుతూ ఆనందంగా గడిపారు. ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎల్బీసీ టన్నెల్ దగ్గరకు పోతున్నాం...!

## రేవంత్ ప్రభుత్వానికి ముందే వార్నింగ్ ఇచ్చిన హరీష్



హైదరాబాద్ : రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. ఎస్ఎల్బీసీ టన్నెల్ దగ్గరకు గురువారం తాము వెళుతున్నట్లు పార్టీలో కీలకనేత హరీష్ రావు ప్రకటించారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ దగ్గరకు వెళ్ళే క్రమంలో తమను ఎవరూ అడ్డుకోవద్దని ముందుగానే హరీష్ వార్నింగ్ ఇవ్వటమే ఆశ్చర్యంగా ఉంది. ఎస్ఎల్బీసీ టన్నెల్లో జరిగిన ప్రమాదానికి రేవంత్ రెడ్డి కమీషన్ల కక్కుర్తే కారణమని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీష్ పదేపదే ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. తమహయాంలో ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులు ఎలాంటి సమస్యలు లేకుండా, ఆటంకాలు లేకుండా జరిగిన విషయాన్ని హరీష్ గుర్తుచేశారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ప్రమాదంజరిగిన టన్నెల్ ప్రాంతానికి బీఆర్ఎస్ నేతలు వెళ్ళాలని అనుకోవటంలో అర్ధమేలేదు. ఎందుకంటే హరీష్ నాయకత్వంలో పెద్ద బృందం ప్రమాదం జరిగిన ప్రాంతానికి గురువారం బయలుదేరుతోంది. ఇక్కడ కీలకమైన పాయింట్ ఏమిటంటే బీఆర్ఎస్ బృందం టన్నెల్ దగ్గరకు వెళ్ళిచేసేది ఏమీలేదని అందరికీ తెలుసు. ప్రమాదస్థలానికి వెళుతున్న హరీష్ అండ్ కో కు కూడా అక్కడ తాముచేయగలిగేది ఏమీలేదని బాగా తెలుసు. తెలిసిన తర్వాత కూడా ఎందుకు వెళుతున్నట్లు ? ఎందుకంటే ప్రమాదస్థలంలో పెద్ద సీన్ క్రియేట్ చేయటానికే. టన్నెల్ దగ్గరకు వెళ్ళటం వల్ల అక్కడ జరుగుతున్న పనులకు కొంతసేపైనా ఆటంకాలు తప్పవు. టన్నెల్లోకి తాము వెళ్ళాలని ప్రయత్నం చేసినపుడు పోలీసులు తమను అడ్డుకోకూడదని హరీష్ ముందుగా హెచ్చరించటమే విచిత్రంగా ఉంది. ప్రమాదస్థలం దగ్గరకు రాజకీయపార్టీలను, మామూలు పబ్లిక్కును ప్రభుత్వం అనుమతించటంలేదు. ఎందుకంటే పార్టీల నేతలు, పబ్లిక్ వెళ్ళి చూసేందుకు అక్కడేమీ లేదు. పైగా వీళ్ళు వెళ్ళి చేసేది కూడా ఏమీలేదు. రాజకీయపార్టీలు, పబ్లిక్ టన్నెల్ ప్రాంతానికి వెళ్ళటం వల్ల జరుగుతున్న పనులకు అడ్డం. అందుకనే ఇప్పటివరకు ఏ ప్రతిపక్ష పార్టీ నేత కూడా అక్కడకు వెళ్ళలేదు. ఈవిషయాలన్నీ తెలిసి కూడా బీఆర్ఎస్ ప్రమాదస్థలానికి వెళ్ళాలని అనుకున్నదంటే కచ్చితంగా హిడెన్ అజెండాతోనే అని అర్ధమవుతోంది. ఆ హిడెన్ అజెండా ఏమిటంటే తమను అక్కడ పోలీసులు అడ్డుకుంటే గొడవ చేయటమే. ఒకవేళ ఫ్రీగా టన్నెల్లోకి వెళ్ళగలిగినా చూడగలిగినంత చూసి బయటకు వచ్చి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆరోపణలతో రెచ్చిపోవటమే టార్గెట్ గా బీఆర్ఎస్ పెట్టుకున్నట్లు అర్ధమవుతోంది. కాబట్టి గురువారం ఎస్ఎల్బీసీ టన్నెల్ దగ్గర పెద్ద సీనే జరగబోతోంది.




# సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ కామెంట్స్..

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా కామెంట్స్ చేశారు. 36 సార్లు ఢిల్లీకి పోయినా మూడు రూపాయలు తెచ్చింది లేదని, ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలి ఎనిమిది మంది కార్మికులు చిక్కుకుంటే.. సీఎం ఎన్నికల ప్రచారంలో మునిగిపోయారని విమర్శించారు. మూడు నెలలుగా జీతాల్లేక అల్లాడుతున్నామని కార్మికులు వాపోతుంటే.. ఎన్నికల ప్రచారం ముగించుకుని నిమ్మలంగా మళ్లీ హస్తిన బాటపట్టారని దుయ్యబట్టారు. సొరంగంలో సహాయక చర్యలు ఒక్కడుగు కూడా ముందుకు పడలేదని... వందడుగులు వెనక్కి అన్నట్లుగా ఉందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అక్కడ ఆక్సిజన్ లేదని, కన్వేయర్ బెల్టు తెగిపోయిందని, ఘటన జరిగి 96 గంటలు దాటినా ఒక్క అదుగు కూడా ముందుకు పడడం లేదని విమర్శించారు. కాళేశ్వరం పర్రెల మీద.. శ్రీశైలం అగ్నిప్రమాదం మీద కారుకూతలు కూసి, విషపు రాతలు రాసిన మేధావుల నోళ్లు ఎస్ఎల్‌బీసీ విషయంలో మాత్రం నోరెత్తడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తిన యాత్రలు మాని ఆ కార్మికుల గోడు వినాలని కేటీఆర్ సూచించారు. ఆ సొరంగంలో చిక్కుకున్న కార్మికుల కుటుంబాలకు ధైర్యాన్ని ఇవ్వాలన్నారు. అక్కడ చిక్కుకున్నవి సాధారణ ప్రాణాలు కాదని.. ఈ జాతి సంపద అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

**ఎస్ఎల్‌బీసీ ఘటనపై జ్యుడీషియల్ కమిషన్ వేయాలి..** ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒకవైపు సహాయక చర్యలు మరింత వేగవంతంగా కొనసాగిస్తూనే జరిగిన ప్రమాదంపై, అందుకు బాధ్యులైన వారిపైనా విచారణ చేపట్టాలని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం వల్ల ప్రభుత్వానికి వందలకోట్ల నష్టం జరిగిందన్నారు. ఇంతకుముందు సుంకిశాల, పెద్దవాగు ప్రమాదాలు జరిగినపుడు కూడా ప్రభుత్వం ఎలాంటి దర్యాప్తు చేపట్టలేదని, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకొచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**కడియం శ్రీహరికి కేటీఆర్ సవాల్..** మరోవైపు.. దమ్ముంటే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసి గెలిచి చూపించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి కేటీఆర్ సవాల్ విసిరారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు మాజీ జడ్పీటీసీ సభ్యుడు కీర్తి వెంకటేశ్వర్లు, మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు కార్యకర్తలు మంగళవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎసలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నుంచి వలసలు మొదలయ్యాయని, ఇందుకు స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి బీఆర్ఎసలో చేరికలే సాక్ష్యమని చెప్పారు. రేవంత్‌రెడ్డి చేతకానితనం వల్ల 48 గంటల్లో ఏడుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, ఈ మరణ మృదంగానికి ముఖ్యమంత్రిదే పూర్తి బాధ్యత అని ఎక్స్ వేదికగా కేటీఆర్ పేర్కొన్నారు.

# మన సంప్రదాయాలను కాపాడుకోవాలి.. చినజీయర్ స్వామితో ఎంపీ ఈటల



హైదరాబాద్ : మన సంప్రదాయం చాలా గొప్పది.. మన సంప్రదాయాలను కాపాడుకోవాలని బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఇది ఒక్క ప్రభుత్వాలతోనే సాధ్యం కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా ఉండాలని పిలుపునిచ్చారు. బుధవారం ఓల్డ్ అల్వాల్ లో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం రాజగోపురం ప్రతిష్టాపన కార్యక్రమలో చినజీయర్ స్వామితో కలిసి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చినజీయర్ చేతులమీదుగా రాజగోపురం ప్రతిష్టాపన జరగడం సంతోషకరమని తెలిపారు. గల్ఫ్ దేశాల్లో కూడా మన దేవాలయాలను కట్టుకున్నామని అన్నారు. ఇంత పెద్ద భారతదేశం చల్లగా ఉంటుంది.. అంటే కారణం మన సంస్కృతి సంప్రదాయాలేనని కొనియాడారు. ప్రపంచంలో.. సర్వేజనా సుఖినోభవంతు అని కోరుకునే దేశం భారత్ ఒక్కటే కావొచ్చని అభిప్రాయ పడ్డారు. అదే భారత దేశ గొప్పతనం అని అన్నారు. మన చుట్టుపక్కల దేశాల్లో ఏం జరుగుతుందో చూస్తున్నాం.. కానీ మనదేశం ప్రపంచానికే ఆదర్శమని కొనియడారు. ఒకప్పుడు భారత దేశం విశ్వగురు మళ్లీ అది సంతరించు కోవడానికి మనందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కుంభమేళా ఎంత గొప్పగా జరిగిందో చూస్తున్నామని వెల్లడించారు. ఎంత అంతస్తు ఉన్నా, ఆస్తి ఉన్న మన సంప్రదాయాలు కాపాడుకునే ప్రయత్నం జరుగుతుందని చెప్పారు. ప్రజలందరూ సుఖంగా సంతోషం ఉండాలని, శివరాత్రి పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు.

# మహాశివరాత్రి..చెర్వుగట్టు ఆలయానికి పోటెత్తిన భక్తులు

నల్లగొండ: మహాశివరాత్రి సందర్భంగా నల్లగొండ జిల్లాలో అన్ని ఆలయాలు భక్తులతో కిక్కిరిపోయాయి. దేవాలయాల ప్రాంగణాలు శివనామస్మరణలతో మార్మోగాయి. ముఖ్యంగా శైవక్షేత్రాలైన చెర్వుగట్టు రామలింగేశ్వర స్వామి ఆలయం, పానగల్లు ఛాయసోమేశ్వర ఆలయం, వాడేపల్లి మీనాక్షి ఆగస్టేశ్వర స్వామి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునుంచే ఇష్ట దైవం మహాశివున్ని దర్శించుకునేందుకు ఆలయాల్లో క్యూగట్టారు. బుధవారం (ఫిబ్రవరి 26) న మహాశివరాత్రి సందర్భంగా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు దేవస్థానం శ్రీ పార్వతీ సమేత జడల రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం భక్తులతో కోలాహలంగా మారింది. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరి నిలుచున్నారు. అర్చనలు, అభిషేకాలతో మొక్కులు తీర్చుకుం టున్నారు. మహాశివరాత్రి సందర్భంగా నార్కట్ పల్లి మండలం చెర్వుగట్టు దేవస్థానం శ్రీ పార్వతి సమేత జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు. అనంతరం ఎమ్మెల్యే వీరేశం దంపతులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను ఆలయ అర్చకులు అందజేశారు. రద్దీ దృష్ట్యా గుట్టపైకి వాహనాల రాకపోకలు నిలిపివేశారు పోలీసులు. మరోవైపు మహాశివరాత్రి సందర్భంగా దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు నిర్వాహకులు. చలువ పందిళ్లు, త్రాగు నీటి సదుపాయాలను కల్పించిన దేవస్థానం అధికారులు. జిల్లాలో మరో శైవక్షేత్రం వాడేపల్లిలో కూడా వాడేపల్లి మీనాక్షి ఆగస్టేశ్వర స్వామి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుండే కృష్ణ మూసి సంగం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు భక్తులు. ఇక నల్లగొండ పట్టణానికి సమీపంలో ఉన్న పానగల్ల ఛాయ సోమేశ్వర ఆలయం భక్తులతో కిక్కిరిపోయింది. అర్చనలు, అభిషేకాలతో మొక్కులు తీర్చుకుంటున్నారు.

# ఎస్ఎల్‌బీసీ ప్రమాదం.. రెండు రోజుల్లో ఆపరేషన్ పూర్తి చేస్తాం: మంత్రి ఉత్తమ్



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సొరంగమార్గంలో చిక్కుకున్న 8 మందిని కాపాడేందుకు .. రెండు రోజుల్లో ఆపరేషన్ పూర్తి చేస్తామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రమాద స్థలికి చేరుకునేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తున్నట్టు వివరించారు. దేశ సరిహద్దుల్లో టన్నెల్స్ నిర్మించే నిపుణులు, ఎక్కడ టన్నెల్ ప్రమాదం జరిగినా సహాయక చర్యల్లో పాల్గొన్న ఎక్స్‌పర్ట్స్‌ను తీసుకొచ్చి వారి సాయం తీసుకుంటున్నామని తెలిపారు.

"సహాయక చర్యలు మరింత వేగవంతం చేస్తున్నాం. గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి దెబ్బతిన్న టీబీఎంను వేరు చేస్తాం. ఎస్ఎల్‌బీసీ పూడికలోకి వెళ్లాలని నిర్ణయించాం. మట్టి, నీరుతో పేరుకుపోయిన సిల్ట్‌ను పూర్తిగా తొలగించాలని నిర్ణయించాం. ప్రకృతి విపత్తును రాజకీయం చేసి లబ్ధిపొందాలనుకునే వారి గురించి నేను మాట్లాడదల్చుకోలేదు. దేశ.. విదేశాల్లో ఉన్న టన్నెల్ ఎక్స్‌పర్ట్స్ సూచనలతో ముందుకెళ్తున్నాం. సొరంగంలో చిక్కుకున్న 8 మందిని కాపాడటమే మా లక్ష్యం" అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

# 'హస్తం వద్దు..కారే ముద్దు' అని డిసైడ్ అయ్యాడా..?




పటాన్‌చెరు : తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ కీలక పరిణామం చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీలో చేరిన దాదాపు పది నెలలకే మళ్లీ తన సొంత గూటికే చేరేందుకు సిద్ధమయ్యారని ప్రచారం జరుగుతోంది. గతంలో మూడు సార్లు బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన మహిపాల్ రెడ్డి.. 2024లో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత కేసుల భయంతో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో హస్తం తీర్థం పుచ్చుకున్నారు. అయితే కాంగ్రెస్‌లో చేరినప్పటికీ ఆయనకు అంతగా స్వాగతం దక్కలేదని, పటాన్‌చెరులో పార్టీ అంతర్గత విభేదాలు తీవ్రమయ్యాయని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్‌లో చేరినప్పటి నుండి గూడెం మహిపాల్ రెడ్డికి అనేక అవమానాలు ఎదురయ్యాయని, ముఖ్యంగా పటాన్‌చెరులో అధికార కార్యక్రమాలకు ఆయనకు సమాచారం లేకుండా మంత్రులు హాజరవుతున్నారని అంటున్నారు. అంతేకాదు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన, ఇంటింటి సమగ్ర సర్వే కార్యక్రమానికి కూడా ఆయనను పిలవకపోవడం గూడెం వర్గాన్ని తీవ్రంగా నిరాశకు గురి చేసింది. ఇదే సమయంలో కాంగ్రెస్ నేతలతో ఆయనకున్న విభేదాలు కూడా మరింత లోతుగా మారాయని, ముఖ్యంగా కాటా శ్రీనివాస్ వర్గంతో ఆయనకు పెరిగిన దూరం, గూడెం మళ్లీ యూ-టర్న్ తీసుకునేలా చేసిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో గూడెం మహిపాల్ రెడ్డి మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరేందుకు రంగం సిద్ధమయ్యారని, ఇప్పటికే మాజీ సీఎం కేసీఆర్, హరీష్ రావులతో సంప్రదింపులు పూర్తయినట్లు తెలుస్తోంది. మార్చి 2న గులాబీ కండువా కప్పుకోవడం ఖాయమని ఆయన అనుచరులు అంటున్నారు. మహిపాల్ రెడ్డి తిరిగి బీఆర్ఎస్‌లో చేరితే పటాన్‌చెరు రాజకీయ సమీకరణాల్లో మార్పులు రావడం ఖాయం అని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# నెరవేరిన దశాబ్దాల కల.. అంబర్‌పేట ఫ్లైఓవర్‌పై రాకపోకలు ప్రారంభం



హైదరాబాద్: అంబర్‌పేట్ ఫ్లైఓవర్‌పై వాహనాల రాకపోకలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశంతో ఫ్లైఓవర్‌పై రాకపోకలు కొనసాగుతున్నాయి. ఫ్లైఓవర్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. కింద భాగాన రోడ్డు నిర్మాణం, గ్రీనరీ, సుందరీకరణ పనులు పూర్తి చేసి అధికారికంగా మరి కొన్ని రోజుల్లో ఫ్లైఓవర్ ప్రారంభించనున్నారు. అప్పటి వరకు ప్రయాణికుల సౌకర్యార్థం మహాశివరాత్రి నుంచి ఈ పైవంతెనపై రాకపోకలకు అనుమతించాలని కిషన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన నిన్న ఫ్లైఓవర్ పనులను పర్యవేక్షించారు. కేంద్రమంత్రి ఆదేశాలతో ఇవాళ్టి నుంచి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అంబర్‌పేట్ ఫ్లై ఓవర్ దశాబ్దాల కల.. దీనికోసం చాన్నాళ్లుగా స్థానికులు, ఈ మార్గంలో రోజూ ప్రయాణించే వారు ఎదురుచూస్తున్నారు. శివరాత్రి సందర్భంగా అందుబాటులోకి రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ఢిల్లీ అసెంబ్లీలో రచ్చ రచ్చ.. 12 మంది ఆప్ ఎమ్మెల్యేలు సస్పెండ్

ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తోంది. మంగళవారం శాసనసభ సమావేశం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సభలో ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలోనే ఆప్ ఎమ్మెల్యేలు బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆప్ ఎమ్మెల్యేలు ప్రసంగానికి అంతరాయం కలిగించారు. దీంతో అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. ఆమ్ ఆద్మీ, బీజేపీ పార్టీ ఎమ్మెల్యేల మధ్య తీవ్ర స్థాయిలో వాదనలు జరిగాయి. బీజేపీ ప్రభుత్వం ఆప్ ప్రభుత్వం హయాంలో కేజ్రీవాల్ లిక్కర్ స్కామ్ పై కాగ్ ఇచ్చిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. దానికి ముందు ప్రధాన ప్రతిపక్ష నేత అతిషితోపాటు ఆప్ ఎమ్మెల్యేలు అభ్యంతం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఆంధోలన చేపట్టారు. దీంతో స్పీకర్ విజయేందర్ సింగ్ 11 మంది ఆప్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేశారు.




## ఇరాన్ షాడో ట్యాంకర్లపై అమెరికా ఆంక్షలు: భారత్‌పై ప్రభావమెంత..?

ఇరాన్ నుంచి చమురును ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు సరఫరా కాకుండా అడ్డుకొనేందుకు అమెరికా చర్యలు చేపట్టింది. దీంతో షాడో ట్యాంకర్లు, వాటి ఆపరేటర్లు, మేనేజర్లను అమెరికా టార్గెట్ చేస్తూ తాజాగా ఆంక్షలు విధించింది. ఈ విషయాన్ని అగ్రరాజ్య విదేశాంగ శాఖ ప్రకటించింది. వివిధ దేశాలకు చెందిన 30మంది వ్యక్తుల పేర్లు, ట్యాంకర్లు ఈ జాబితాలో ఉన్నాయి. ఇందులో భారతీయుల పేర్లు కూడా చేర్చినట్లు తెలుస్తోంది. వీరంతా ఇరాన్ చమురు విక్రయాలు, బ్రోకరేజీల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. హాంకాంగ్, యూఏఈలోని చమురు బ్రోకర్లు, నేషనల్ ఇరానియన్ అయిల్ కంపెనీలు ఉన్నాయి. "ఇరాన్ తరచూ లక్షల పీపాల చమురును ఎగుమతి చేయడానికి రహస్య ట్యాంకర్లు, షిప్పింగ్ కంపెనీలు, బ్రోకర్లపై ఆధారపడుతోంది. ఇలా వచ్చిన నిధులను ఇతర దేశాలను అస్థిరపరిచే చర్యలకు వాడుతోంది. ఇరాన్ చమురు సరఫరా గొలుసుకట్టు వ్యవస్థలను దెబ్బతీయడానికి అమెరికా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగిస్తోంది. ఎవరైనా ఇరాన్‌తో ఆయిల్ డీల్స్ చేస్తే తమ ఆంక్షల పరిధిలోకి వస్తారు" అని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సాంట్ వెల్లడించారు. ఈ సరికొత్త ఆంక్షల పరిధిలోకి భారత్‌లోని కొన్ని కంపెనీలు రానున్నాయి. వీటిల్లో బీఎస్ఎం మారిటైమ్ లిమిటెడ్ లైబిలిటీ పార్టనర్‌షిప్, ఆస్టిన్‌షిప్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్, కాస్మోస్ లైన్స్ ఐఎన్‌సీ సంస్థలు ఉన్నాయి. ఇవన్నీ ఉద్దేశపూర్వకంగానే ఇరాన్‌తో కలిసి చమురు రవాణా, కొనుగోలు, మార్కెటింగ్ వంటి కార్యకలాపాలకు పాల్పడినట్లు అమెరికా పేర్కొంది.

వీటితో పాటు ఫ్లక్స్ మారిటైమ్ ఎల్ఎల్‌పీ సంస్థ ఓ నౌకకు టెక్నికల్ మేనేజర్‌గా పనిచేసింది. ఆ ఓడ లక్షల టన్నుల ఇరాన్ ముడి చమురును రవాణా చేసిందని అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ పేర్కొంది. ఈసారి ఆంక్షల జాబితాలో ఇరాన్‌కు చెందిన ఆయిల్ టెర్మినల్స్ కంపెనీని కూడా చేర్చారు. ఈ సంస్థ వ్యాపారానికి సంబంధించిన మొత్తం కార్యకలాపాలను పర్యవేక్షిస్తుందని పేర్కొంది. ఇరాన్‌పై వీలైనంత ఆర్థికఒత్తిడిని సృష్టించాలని ట్రెజరీ సెక్రటరీని ఆదేశిస్తూ ఈనెల మొదట్లో ట్రంప్ ఓ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం పెట్టాడు. ఇదేవిధంగా విదేశాంగ శాఖను కూడా ఆయన ఆదేశించారు. ఇరాన్ చమురు ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయేలా చూడాలన్నారు.



# సర్పంచ్ ఎన్నికల్లో టార్గెట్ 'కోతులు'..!

## ఓట్లు పడాలంటే అలా చేయాల్సిందే.. పలు గ్రామాల్లో తీర్మానాలు..

స్థానిక సంస్థల ఎన్నికలకు వారం రోజుల్లోనే షెడ్యూల్ రిలీజ్ అయ్యే అవకాశం కనిపిస్తుంది. ఈ క్రమంలో గ్రామాలవారీగా వార్డులకు, మండలాల వారిగా సర్పంచ్ లకు, ఎంపీటీసీ స్థానాలకు, జిల్లాల వారీగా ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలకు అధికారులు రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. అయితే, స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం నెలకొంది. గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థులుగా బరిలోకి దిగేందుకు పార్టీల వారీగా ఆశావహులు సన్నద్ధమవుతున్నారు. కొందరు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే, ఇక్కడ విశేషం ఏమిటంటే .. రాష్ట్రంలోని పలు గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములను కోతులే డిసైడ్ చేసే పరిస్థితి నెలకొంది. గత సర్పంచ్ ఎన్నికల్లో పలు గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొనగా.. ప్రస్తుతం అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇంతకీ.. కోతులకు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధం ఏమిటంటే.. గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల సమయంలో అభ్యర్థులు గెలుపుకోసం అనేక హామీలు ఇస్తుంటారు. ఇందులో ముఖ్యంగా గ్రామంలో డ్రైనేజీ సమస్య పరిష్కారం, తాగునీటి సమస్య, రోడ్ల సమస్య ఇలా పలు సమస్యలను పరిష్కారం చేస్తామంటూ గ్రామంలో ప్రజల వద్దకు వెళ్లి అభ్యర్థులు ఓట్లు అభ్యర్థిస్తుంటారు. కానీ, పలు గ్రామాల్లో కోతుల బెడద తీర్చేవారికే ఓట్లేస్తామని ప్రజలు ఖరాఖండీగా చెప్పేస్తున్నారు. గత ఎన్నికల్లో గ్రామంలో కోతుల సమస్యను పరిష్కరిస్తామని హామీఇచ్చి భారీ మెజార్టీతో గెలిచిన సర్పంచ్ లు, ఎంపీటీసీలు ఉన్నారు. అయితే, ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో అలాంటి గ్రామాల సంఖ్య పెరిగిందనే చెప్పొచ్చు. రాష్ట్రంలో 35లక్షలకుపైగా కోతులు ఉన్నాయి. గ్రామాలు, పట్టణాలు అనే తేడాలేకుండా జనావాసాల్లో ఎటు చూసినా కోతులే కనిపిస్తున్నాయి. పలు గ్రామాల్లో కోతల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు సందర్భాల్లో కోతులు ఇండ్లలోని వారిపైనా దాడులు చేస్తున్నాయి. మరోవైపు రైతులు సాగుచేసిన పంటలనుసైతం కోతులు ఆగం చేస్తున్నాయి. వీటి నివారణకు అనేక చర్యలు చేపట్టినప్పటికీ ఉపయోగం లేకుండా పోతుంది. దీంతో పలు గ్రామాల్లో ప్రజలు కోతుల బెడదను తొలగించేవారికే తమ ఓటు అంటూ ఖరాఖండీగా చెప్పేస్తున్నారు. పలు గ్రామాల్లో అయితే.. గ్రామస్తులంతా కలిసి తీర్మానాలుసైతం చేస్తున్న పరిస్థితి. దీంతో పలు పంచాయతీల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్న అభ్యర్థులు తొలుత కోతుల సమస్యను పరిష్కరించే విషయంపై దృష్టిసారించి ప్రజల వద్దకు ఓట్లకోసం వెళ్లేందుకు సిద్ధమవుతున్న పరిస్థితి నెలకొంది.

# దేశంలోకి భారీగా బంగ్లా అమ్మాయిలు.. ఏపీ పోలీసుల విచారణలో షాకింగ్ నిజాలు !



ఏపీ పోలీసులు షాకింగ్ అంశాల్ని.. విస్మయానికి గురి చేసే వాస్తవాలతో పాటు.. ఆందోళనకు గురి చేసే వివరాల్ని తమ విచారణలో భాగంగా గుర్తించారు. సంచలనంగా మారిన ఈ వివరాల్ని దేశ హోం శాఖ సైతం సీరియస్ గా తీసుకోవాల్సిన అవసరం ఉంది. బంగ్లాదేశ్ కు చెందిన అమ్మాయిల్ని కోల్ కతా కేంద్రంగా చేసుకొని ఒక భారీ వ్యభిచార రాకెట్ నడుస్తున్న విషయాన్ని ఏపీ పోలీసులు తాజాగా గుర్తించారు. ఇటీవల జరిపిన ఆకస్మిక తనిఖీల్లో భాగంగా వ్యభిచారం చేస్తూ పట్టుబడ్డ మహిళల్ని విచారించిన వేళ.. వారి వివరాల్ని సేకరించగా అందులో బంగ్లాదేశ్ కు చెందిన వారే ఉండటం.. వారంతా అక్రమంగా దేశ సరిహద్దుల్ని దాటేసి కోల్ కతాకు వచ్చేయటం.. అక్కడి నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళుతూ వ్యభిచారం చేస్తున్న వైనాన్ని గుర్తించారు. గడిచిన రెండేళ్లలో విజయవాడ పోలీసులు బంగ్లాదేశ్.. మయన్మార్ కు చెందిన 40 మంది యువతుల్ని.. పది మంది మైనర్లను వ్యభిచార కూపం నుంచి బయపడేశారు. ప్రస్తుతం సుమారు 50 మందికి పైగా బంగ్లాదేశీయులు.. మయన్మార్ కు చెందిన వారు నగరానికి చేరుకున్నట్లుగా గుర్తించారు. వీరిని వారి దేశాలకు తిరిగి పంపే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మానవ అక్రమ రవాణా ఏ రీతిలో జరుగుతుందన్న అంశంపై ఏపీ పోలీసులు ఫోకస్ చేశారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా పశ్చిమబెంగాల్ కు చేరుకున్న కొందరు.. కొంతకాలానికి తమను తాము లోకల్ గా చెలామణీ చేసుకుంటారు. వీరిలో కొందరు పురుషులు.. మహిళలు కలిసి ఒక ముఠాగా ఏర్పడి ఈ దారుణాలకు పాల్పడుతున్నారు. బంగ్లాదేశ్ లోని పేద కుటుంబాలకు ఉపాధి.. ఉద్యోగ సౌకర్యాల్ని అందిస్తామని చెబుతూ వారిని ఆకర్షిస్తుంటారు. మైనర్లకు రూ.20 వేలు అడ్వాన్సు.. యువతులకు రూ.35 వేలు అడ్వాన్సుగా వారి కుటుంబ సభ్యులకు ఇస్తారని.. మొదట వారిని కోల్ కతాకు చేర్చి.. ఆ తర్వాత వారికి విలాసవంతమైన జీవితాన్ని అస్వాదించొచ్చు అంటూ.. వ్యభిచార ఉచ్చులోకి దించుతున్నట్లుగా గుర్తించారు. భారత్ కు చేరుకున్న తర్వాత బ్యూటీపార్లర్లు.. మసాజ్ సెంటర్లు. వ్యభిచారాల్లోకి.. హోటళ్లలోకి పని చేసేందుకు తరలిస్తున్నారు. సరిహద్దు గ్రామాలు.. చెరువులు.. ఖాళీ ప్రదేశాలు.. సొరంగ మార్గాల ద్వారా పశ్చిమ బెంగాల్ కు చేరుస్తారు. అక్కడి నుంచి కోల్ కతాకు చేరిన అమ్మాయిలకు నకిలీ ఆధార్.. ఓటరు గుర్తింపు కార్డుల్ని తయారు చేయిస్తారు. అనంతరం వారిని దళారులకు అప్పగిస్తారు. బంగ్లా.. మయన్మార్ యువతులకు ఢిల్లీ..హైదరాబాద్.. బెంగళూరు.. ముంబయి.. చెన్నై. విశాఖపట్నం తదితర నగరాల్లో మంచి డిమాండ్ ఉంది. కోల్ కతాకు చెందిన దళారులు ఐదారుగురు యువతులు.. మైనరలను ఆయా నగరాలకు తీసుకెళ్లి.. అక్కడి డేటింగ్ యాప్ లు.. స్పా సెంటర్లు.. వ్యభిచార గ్రహాల నిర్వాహకులకు ఆయా మహిళల అందం..ఆకర్షణకు తగ్గట్లు రూ.1-రూ.2 లక్షల వరకు అడ్వాన్సుగా చెల్లించి తమ చీకటి కార్యకలాపాలకు ఉపయోగించుకుంటారని గుర్తించారు. ఖరీదైన దుస్తులు.. రుచికరమైన ఆహారాన్ని అందిస్తూ.. వారికి విలాసవంతమైన జీవితాల్ని పరిచయం చేయటం.. తరచూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వారిని మార్చటం ద్వారా పోలీసులకు దొరక్కుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లుగా గుర్తించారు. సదరు అమ్మాయిల మీద వచ్చే ఆదాయానికి అనుగుణంగా జీతంగా రూ.20 నుంచిరూ.30 వేల వరకు ఇవ్వటంతో పాటు కమిషన్ కూడా ఇవ్వటం ద్వారా వారు మాట్లాడకుండా ఈ చీకటి కూపంలో ఉండిపోతున్నట్లుగా చెబుతున్నారు. తమ దేశంలో నెలకొన్న పరిస్థితులతో పాటు.. ఉపాధి అవకాశాలు లేకపోవటం.. కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అసరాగా ఉండేందుకు తామిలా చేస్తున్నట్లుగా పోలీసులకు చెప్పినట్లుగా తెలుస్తోంది. మొత్తంగా చూస్తే.. పశ్చిమబెంగాల్ సరిహద్దులపై కేంద్రం మరింత ఫోకస్ చేయటంతో పాటు మానవ అక్రమరవాణాతో పాటు.. ఇంకేమైనా కార్యకలాపాలు సాగుతున్నాయా? అన్న అంశం మీదా ఫోకస్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పక తప్పదు.

# బంగ్లాకు పెను ప్రమాదం పొంచి ఉందా?

## ఆ దేశ ఆర్మీ చీఫ్ కీలక వ్యాఖ్యలు

అనూహ్యరీతిలో బంగ్లాదేశ్ లో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల గురించి తెలిసిందే. మైనార్టీ వర్గాలపై పెద్ద ఎత్తున దాడులకు పాల్పడటం.. భారత వ్యతిరేకత అంతకంతకూ ఎక్కువైపోవటమే కాదు.. హసీనా సారథ్యంలోని అవామీ లీగ్ శ్రేణుల్ని టార్గెట్ చేసుకొని మరీ ప్రతీకార దాడులు.. విధ్వంస కార్యకలాపాలు జరుగుతున్న వైనంపై పెద్ద ఎత్తున వార్తలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా తాజాగా ఆ దేశ ఆర్మీ చీఫ్ జనరల్ వకార్ ఉజ్ జమాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్ లోని రాజకీయ పార్టీలను ఉద్దేస్తూ.. రాజకీయ నేతలు తమలో తాము పోట్లాడుకోవద్దని.. ఈ అంతర్గత పోరు దేశ సార్వభౌమత్వానికి పెనుముప్పు కలిగిస్తుందంటూ వ్యాఖ్యానించారు. దేశంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని.. నేరస్థులు దీన్ని అనుకూలంగా మలుచుకుంటున్నట్లుగా పేర్కొన్నారు. దేశంలో శాంతిభద్రతల క్షీణతకు కొన్ని కారణాలు ఉన్నట్లుగా పేర్కొన్న



ఆయన.. 'మనమంతా గొడవల్లో నిమగ్నమై ఉన్నాం. మనలో మనమే పోట్లాడుకుంటున్నాం. విభేదాల్ని పక్కన పెట్టకుండా అనవసర వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటం.. ఘర్షణలకు దిగటం ద్వారా దేశ స్వాతంత్ర్యం.. సౌర్వభౌమాధికారం ప్రమాదంలో పడుతుంది. ఇలాంటి పరిస్థితులను దుండగులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు" అని పేర్కొన్నారు. బంగ్లాదేశీయులంతా ఐక్యంగా ఉండి దేశాన్ని కాపాడుకోవాలన్న ఆయన.. తాను ఈ విషయాన్ని మళ్లీ.. మళ్లీ హెచ్చరిస్తున్నానని పేర్కొన్నారు.


ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన నోటి నుంచి షాకింగ్ వ్యాఖ్యలు వచ్చాయి. తానిప్పుడే హెచ్చరిస్తున్నాని.. ఆ తర్వాత తాను అప్రమత్తం ఎందుకు చేయలేదని తనను భవిష్యత్తులో అనొద్దంటూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. తనకు ఎలాంటి వ్యక్తిగత ఆశలు.. ఆశయాలు లేవన్న ఆర్మీ చీఫ్.. 'దేశాన్ని మళ్లీ సాధారణ స్థితికి తీసుకురావాలనుకుంటున్నాను. ఆ పై విశ్రాంతి తీసుకుంటా. సైన్యం సైతం తమ బ్యారక్ లకు వెళ్లిపోతుంది.

దేశంలో ఎన్నికల నిర్వహణకు 18నెలలు పడుతుందని గతంలోనే చెప్పా. ఇప్పుడు అలాంటి పరిస్థితుల్లోనే ఉన్నాం' అని పేర్కొన్నారు. మరి.. తమ దేశ ఆర్మీచీఫ్ చేసిన హెచ్చరికను బంగ్లాదేశ్ నేతలు ఏ మాత్రం సీరియస్ గా తీసుకుంటారో చూడాలి.

# ఐటీ ఉద్యోగుల్లో లివర్ ఇష్యూస్..

## ఎంత ఎక్కువో చెప్పిన తాజా సర్వే

హైదరాబాద్ సెంట్రల్ విశ్వవిద్యాలయ విద్యార్థులు తాజాగా నిర్వహించిన ఒక సర్వే షాకింగ్ ఫలితాల్ని వెల్లడించటమే కాదు.. ఐటీ ఉద్యోగులకు ఒకలాంటి హెచ్చరికను చేసిందని చెప్పాలి. గంటల కొద్దీ ఆఫీసుల్లో సీట్లను వదలకుండా కూర్చోవటం.. విరామం లేకుండా పది.. పన్నెండు గంటలు పని చేయటంతో పాటు తీవ్రమైన ఒత్తిడి కారణంగా ఉద్యోగులకు ఊబకాయం మాత్రమే కాదు లివర్ (కాలేయం) సమస్యలు వస్తున్న విషయాన్ని గుర్తించారు.అది కూడా భారీగా. హెచ్ సీయూ పరిశోధకులు చేపట్టిన ఈ సర్వే ఫలితాలు ఆందోళనకు గురి చేసేలా.. ఐటీ ఉద్యోగులు తక్షణం తమ ఆరోగ్యం మీద ఫోకస్ చేయాల్సిన అవసరాన్ని చెప్పకనే చెప్పేశాయని చెప్పాలి. హెచ్ సీయూలోని మెడికల్ సైన్సెస్ విభాగం ప్రొఫెసర్లు కల్యాంకర్ మహదేశ్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ అనిత.. రీసెర్చ్ స్కాలర్ భార్గవ్.. నందిత ప్రమోద్ లు ఏడాది పాటు నిర్వహించిన ఈ రీసెర్చ్ ఫలితాలు తాజాగా విడుదలయ్యాయి. ఐటీ ఉద్యోగుల్ని కలుసుకొని వారిని



గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. ఇలా టెస్టులు చేయించిన వారిలో 84 శాతం మందికి మెటాబాలిక్ డిస్ ఫంక్షన్ అసోసియేటెడ్ ఫ్యాటీ లివర్ డిసీజ్ ఉందన్న విషయం వెల్లడైంది. దీనికి ఐటీ ఉద్యోగుల జీవనశైలి.. పని ఒత్తిడితోపాటు.. వారి ఆహారం కూడా ఒక కారణంగా తేల్చారు. ఐటీ ఉద్యోగులు తీసుకునే ఆహారంలో అధిక క్యాలరీలతో పాటు తియ్యటి శీతల పానీయాలు ఉండటం.. శారీరక శ్రమ లేకపోవటంతోనే ఊబకాయం.. లివర్ సమస్యలు వస్తున్నట్లుగా గుర్తించారు. 2023 జూన్ నుంచి 2024 జూన్ వరకు 3450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. వైద్య పరీక్షలు చేయించుకున్న ఐటీ ఉద్యోగుల్లో 84 శాతం మంది ఊబకాయం.. ఫ్యాటీలివర్ తో పాటు ఇతర సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఇందులో ఐదు శాతం మందికి కాలేయం చుట్టూ కొవ్వు పేరుకుపోయింది. 71 శాతం యువకుల్లోనూ ఊబకాయం ఎక్కువగా ఉన్నట్లుగా గుర్తించారు. 34 శాతం మందిలో జీర్ణక్రియ అపసవ్యంగా ఉందని.. ఆహారం తక్కువగా తీసుకుంటునన అజీర్ణం సమస్య వీరిని వేధిస్తోందని.. దీనికి తోడు 10 శాతం మంది షుగర్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లుగా తేల్చారు. సో.. ఐటీ ఉద్యోగులే కాదు.. ఇతర రంగాల్లో పని చేసే వారు సైతం తాము తీసుకునే ఆహారం.. పని మీద కాస్త ఫోకస్ చేసి.. ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

చురకలు

## సంపాదకీయం

# అమెరికన్ సిటిజెన్ షిప్ అమ్మబడును రేట్ ఎంతంటే!

వీసా పాలసీని మార్చే దిశగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అడుగులు వేస్తున్నారు. అమెరికా ఫస్ట్ పేరుతో వరుస పెట్టి దూకుడు నిర్ణయాలు తీసుకుంటున్న ఆయన.. ఇప్పటివరకు సాగిన దానికి భిన్నమైన రీతిలో ఆయన నిర్ణయాలు ఉంటున్నాయి. అమెరికాకు నైపుణ్యం.. మేధోతనంతో తప్పించి మిగిలిన అంశాల్ని ప్రాతిపదికగా తీసుకోకపోవటం తెలిసిందే. వీసా జారీకి ఇప్పటివరకు అనుసరిస్తున్న విధానాలకు భిన్నంగా పెట్టుబడిదారులకు.. సంపన్న వలసదారులకు వీలుగా గోల్డెన్ కార్డు వీసాల్ని జారీ చేస్తామని.. దీంతో అమెరికా పౌరసత్వం పొందేందుకు మార్గం సులువు అవుతుందని ఆయన చెబుతన్నారు. ఇందులో భాగంగా అమెరికాలో 5 మిలియన్ డాలర్లు అంటే మన రూపాయిల్లో దగ్గర దగ్గర రూ.44 కోట్లుగా చెప్పొచ్చు. ఇంత భారీ పెట్టుబడులు పెట్టే వారికి గోల్డ్ కార్డును మంజూరు చేస్తామని చెబుతున్నారు. ఈ వీసాను పొందే వ్యక్తులు అమెరికాలో మరింత ధనవంతులు అవుతారని.. మరిన్ని విజయాలు సాధిస్తారని.. వాళ్లు ప్రభుత్వానికి పన్నులు చెల్లించటంతో పాటు ఉపాధి కూడా కల్పిస్తారని ఆయన చెబుతన్నారు. ఈ వీసా విధానం చాలా వరకు విజయవంతం అవుతుందని తాము భావిస్తున్నట్లుగా ట్రంప్ పేర్కొన్నారు. ఈ కొత్త విధానాన్ని ఓవల్ ఆఫీసులో మీడియాకు వెల్లడించారు ట్రంప్. దీనిపై వాణిజ్య మంత్రి హోవర్డ్ లట్నిక్ మాట్లాడుతూ.. మరో రెండు వారాల్లో ఈబీ5 వీసాలను ట్రంప్ గోల్డ్ కార్డుతో భర్తీ చేయనున్నట్లుగా చెబుతున్నారు. ఇది ఒకరకంగా శాశ్వత నివాస హోదాగా చెబుతున్నారు. చట్టబద్ధ పెట్టుబడిదార్ల పౌరసత్వం.. శాశ్వత నివాసాన్ని కల్పించేందుకు ఇది సాయం చేస్తుందని చెబుతున్నారు. ఇప్పటివరకు ఈబీ5 వీసా విధానాన్ని 1990 నుంచి అమలు చేస్తున్నా.. ఈ వీసా విధానంలో మోసాలు జరుగుతున్నట్లుగా గుర్తించారు. కొందరు అక్రమంగా నిధులు పొందుతున్న విషయాన్ని నాలుగేళ్ల క్రితం ఒక అధ్యయనంలో తేలింది. ఈ నేపథ్యంలో ఈబీ5 వీసాలకు గోల్డెన్ వీసాగా మార్చనున్నారు. ఇప్పటివరకు ఈబీ5 వీసాలకు ప్రతి ఏటా పరిమితంగా మాత్రమే జారీ చేసేవారు. అందుకు భిన్నంగా గోల్డ్ కార్డుపై అలాంటి పరిమితులు ఉండవని చెబుతున్నారు. తమ ప్రభుత్వం కోటి గోల్డ్ కార్డుల్ని ఇవ్వనున్నట్లుగా ట్రంప్ చెబుతున్నారు. ఈ తరహా గోల్డెన్ వీసాల్ని ప్రపంచ వ్యాప్తంగా 100కు పైగా దేశాలు జారీ చేస్తున్నాయి. ట్రంప్ కూడా ఇప్పుడు అదే బాట పడుతున్నారని చెప్పాలి.

# బిసిల చాంపియన్ శివశంకర్ - బిసిల పక్షపాతి శివశంకర్ - ఫిబ్రవరి 27... మాజీ కేంద్రమంత్రి శివశంకర్ వర్ధంతి




తామే వెనకబడిన తరగతుల వారికి నాయకులమని, తోటి వారి అభ్యున్నతే తమ ఏకైక లక్ష్యమని చాలా మంది వకాలతా పుచ్చుకుని, ఎన్నికల్లో, లేదా పదవులు పొందడంలో బిసి కార్డులను ఉపయోగించుకుని, తీరా పదవులు పొందాక, లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేయడం సర్వసాధారణం. కానీ అలాకాక తాము పొందిన పదవుల ద్వారా బిసిల అభివృద్ధికి పాటుపడిన వారు బహు అరుదుగా కనిపిస్తారు. అలా బీసీల అభివృద్ధికి తోడ్పడిన వాళ్లలో పుంజాల శివ శంకర్ గారు మొదటి వరుసలో ఉంటారు. కింది స్థాయి నుంచి ఎదిగి నాయకులూ అయ్యే వారు చాల మంది ఉంటారు, కాని ఒక బలహీన వర్గాల కుటుంబంలో అది కూడా ఒక పేద కుటుంబంలో పుట్టి దేశ రాజకీయలను ఒక దశాబ్దం పాటు శాసించే స్థాయికి ఎదగటం, అది కూడా ఇందిరా గాంధీ లాంటి శక్తిశాలికి కుడి భుజంలాగా ఉండటం, ఇందిర, రాజీవ్ అధికార నివాసాలకు పక్కనే ఎప్పటికీ ఇల్లు ఉండటం ఒక్క శివశంకర్ కే సాధ్యమైంది. బలహీన వర్గాల నాయకుడిగా పేరున్న శివశంకర్ తెలంగాణ మూన్నూరు కాపు కులానికి చెందిన నాయకుడు. 1929, ఆగస్టు 10న హైదరాబాద్ సమీపంలో ని మామిడి పల్లిలో ఆయన జన్మించారు. శివశంకర్ మెట్రిక్యులేషన్ వరకు హైదరాబాద్ లో చదివి ఆ తర్వాత చదువుకు ఇంట్లో ఇబ్బందులు ఏర్పడడముతో తన అన్నతో కలిసి పంజాబ్ కు వెళ్లి, కూలి పనులు చేస్తూ కొన్ని సందర్భాలలో తిండిలేక మజ్జిగ తాగుతూ, పల్లీలు తింటూ చదువుకుంటూ అమృత్ సర్ హిందూ కాలేజీ నుండి బీ.ఏ.పూర్తి చేశారు. తర్వాత ఉస్మానియా యూనివర్శిటీ నుంచి ఎల్ ఎల్ బి పూర్తి చేశారు. న్యాయ శాస్త్రాల్లో, ఇంగ్లీష్ భాషలో మంచి పట్టుగల శివశంకర్ హైదరాబాద్ లో న్యాయవాదిగా ప్రాక్టీసును ప్రారంభించి పేదల బడుగు బలహీన వర్గాల కేసులను ఉచితంగా కోర్టులలో వాదించేవారు. మంచి సమర్థుడైన న్యాయవాదిగా పేరు తెచ్చుకొని సిటీ సివిల్ కోర్ట్ బార్ అసోసియేషన్ కార్యదర్శిగా, 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 1972లో ఆంధ్రప్రదేశ్ లో వెనుకబడిన తరగతులకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఆ తర్వాత అనంతరామన్ కమిషన్ ప్రభుత్వానికి సూచనలు చేస్తూ బీసీ కులాలకు 30% రిజర్వేషన్లు ప్రతిపాదించింది. దీనిపై ఏపీ హైకోర్టులో 110 రిట్ పిటిషన్లు దాఖలయ్యాయి, అప్పుడు బీసీలకు 30% రిజర్వేషన్లు చెల్లవని హైకోర్టు తీర్పునివ్వగా... నాటి జేఏసి తరపున శివశంకర్ సొంత ఖర్చుతో 18 నెలలు ఢిల్లీలో ఉండి సుప్రీం కోర్టులో బీసీ రిజర్వేషన్లను గెలిపించుకొని తిరిగి వచ్చారు. 1974 నాటికి చిన్న వయసులోనే ఆంధ్రప్రదేశ్ హై కోర్ట్ జడ్జిస్థాయికి ఎదిగారు. ఆంధ్రప్రదేశ్ లోని న్యాయ వ్యవస్థలో ఒకే కులానికి చెందినవారు ఆధిపత్యం వహిస్తూ సీనియారిటి ప్యానల్ లో మిగతా వారిని పరిగణన లోకి తీసుకోక పోవడం గమనించి తను ప్రభుత్వ న్యాయమూర్తి పరిధిలో పేదల బడుగు బలహీన వర్గాల తరపున పోరాటం చేయలేక పోతున్నానని ఏకంగా ఉద్యోగానికి రాజీనామా చేశారు. చదువు కోవడమంటే ప్రభుత్వ ఉద్యోగం సాధించడము సమాజాన్ని పట్టించు కోకుండా వ్యక్తిగత ఎదుగుదలే ముఖ్యంగా భావించే నేటి తరానికి సమాజం కోసం హై కోర్ట్ జడ్జి స్థాయి ఉద్యోగాన్ని వదులుకోవడము ఆయన చిత్తశుద్ధికి, త్యాగ నిరతికి నిదర్శనం. హై కోర్టు జడ్జిగా రాజీనామా చేసి హైకోర్టు, సుప్రీం కోర్టులల్లో న్యాయ వాదిగా ప్రాక్టీసు చేస్తూ అన్ని వర్గాలకి సామాజిక న్యాయం విషయములో అధ్యయనం చేస్తుండే వారు. ఆయన మొదటి సారి గా 1977 లో ఇందిరాగాంధీని కలుసుకున్నా తమ అపార న్యాయ విజ్ఞానంతో ఆమె మనసు చూరగొనడమే కాకుండా అతితక్కువ కాలంలో ఆమెకు అత్యంత సన్నిహితుడయ్యారు. 1974-75లో ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు. 1977 లో ఎమర్జీన్సీ తర్వాత ఆయన ఇందిగా గాంధీకి న్యాయవాదిగా కూడా ఉన్నారు. 1979లో సికిందరాబాద్ నుంచి లోక్ సభకు ఎన్నికయ్యారు. ఆ నియోజకవర్గం నుంచి 1980 లో రెండో సారి ఎన్నికయ్యారు. 1981లో ఇందిరాగాంది మంత్రివర్గంలో చాలా కీలకమయిన నాయకుడిగా ఉన్నారు. 1985లో శివశంకర్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1993 దాకా రాజ్యసభలోనే కొనసాగారు. ఈ మధ్యలో ఆయన విదేశీ వ్యవహారాల శాఖ, మానవ వనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. కొద్ది రోజులు ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్ గా కూడా పనిచేశారు. 1988-89 లో రాజ్యసభ కాంగ్రెస్ పక్ష నాయకుడిగా ఉన్నారు. తర్వాత సిక్కిం, కేరళ వర్నర్ గా నియమితులయ్యారు. 1998లో తెనాలి నుంచి లోక్ సభ కు పోటీచేసి గెలుపొందారు. ప్రధాని నివాసానికి దగ్గరలో 5, సఫ్దర్ జంగ్ లేన్ బంగళాను ఆయన కేటాయించారు. ఇంధన శాఖను నిర్వహించిన సమయంలో, రాజకీయ జోక్యం లేకుండా, పెట్రోలు బంకులు, గ్యాస్ ఏజెన్సీల కేటాయింపులను క్రమబద్ధీ కరించారు. మానవ వనరుల శాఖ మంత్రిగా కేంద్రీయ విద్యాలయాల విస్తరణకు కృషి చేశారు. ఇందిరాగాంధి మరణానంతరం రాజీవ్ గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడానికి ముఖ్య పాత్ర పోషించిన శివశంకర్ మెదక్ (గతములో ఇందిరాగాంధి గెలిచిన స్థానం) నుండి లోక్ సభకు పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోవడముతో 1985 నుండి 1993 వరకు గుజరాత్ నుండి రాజ్యసభకు ఎన్నికై కేంద్ర వాణిజ్య శాఖామంత్రిగా 1985 లో ,1986 లో విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖనూ నిర్వహించారు. ఏ సభలో సభ్యత్వం లేని రోజులలో కూడా ఆయనకు ప్రధాని నివాసంతో విడదీయని సంబంధాలు ఉండేవి. అందుకే సఫ్దర్ జంగ్ లేన్ నివాసం చాలాకాలం కొనసాగింది. ఇందిర, రాజీవ్ కాలంలో అన్ని కీలకమయిన పార్టీ, ప్రభుత్వ నిర్ణయాలలో ఆయన పాత్ర వుండేది. రాజీవ్ హయంలో చాలా కీలకమయిన నిర్ణయాలెన్నో తీసుకున్నా సరే ఆయన పనితీరు ఎపుడూ వివాదాస్పదం కాలేదు. ఆయన కూడా ఎపుడూ వార్తలక్కే ప్రయత్నం చేయలేదు. రాజీవ్ దూతగా ఆయన నేపాల్, బంగ్లాదేశ్ లను సందర్శించి ఇరుగు పొరుగు దేశాలతో సత్సంబంధాలు నెలకొల్పడంలో ప్రధానికి బాగా సహకరించే వారని ఆయన మిత్రులు చెబుతారు. పంజాబ్ ఒప్పందంలో కూడా శివశంకర్ కీలక ప్రాత పోషించారని చెబుతారు. కాంగ్రెస్ లో సరైన గుర్తింపు లేక, స్వార్థ రాజకీయాలకు తట్టుకోలేక 2004 లో ఆయన కాంగ్రెస్ ను వదిలేశారు. 2017 ఫిబ్రవరి 27న ఆయన మరణించారు. శివశంకర్ జీవితాంతం అంబేద్కర్ , ఫూలే ఆదర్శంగా, ఆ మహా నాయకుల కాన్సెప్ట్ మీద పని చేశారు. జ్యుడీషియల్ తో సహ అన్నీ రంగాల్లో దళితులకు ప్రాతినిధ్యం ఉండాలని శివశంకర్ కోరుకునే వారు. ఇందిరా గాంధీ పక్షాన కేసులను వాదించి, ఆమెకు అత్యంత సన్నిహితులుగా ఉండేవారు. రాజీవ్ గాంధీ హయంలో ప్రభుత్వంలో ప్రధాని తర్వాత చాలా పలుకుబడి ఉన్న వ్యక్తి శివశంకరే. నేడు, పి శివ శంకర్ ప్రధానమంత్రి తర్వాత దేశములో అత్యంత శక్తివంతమ్కెన వ్యక్తి" 1986 నాటికి ఇండియా టుడే పత్రిక రాసిన కథనాని బట్టి శివశంకర్ పలుకుబడి ఏ పాటిదో చెప్పకనే చెపుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# బ్రిటీష్ పాలకులకు సింహ స్వప్నం చంద్రశేఖర ఆజాద్ - ఫిబ్రవరి 27 ... ఆజాద్ వర్ధంతి

భారత స్వాతంత్ర ఉద్యమంలో దేశమాత విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి అమరుడైన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా, అష్ఫాకుల్లా ఖాన్‌ల సహచరుడిగా బ్రిటీషువారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆజాద్ గర్వించదగ్గ అసహాయ శూరుడు, అసమాన వీరుడు. భగత్ సింగ్ మార్గ నిర్దేశకుడిగా పేరుగాంచిన ఆజాద్ పూర్తిపేరు చంద్రశేఖర సీతారామ్ తివారి. ఆయన "పండిత్‌జీ"గా కూడా పిలువబడ్డాడు. 1857 తరువాత సాయుధ పోరాటం చేసిన వీరుల్లో మొట్టమొదటి వాడు, దేశ ప్రజల రక్షణ కోసం ధర్మ యుద్ధమే సరైనది గట్టిగా నమ్మినవాడు ఆజాద్. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఝాబువా జిల్లా, బావ్రా గ్రామంలో పండిట్ సీతారామ్ తివారి, జగరానీ దేవీలకు 1906 జూలై 23వ తేదీన చంద్రశేఖర్ ఆజాద్ జన్మించాడు. ప్రాథమిక విద్యను సొంత గ్రామం లోనే పూర్తి చేసి, తర్వాత వారణాసిలో సంస్కృత పాఠశాలలో హయ్యర్ సెకండరీ విద్యను అభ్యసించాడు. ఆయన చిన్నప్పటి నుంచి హనుమాన్ భక్తుడిగా ఉండేవాడు. 1919 లో అమృత్‌సర్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ దుర్ఘటనతో తీవ్రంగా కలత చెందిన ఆజాద్.. ఆ తరువాత 1921లో మహాత్మా గాంధీ నడిపిన సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. ఈ ఉద్యమంలో పాల్గొన్న నేరానికి తన పదిహేనేళ్ల ప్రాయంలోనే అరెస్టయ్యాడు. విచారణ సందర్భంగా కోర్టులో ఆయనను విచారిస్తున్న బ్రిటిష్ న్యాయాధికారి ఖరేఘాట్‌కు ఆ బాలుడిచ్చిన సమాధానంతో మతి పోయింది. వాస్తవానికి తన పేరు 'ఆజాద్' అని, తన తండ్రి పేరును 'స్వతంత్రం', తన నివాసం 'జైలు' అని చెప్పాడు. "మతిపోయిన ఆ న్యాయాధికారి చిదిమితే పాలుగారే ముఖారవిందుడైన ఆ బాలుడిని చూస్తూ కూడా అధికార దర్పంతో '15 కొరడాల దెబ్బల' శిక్ష ప్రకటించాడు. నరరూప రాక్షసులు కొరడా ఝుళిపిస్తూ ఒక్కొక్క దెబ్బ కొడుతుంటే.. ఆ బాలుని శరీరమంతా రక్తసిక్తమై పోయింది. అయినా ఆ బాలుడు దెబ్బ పడినపుడు వందేమాతరం, భారత్‌మాతాకీ జై అంటున్నాడు. ఈ ధైర్యం చాలా గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ రోజు నుండి ఆయన పేరు 'చంద్ర శేఖర్ ఆజాద్' గా మారింది. "సహాయ నిరాకరణోద్యమం ఆజాద్‌లో దాగి ఉన్న విప్లవ వాదిని మేల్కొలిపింది. ఎలాగైనా సరే భారత దేశాన్ని బ్రిటీష్‌వారి కబంధ హస్తాల నుంచి విడిపించాల్సిందే నని ఆయన బలంగా నిశ్చయించు కున్నాడు. అనుకున్నదే తడవుగా ఆయన హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌ను స్థాపించాడు. భగత్ సింగ్, సుఖదేవ్, తదితరులకు మార్గ నిర్దేశకుడిగా మారి పోయాడు. ఆజాద్... 1926లో కకోరీ ట్రైన్ దోపిడీ, అదే సంవత్సరంలో వైశ్రాయి రైలును కాల్చి వేయడం, లాలా లజపతి రాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ వారిపై పగతీర్చు కోవడానికి 1928వ సంవత్సరంలో లాహోర్‌లో జె.పి. సాండర్స్‌ను కాల్చి వేయడం తదితర హింసాత్మక కార్యక్రమాల్లో పాలు పంచు కున్నాడు. ఒకానొక దశలో ఆజాద్ బ్రిటీష్ పోలీసులకు సింహస్వప్నంలా నిలిచారు. పోలీసుల హిట్‌లిస్ట్‌ను తయారు చేసుకున్న ఆయన వారిని చంపేదాకా వదిలి పెట్టలేదు. పదిహేనేళ్ల ప్రాయంలో అరెస్టయిన తరువాత బయటికి వచ్చి పోరాటంలో పాలు పంచుకున్న ఆజాద్... ఆ తరువాత తన మరణం దాకా కూడా ఒక్కసారి కూడా పోలీసులకు చిక్కలేదు. 1931, ఫిబ్రవరి 27వ తేదీన తన ఇద్దరు సహచరులను కలిసేందుకు అలహాబాదు లోని ఆల్ఫ్రెడ్ పార్క్‌కు చేరుకోగా, ఇన్ఫార్మర్లు ఇచ్చిన సమాచారం మేరకు బ్రిటీష్ పోలీసులు చుట్టు ముట్టారు. ఆజాద్‌ను లొంగి పోవాలంటూ హెచ్చరికలు చేశారు. అయినా కూడా మొక్కవోని ధైర్యంతో పోలీసులకు ఎదురు తిరిగాడు. వెంబడిస్తున్న పోలీసుల్లో ముగ్గురిని కాల్చి చంపాడు. ఐనా తరుముతూ వస్తున్న పోలీసులకు చిక్కే పరిస్థితి వచ్చింది. ఇక తుపాకీలో ఒకే ఒక్క బుల్లెట్ వుంది. దానితో వాళ్లను మట్టుబెట్ట లేనని తెలుసుకుని, బ్రిటిష్ వారి చేతిలో చనిపోవడం కంటే తనకు తానే ఆత్మత్యాగం చేసుకోవాలను కున్నాడు. వెంటనే తుపాకీని తన తలకు గురిపెట్టి కాల్చుకుని అమరడయ్యాడు. "నీలో ఉన్నది ఉప్పునీరా? అయితే నీకోసమే బతుకు. కాదూ ఉడుకు రక్తమంటావా? అయితే దేశం కోసం మరణించు. నీ దేహం నిప్పుకణాల కొలిమి అయితే అనుక్షణం నీ ప్రాణాన్ని సంఘానికి సమర్పించు. నీ గుండెకాయ పత్తికాయ అయితే భరత మాతను మరిచిపోయి నీ సుఖమే చూసుకో" - ఇలా రోమాలు నిక్కబొడుచు కునేలా పలికిన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్. బతికుండగా బ్రిటీష్ వారు నన్ను పట్టుకోలేరు. వాళ్ళకు అంత దమ్ము లేదు. అని పదే పదే ఆజాద్ అంటుండే వాడు. "నా చావు నా చేతుల్లోనే ఉంది, శత్రువుల చేతుల్లో చావను" అంటూ చిన్ననాడు చేసిన శపథం నిజంచేస్తూ, పోలీసులకు చిక్కక, పిస్తోలుతో పేల్చుకుని స్వతంత్ర జీవిగా అస్తమించాడు. అజాద్ పోరాడిన తీరు భారతదేశ స్వాతంత్ర చరిత్రకే వన్నె తెచ్చిన ఘటన. భారతీయ యువతకు ఒక మహోజ్వల ప్రేరణ, అసమాన ఉదాహరణ. చివరిదాకా ఆజాద్‌ను ప్రాణాలతో పట్టుకోవాలని భావించిన బ్రిటీష్ పోలీసులు సాధ్యంకాక... ఆయన మృత దేహాన్ని స్వాధీనం చేసుకోవాల్సి వచ్చింది. ఆజాద్ ఆత్మత్యాగం ప్రజల్లో మరింత పట్టుదలను పెంచి, దేశభక్తిని రగిల్చింది. పోరాట పథం పట్టేలా ప్రోత్సహించింది. ఆజాద్ మరణించిన అలహాబాదు లోని ప్రయాగ్‌రాజ్ పార్కుకు చంద్రశేఖర్ ఆజాద్ పార్కుగా నామకరణం చేయబడింది. మరణించే సమయంలో 'ఆజాద్' వద్ద ఉన్న పిస్టల్ అలహాబాద్ మ్యూజియంలో ప్రదర్శించబడింది. 1988లో భారత ప్రభుత్వం చంద్రశేఖర్ ఆజాద్ ముఖచిత్రంతో తపాలా బిళ్ళను విడుదల చేసింది. 1965లో షహీద్ సినిమాతో ప్రారంభించి పలు భాషలలో ఎన్నో సినిమాలు నిర్మించ బడ్డాయి. 2018లో టెలివిజన్ సీరీస్ తీయబడింది. చంద్రశేఖర్ ఆజాద్ జన్మించిన మధ్య ప్రదేశ్‌లోని భభ్రా (భవ్రా) గ్రామం చంద్రశేఖర్ ఆజాద్ నగర్‌గా పిలవడం జరుగుతోంది.



**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# గణేశ వాసుదేవ్ మావలాంకర్... భారత లోక్‌సభ తొలి స్పీకర్ - ఫిబ్రవరి 27.. దాదాసాహెబ్ వర్ధంతి




గణేశ్ వాసుదేవ్ మావలాంకర్ భారత ప్రజాస్వామ్య నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహా నాయకుడు. భారత లోక్‌సభ తొలి స్పీకర్ (1952-1956) గా ఆయన వ్యవహరించారు. పార్లమెంటరీ వ్యవస్థను పరిపక్వత చెందేలా తీర్చిదిద్దడంలో, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడడంలో ఆయన చేసిన కృషి అమూల్యమైనది. ఆయన "దాదాసాహెబ్" గా ప్రఖ్యాతి గాంచారు. గణేశ్ వాసుదేవ్ మావలాంకర్ 27 నవంబర్ 1888న రత్నగిరి, బొంబాయ్ ప్రెసిడెన్సీ (ప్రస్తుత మహారాష్ట్ర)లో జన్మించారు. గుజరాత్ అహ్మదాబాద్ కళాశాలలో విద్యను అభ్యసించి పట్టభద్రుడయ్యారు. చిన్ననాటనే చదువుపట్ల ఆసక్తిని కనబరిచారు. విద్యాభ్యాసం పూర్తి చేసిన తర్వాత న్యాయవాదిగా తన కెరీర్‌ను ప్రారంభించారు. అయితే, స్వాతంత్ర్య పోరాటం పట్ల ఆసక్తి పెరిగి, ఆయన న్యాయవాద వృత్తిని వదిలి జాతీయోద్యమంలో పాల్గొన్నారు. గాంధీయ సిద్ధాంతాల ప్రభావంతో సహాయ నిరాకరణలో చురుకుగా పాల్గొన్నారు. భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడిగా స్వాతంత్ర్య ఉద్యమంలో ముందుండి నాయకత్వం వహించారు. 1937లో బ్రిటిష్ ప్రభుత్వం నిర్వహించిన బొంబాయ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ఎన్నికల్లో గుజరాత్ నుండి విజయం సాధించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. 1946లో కేంద్ర శాసనసభ స్పీకర్ గా ఎన్నికయ్యారు. భారతదేశానికి స్వాతంత్ర్యం రాగానే రాజ్యాంగ సభలో సభ్యుడిగా ఎంపికయ్యారు. 1952లో భారత తొలి సాధారణ ఎన్నికల్లో అహ్మదాబాద్ నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 15 మే 1952 నాడు భారత తొలి లోక్‌సభ స్పీకర్ గా బాధ్యతలు స్వీకరించారు. భారత పార్లమెంటరీ విధానాలను పరిపక్వంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. పార్లమెంటరీ నియమాలను స్థిరపరిచేందుకు, లోక్‌సభ కార్యకలాపాలను సమర్థవంతంగా నడిపేందుకు అనేక మార్గదర్శకాలను రూపొందించారు. స్పీకర్‌గా ఆయన నిష్పాక్షికత, నైతిక విలువలు, గౌరవప్రదమైన ప్రవర్తనకు మార్గదర్శకంగా నిలిచారు. గణేశ్ వాసుదేవ్ మావలాంకర్ స్పీకర్‌గా ఉన్న సమయంలో అనేక ముఖ్యమైన పార్లమెంటరీ విధానాలను ప్రవేశపెట్టారు: పార్లమెంటరీ చర్చల్లో సభ్యులు శాసనసభలో గౌరవప్రదంగా వ్యవహరించేలా నియమాలు రూపొందించారు. లోక్‌సభలో ప్రశ్నల సమయాన్ని అమలు చేసి, ప్రభుత్వాన్ని బాధ్యతాయుతంగా ఉంచేలా చేశారు. పార్లమెంటు కార్యకలాపాలకు సంబంధించిన స్పష్టమైన నియమాలను అమలు చేశారు. లోక్‌సభ స్పీకర్ అనేది రాజకీయాలకు అతీతమైన పదవి అని ఆయన నమ్మకం. అహ్మదాబాద్ ఎడ్యుకేషన్ సొసైటీ అనే విద్యాసంస్థను స్థాపించి విద్యా అభివృద్ధికి కృషి చేశారు. గుజరాత్ వెర్నాక్యులర్ సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. గుజరాత్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు నిధుల సమీకరణలో సహాయ పడ్డారు. "భారత పార్లమెంటు పితామహుడు" అనే గౌరవాన్ని అందుకున్నారు. లోక్‌సభ సెక్రటేరియట్ "%+ఎ% మావలాంకర్ హాల్" ను ఆయన జ్ఞాపకార్థం నిర్మించారు."%+ఎ% మావలాంకర్ అవార్డు" ను ఉత్తమ పార్లమెంటేరియన్‌లకు ప్రదానం చేస్తున్నారు."మావలాంకర్ చాంపియన్‌షిప్ ట్రోఫీ" పేరిట ఒక క్రికెట్ ట్రోఫీ ఉంది. భారత పార్లమెంటులో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 1956, ఫిబ్రవరి 27 న గణేశ్ వాసుదేవ్ మావలాంకర్ అహ్మదాబాద్ లో మరణించారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం ఆయన చేసిన సేవలు నేటికీ ప్రజాస్వామ్య బలపాటుకు ప్రేరణగా నిలుస్తున్నాయి. గణేశ్ వాసుదేవ్ మావలాంకర్ భారత ప్రజాస్వామ్య స్థాపనలో కీలక పాత్ర పోషించిన మహానాయకుడు. లోక్‌సభను సజావుగా నడిపించేలా నియమాలను రూపొందించడం, పార్లమెంటరీ చర్చలను విలువైనవిగా మార్చడం, ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడేందుకు మార్గదర్శకత్వం వహించడం వంటి అనేక రంగాల్లో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనది. "భారత పార్లమెంటరీ వ్యవస్థకు బలమైన పునాది వేసిన మహానేత మావలాంకర్!" **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్...9440595494**

# మెనూ కొత్తది.. వసతులు పాతవే!

సిరిసిల్ల : 'రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల సాంఘిక సంక్షేమ వసతి గృహంలో రెండేళ్లుగా శుద్ధజల యంత్రం పనిచేయడంలేదు. గతేడాది డిసెంబరులో కలెక్టర్ తనిఖీలో విద్యార్థులు తాగునీటి సమస్యను ప్రస్తావించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మరమ్మతులకు ప్రణాళికలు రూపొందించి నాలుగు రోజులు క్రితం బాగు చేయించారు. విద్యార్థులకు శుద్ధజలం అందుబాటులోకి వచ్చింది.'పేద... మధ్యతరగతి విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన కార్పొరేట్ స్థాయి ఉచిత విద్యనందించే గురుకులాలు బాలారిష్టాలను వీడటంలేదు. కామన్ మెనూ విధానం తీసుకొచ్చినా.. అమలు చేసేందుకు అవసరమైన వసతులు లేవు. భోజనశాలల్లో అపరిశుభ్రత కారణాలతో ఉమ్మడి జిల్లాలో నిత్యం ఎక్కడో ఒకచోట విద్యార్థులు అస్వస్థతకు గురవుతూనే ఉన్నారు. వసతి గృహాలకు ప్రభుత్వం గతేడాది సెప్టెంబరులో జిల్లాల వారీగా ప్రత్యేకాధికారులను నియమించింది. అధికారులు మొక్కుబడి తనిఖీలతో సరిపెడుతున్నారు. ఇందులో బహిర్గతమవుతున్న సమస్యలు పరిష్కరిస్తున్నా చాలాచోట్ల పర్యవేక్షణ నామమాత్రంగా సాగుతోంది.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 175 గురుకులాలు ఉండగా.. అందులో 58,455 మంది విద్యార్థులు చదువుతున్నారు. సాంఘిక సంక్షేమ వసతిగృహాలు కొంతవరకు పక్కాభవనాలు బీసీ, మైనార్టీ పూర్తిగా అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. ఇక్కడ మౌలిక వసతుల సమస్య తీవ్రంగా ఉంది. పక్కాభవనాలు ఉన్నచోట విద్యార్థులు ఎక్కువ.. మరుగుదొడ్లు, స్నానాల గదులు తక్కువగా



ఉన్నాయి. అరకొర వసతుల మధ్య చదువుసాగుతోంది. దీంతో విద్యార్థులు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. పక్కాభవనాల నిర్మాణాలకు స్థలాలను పరిశీలించినా.. నిర్మాణాలు, నిధుల మంజూరు కార్యరూపం దాల్చడంలేదు.

గతేడాది ప్రభుత్వం గురుకులాల్లో కామన్ మెనూ అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. కాగా మెనూలో పేర్కొన్నట్లు ఆహారపదార్థాలు ఎంత ధరలో కొనాలనే దానిపై స్పష్టత రాలేదు. ఒక్కో జిల్లాలో డీపీసీ నిర్దేశిత ధరలు ఒకలా ఉన్నాయి. కాగా ప్రభుత్వం అన్ని జిల్లాలు, తరగతులకు కామన్‌మెనూ ఇచ్చింది. దీని అమలులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కామన్ మెనూలో చూపించిన ఆహారపదార్థాలు వండేందుకు పరికరాలు, అదనపు సిబ్బంది అవసరం. అలాగే గదులు శుభ్రం చేసేందుకు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలి.

జిల్లా విద్యాధికారులకు గురుకులాలపై పర్యవేక్షణ బాధ్యతలు లేవు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో ప్రాంతీయ సమన్వయకర్తలు చూసుకోవాలి. బీసీ, మైనార్టీ సొసైటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పర్యవేక్షణ జరుగుతోంది. ఎస్సీ, ఎస్టీలకు ఉమ్మడి జిల్లాలో ఉన్నా సరిపడా సిబ్బంది లేరు. దిగువ స్థాయి సిబ్బందికే అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో సమస్యల పరిష్కారం.. మెరుగైన వసతులు అందడం గగనంగా మారుతోంది.


# వివాహ ధ్రువపత్రాలకు అక్రమ వసూళ్లు

కరీంనగర్: కరీంనగర్ గ్రామీణ మండలంలో ఇటీవల వివాహ ధ్రువీకరణ పత్రానికి ఓ జంట స్థానిక గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకున్నారు. గ్రామ కార్యదర్శి విచారించి ఉచితంగా జారీ చేయాల్సి ఉండగా.. ఛార్జీ వసూలు చేశారు.

అదే మండలానికి చెందిన మరొకరికి సైతం డబ్బులు వసూలు చేసి గ్రామ పంచాయతీ రసీదు అందజేశారు. ఇలా ప్రజలపై పంచాయతీ అధికారులు అదనపు భారం మోపుతున్నారు.

**సామాన్యులపై భారం**

గ్రామాలకు సకాలంలో నిధులు అందకపోవడం.. పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో పంచాయతీల నిర్వహణకు సొంతంగా ఆదాయ వనరులపై దృష్టి పెడుతున్నారు. సాధారణ సేవలకు సైతం



రుసుము వసూలు చేస్తున్నారు. అందుకు అధికార యంత్రాంగం సైతం సహకరించడంతో ప్రజలు పంచాయతీ కార్యాలయం నుంచి ఉచితంగా తీసుకునే ధ్రువీకరణ పత్రాలకు డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. తిరిగి ప్రశ్నిస్తే పంచాయతీరాజ్ నూతన చట్టం చేసిందని నమ్మ బలుకుతున్నారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రుసుంలు విధించేందుకు పంచాయతీరాజ్ కమిషనర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కేవలం పంచాయతీలో తీర్మానం ఆధారంగానే సాధారణ సేవలకు ఛార్జీలు వసూలు చేస్తూ ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారు.


**వీటిపై దృష్టి పెడితే ఆదాయం**

పల్లెల్లో ప్రజల నెత్తిన పన్నుల భారం మోపకుండా ఇతర ఆదాయ మార్గాలపై అధికారులు దృష్టి నిలిపాలి. పలు గ్రామాల్లో ఇల్లు నిర్మించుకున్నాక ఇంటి నంబరుకు మాత్రమే పన్ను వసూలు చేస్తుంటారు. అదే ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకుంటే రెండు విధాలుగా ఆదాయం సమకూరనుంది. అలాగే ఇళ్ల నుంచి సేకరించిన చెత్త ద్వారా సేంద్రియ ఎరువును తయారు చేసి ఆదాయం పొందవచ్చు.

**చర్యలు తీసుకుంటాం**

కార్యదర్శులు ధ్రువీకరణ పత్రాల జారీకి డబ్బులు వసూలు చేయడం మా దృష్టికి వచ్చింది. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. జిల్లా పంచాయతీ అధికారి పవన్‌కుమార్

# త్రిముఖ పోరు.. ప్రచార జోరు



కరీంనగర్ : ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సమయం సమీపిస్తున్న కొద్దీ ప్రధాన పార్టీలు జోరు పెంచాయి. ముఖ్యంగా పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి క్షేత్ర స్థాయిలో రసవత్తర పోరు కనిపిస్తోంది. అభ్యర్థులు, పార్టీల పోటాపోటీ ప్రచారంతో ఓటర్లను ఆకట్టుకునే పనిలో నిమగ్నమయ్యాయి. ప్రచారానికి కేవలం రెండు రోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో హామీల అస్త్రశస్త్రాలను సంధిస్తున్నారు. నేరుగా ఓటర్లను కలిసే ప్రయత్నాలు చేస్తున్నారు. వారం రోజులుగా ఉమ్మడి జిల్లాలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, భాజపా, బీఎస్పీలు సమావేశాల నిర్వహణతో ప్రచారాన్ని తారా స్థాయికి తీసుకెళ్లాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అభ్యర్థుల ప్రచారం రసవత్తరంగా సాగుతోంది. ప్రధానంగా పట్టభద్రుల స్థానంలో త్రిముఖ పోటీ ఉండగా మిగతా అభ్యర్థులు కూడా గెలుపే లక్ష్యంగా ప్రయత్నిస్తున్నారు.

**కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మకం**

సిట్టింగ్ ఎమ్మెల్సీ స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇందుకోసం పీసీసీ అధినేత సహా రాష్ట్ర మంత్రులంతా 15 జిల్లాల పరిధిలో ప్రచారం ముమ్మరం చేశారు. అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే నిరుద్యోగులు, ఉద్యోగుల ఆకాంక్షలను నెరవేరుస్తామంటూ హామీలిస్తున్నారు. అదే సమయంలో ప్రత్యర్థి పార్టీల వైఫల్యాలను ఓటర్లకు అర్థమయ్యేలా వివరిస్తూ మొదటి ప్రాధాన్య ఓటే లక్ష్యంగా పెట్టుకున్నారు. మండలాలు, గ్రామాల వారీగా కమిటీలు వేసి ఓటర్లను కలిసే బాధ్యతలను పార్టీ శ్రేణులకు అప్పగించారు. ప్రతి 50 మంది ఓటర్లకు ఒక ఇన్‌ఛార్జిని నియమించి ఓటర్ల మెప్పు పొందే పనిలో తలమునకలయ్యారు.

**బీఎస్పీ ప్రత్యేక పోరాట పంథా**

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణ తనదైన పోరాట పంథా కనబరుస్తున్నారు. సహాయ ఆచార్యుడి ఉద్యోగాన్ని వదిలి ఎన్నికల బరిలో నిలిచిన ఆయన గెలుపు కోసం శ్రేణులు ప్రచార జోరు చూపిస్తున్నాయి. బీసీ నినాదాన్ని ఎత్తుకొని ఎట్టి పరిస్థితుల్లో తమ అభ్యర్థిని గెలిపిస్తామంటూ ప్రచార వేగాన్ని పెంచారు. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా కొత్త ఎజెండాతో ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా వివిధ సంఘాల మద్దతుతో విజయం సాధిస్తానన్న ధీమాతో హరికృష్ణ ఉన్నారు.

**భాజపా కదన కుతూహలం**

పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేల బలం ఉన్న స్థానంలో రెండు ఎమ్మెల్సీలను గెలవాలన్న కుతూహలాన్ని కమలనాథులు కనబరుస్తున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కొమరయ్యను, పట్టభద్రుల స్థానానికి అంజిరెడ్డిని బరిలో దింపిన కమలం పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొంది. ప్రత్యర్థులకు తీసిపోకుండా ప్రచారంలో గట్టి పోరాటం చూపుతోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీగా ప్రజలకు సరికొత్త హామీలు ఇస్తూ ఇటు ఉపాధ్యాయులను, అటు పట్టభద్రులను తమ వైపునకు తిప్పుకోవడానికి దూకుడు పెంచింది. ఎట్టి పరిస్థితుల్లోనూ రెండు స్థానాల్ని కైవసం చేసుకోవాలని కాషాయ దండు భావిస్తోంది.

# బలోపేతం దిశగా రైతు వేదికలు




కరీంనగర్ : అన్నదాతలకు మరిన్ని సేవలందించేందుకు రైతు వేదికలను బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. వేదికల్లో సాంకేతిక విజ్ఞానం పెంచేందుకు తాజాగా జిల్లాల నుంచి ప్రతిపాదనలు కోరింది. అంతేగాకుండా వాటి సమర్థ నిర్వహణకు ప్రతి నెలా నిధులు విడుదల చేయడానికి సంసిద్ధత తెలిపింది. జిల్లాలో రైతు వేదికల బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర సమాచారం పంపించాలని జిల్లా వ్యవసాయ శాఖను ప్రభుత్వం కోరింది. ప్రభుత్వ నిర్ణయం కార్యరూపం దాల్చితే ఎంతో ప్రయోజనం చేకూరే అవకాశముంది.

**అక్కడే వ్యవసాయ కార్యాలయం**

అన్నదాతకు ఆధునిక సాంకేతికత అందించడం, అధిక దిగుబడుల సాధన, రైతు సమస్యలు చర్చించేందుకు వీటిని నిర్మించారు. రైతులు పట్టణాలకు వెళ్లకుండా సమీపంలోనే అన్ని రకాల సహాయ సహకారాలు అందించడం వీటి ప్రధాన లక్ష్యం. సమావేశాలతోపాటు అవసరాన్ని బట్టి గోడౌన్లు, విత్తన, ఎరువులు, ధాన్యం నిల్వ కేంద్రాలుగా సైతం వినియోగించాలని నిర్ణయించారు. వేదిక భవనాల్లోనే వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈవో) కార్యాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**పెరగనున్న రైతు నేస్తం కేంద్రాలు**

ప్రస్తుతం జిల్లాలోని కరీంనగర్ అర్బన్ మండలం మినహా మిగిలిన 15 మండల కేంద్రాల్లో మాత్రమే రైతు నేస్తం కేంద్రాలున్నాయి. వీటిలో రైతులు నేరుగా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనే అవకాశముంటుంది. ఆధునిక సాంకేతికత ద్వారా పంటల సాగు విధానంపై శాస్త్రవేత్తలతో మాట్లాడటం, వారి సలహాలు, సూచనలు వినడం ఫలితాన్నిస్తుంది. దీంతో మండలానికి మరో రెండు రైతు నేస్తం కేంద్రాల ఏర్పాటుకు తాజాగా ప్రభుత్వం ప్రతిపాదనలు కోరింది. ఇవి అందుబాటులోకి వస్తే మరింత మంది రైతులకు అవసరమయ్యే సాంకేతిక విజ్ఞానం అందనుంది.

**రూ.15.02 కోట్లతో 76 వేదికలు**

జిల్లాలో 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్ చొప్పున 76 వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. ఒక్కో దాంట్లో 10 గుంటల స్థలం మొదలుకొని ఎకరం వరకు కేటాయించి 76 రైతు వేదికలను నిర్మించారు. ఒక్కో భవనం సుమారు రూ.20 లక్షల వ్యయంతో 2,046 చదరపు అడుగుల విస్తీర్ణంలో పెద్ద హాల్, రెండు గదులుండేలా రూ.15.02 కోట్లను ఖర్చు చేసి నిర్మాణాలు చేపట్టారు.

**బలోపేతానికి చర్యలు**

రైతు వేదికలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. అందుకు అవసరమైన ప్రతిపాదనలు సైతం అన్ని జిల్లాల నుంచి కోరారు. వీటి సంపూర్ణ లక్ష్యం రైతులకు ప్రయోజనం చేకూర్చడమే. భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి

# పర్యావరణ హితం.. ప్రజా భాగస్వామ్యం



ధర్మారం: పర్యావరణ పరిరక్షణకు, విద్యుదుత్పత్తిలో ప్రజా భాగస్వామ్యాన్ని పెంచడానికి ఇంటింటికీ సౌరశక్తి ప్లాంట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా ఇళ్లు, వ్యవసాయ బావులు, బోర్ల వద్ద యూనిట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పైలట్ ప్రాజెక్టు కింద నియోజకవర్గానికి ఒక గ్రామంలో ఈ పథకాన్ని అమలు చేయనుండగా ఉమ్మడి జిల్లాలో మొదట పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం, కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామాలను ఎంపిక చేశారు. ఈ రెండు చోట్ల ఎన్పీడీసీఎల్ సిబ్బంది ఇంటింటికీ తిరిగి గృహ, వ్యవసాయ క్షేత్రాల వద్ద పంపుసెట్ల వివరాలు సేకరించి ఆన్‌లైన్లో నిక్షిప్తం చేశారు.

**గరిష్ఠంగా రూ.78 వేల రాయితీ**

'పీఎం-సూర్యఘర్.. ముఫ్త్ బిజిలీ యోజన'లో భాగంగా కిలోవాట్ నుంచి మూడు కిలోవాట్ల వరకు సౌరశక్తి యూనిట్ల ఏర్పాటుకు అవకాశం కల్పించారు. ఒక కిలోవాట్ యూనిట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్ల యూనిట్‌కు రూ.60 వేలు, మూడు, అంతకన్నా ఎక్కువ కిలోవాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసుకున్నా గరిష్ఠంగా రూ.78 వేల రాయితీ ఇస్తారు. మిగతా మొత్తాన్ని లబ్ధిదారు చెల్లించాల్సి ఉంటుంది. రాయితీ పోగా లబ్ధిదారు చెల్లించాల్సిన మొత్తాన్ని బ్యాంకులు రుణంగా ఇస్తున్నాయి. రెండు కిలోవాట్ల యూనిట్ ఏర్పాటుకు రూ.1.5 లక్షలు, మూడు కిలోవాట్ల యూనిట్‌కు రూ.2.30 లక్షల వరకు ఖర్చవుతుంది. లబ్ధిదారు చెల్లించాల్సిన మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుంది. యూనిట్లను తెలంగాణ పునరుద్ధరణీయ ఇందన వనరుల అభివృద్ధి సంస్థ(తెలంగాణ రెడ్కో) పర్యవేక్షిస్తుంది.

**అవసరం తీరడంతో పాటు ఆదాయం**

ఇళ్లు, వ్యవసాయ బావుల వద్ద సౌరశక్తి యూనిట్ల బిగింపు పూర్తయ్యాక, గ్రిడ్‌తో అనుసంధానిస్తారు. యూనిట్ ద్వారా ఉత్పత్తి అయిన కరెంటులో గృహ, వ్యవసాయ అవసరాలకు పోగా మిగులు విద్యుత్తుకు నిర్ణయించిన ధరతో యూనిట్లు లెక్కించి ప్లాంటు యజమానుల ఖాతాలో జమ చేస్తారు. తద్వారా అవసరం తీరడంతో పాటు అదనపు ఆదాయం రానుంది. ఈ ఆదాయాన్ని బ్యాంకులు ఇచ్చిన రుణానికి జమ చేస్తారు. రుణం తీరాక వచ్చే మొత్తాన్ని లబ్ధిదారులు తీసుకోవచ్చు. యూనిట్ ఖర్చు పదేళ్ల వరకు తీరినా మరో 15 సంవత్సరాల పాటు లబ్ధిదారుల అవసరం తీరడంతో పాటు ఆదాయం వస్తుంది. సమగ్రంగా వివరాల నమోదు పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామంలో ఇంటింటికీ తిరిగి వివరాలు నమోదు చేయించాం. గృహ కనెక్షన్ల సర్వే పూర్తయ్యాక, వ్యవసాయ బావుల వివరాలు సేకరిస్తున్నాం.

# విశాఖ జోన్‌తో దశ తిరిగేనా!

పెద్దపల్లి: విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్టల్ రైల్వే జోన్ ఏర్పాటుతో ఉమ్మడి జిల్లాకు ప్రయోజనం కలగనుంది. ఇప్పటివరకు రైల్వే డివిజన్ కార్యాలయాలు ఇటు సికింద్రాబాద్(నిజామాబాద్ వైపు), అటు హైదరాబాద్(కాచిగూడ వైపు) కేంద్రంగా ఉండటంతో పెద్దపల్లి-నిజామాబాద్ రైలు మార్గంపై శీతకన్ను వేశారు. విశాఖ జోన్ ఆవిర్భావంతో కాజీపేట కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటుకు అవకాశాలు మెరుగయ్యాయి. రైల్వే డివిజన్ కేంద్రంగా రైళ్ల నిర్వహణ జరుగుతుంది. ప్రతిపాదిత కాజీపేట డివిజన్ పరిధిలో పెద్దపల్లి-నిజామాబాద్ ఒక్కటే ప్రధాన మార్గం కావడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మీదుగా ముంబయితో పాటు గుజరాత్, రాజస్థాన్‌లకు కొత్త రైళ్లను నడిపే అవకాశం ఉంటుంది.

**కీలకంగా మారనున్న పెద్దపల్లి**

నిజామాబాద్ రైలు మార్గం నిర్మాణం తర్వాత జంక్షన్‌గా మారిన పెద్దపల్లి స్టేషన్‌కు మనోహరాబాద్-కొత్తపల్లి మార్గం పూర్తయితే ప్రాధాన్యం మరింత పెరుగుతుంది.

హైదరాబాద్ నుంచి దిల్లీ వైపు వెళ్లే ప్రతి రైలూ సికింద్రాబాద్ మీదుగా కాకుండా మనోహరాబాద్, పెద్దపల్లి మీదుగా వెళ్తుంది. ఇక ముంబయి నుంచి కాజీపేట వైపు వెళ్లే రైళ్లు పెద్దపల్లి మీదుగా వెళ్లాల్సిందే.

అందుకు అనుగుణంగా పెద్దపల్లిలో బైపాస్ మార్గం నిర్మాణ పనులూ వేగంగా సాగుతున్నాయి. గత బడ్జెట్‌లో కేంద్రం అనుమతించిన మణుగూరు-రాఘవపూర్ మార్గం పెద్దపల్లికి చేరువలోనే ఉంటుంది. ప్రస్తుతం పెద్దపల్లిలోని రవాణా ప్లాట్‌ఫాంపై కవరింగ్ షెడ్ల నిర్మాణం జరుగుతోంది. దీన్ని ఫిట్‌లైన్‌గా మారిస్తే స్టేషన్ రూపురేఖలే మారిపోతా




యి. ఈ పనులన్నీ కాజీపేట డివిజన్ ఏర్పాటుతోనే వేగంగా జరుగుతాయి.

**ప్రజాప్రతినిధుల ఒత్తిడితోనే సాకారం**

పెద్దపల్లి-నిజామాబాద్ మార్గంలో నిజామాబాద్ స్టేషన్ మాత్రమే కాచిగూడ కేంద్రంగా పని చేసే హైదరాబాద్ డివిజన్ పరిధిలో ఉంటుంది. నిజామాబాద్ అవుటర్ నుంచి పెద్దపల్లి వరకు సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉంది. కరీంనగర్-తిరుపతి రైలు సికింద్రాబాద్ డివిజన్ నిర్వహిస్తుండగా కాచిగూడ-కరీంనగర్ ప్యాసింజర్ హైదరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇంతకు మించి మరో ప్రయోజనం దక్కలేదు. ఇక కాజీపేట నుంచి దాదర్‌కు నడిచే ప్రత్యేక రైలుతో పాటు ముంబాయి-కరీంనగర్‌ల మధ్య ఇటీవల నడిచిన పలు రైళ్లు కూడా మధ్య రైల్వే పరిధిలోనివే. ఈ పరిస్థితుల్లో ఎక్కువ రైళ్లను నడపడమొక్కటే పరిష్కారం. ఇందుకు రైల్వే డివిజన్ ఆవశ్యకత కోసం ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్ ప్రజాప్రతినిధులు కేంద్రంపై ఒత్తిడి తేవాల్సి ఉంటుంది.

# మొరం దందాకు అడ్డుకట్ట పడేనా?

పెద్దపల్లి : జిల్లాలో మొరం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమార్కులు అటవీ, ప్రభుత్వ భూములను వదలకుండా కొల్లగొడుతున్నారు. రూ.కోట్ల ప్రజాధనాన్ని దండుకుంటున్నారు. మొరం తరలిస్తున్న వాహనాల రాకపోకలతో దుమ్ముతో వేగలేకపోతున్నామని ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో అక్రమ రవాణాపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. మొరం తరలించే నిబంధనలను కఠినతరం చేసింది. ప్రజా అవసరాలకు తప్పకుండా అనుమతి తీసుకోవాలని తహసీల్దార్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

**అడ్డూ అదుపు లేకుండా..**

జిల్లాలో మొరం దందా అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతోంది. అభివృద్ధి పనుల పేరుతో భారీగా తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. ముత్తారం మండలం ఖమ్మంపల్లి, కమాన్‌పూర్ మండలం రాజాపూర్‌ల నుంచి మొరాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. కాల్వశ్రీరాంపూర్ పాండవుల గుట్టను ఖాళీ చేస్తున్నారు. జూలపల్లి మండలం కాచాపూర్, పెద్దపల్లి మండలం బొంపెల్లిల్లో నిరాటంకంగా రవాణా అవుతోంది. ట్రాక్టర్లు, లారీల్లో సామర్థ్యానికి మించి తరలిస్తుండటంతో



ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దుమ్ము, దూళితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**నిబంధనలు ఇలా..**

జిల్లాలో అక్రమ మొరం తరలింపు కొత్త నిబంధలను పర్యవేక్షించాల్సి బాధ్యత అధికారులపై ఉంది. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.200, టిప్పర్‌కు రూ.800 ధర నిర్ణయించారు. సొంత అవసరాలకు తప్ప నిల్వలు చేయరాదని ఆదేశాలున్నాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటలలోపు రవాణాకు అనుమతి ఉంది. లోడింగ్ ఛార్జీలుపోను ఒక్కో టన్నుకు రూ.42 సీనరేజ్ చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కనా ఒక్కో టిప్పర్‌లో 24 టన్నులకు రూ.19,200 చెల్లించాల్సి ఉండగా ఇందులో సీనరేజ్ కింద రూ.1,008 జమ కానున్నాయి. నిబంధనలు కఠినంగా అమలు చేస్తేనే ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరనుంది.

ఇలా చేస్తే మేలురెవెన్యూ, మైనింగ్, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలి.

అనుమతి ముసుగులో గుత్తేదారులు చేస్తున్న భారీ నిల్వలపై అధికారులు దాడులు నిర్వహించాలి.

తహసీల్దార్ నుంచి పొందిన ఒకే అనుమతి పత్రంతో నాలుగైదు సార్లు వినియోగించకుండా తనిఖీ చేయాలి.

అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ పెంచితేనే గుత్తేదార్ల అక్రమ దందాకు చెక్ పడనుంది.

సమన్వయంతో నిఘా: శ్రీనివాస్, జిల్లా గనుల శాఖ అధికారి

మొరం అక్రమ తరలింపుపై కలెక్టర్ కొత్త నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. స్థానిక అవసరాలకు తహసీల్దార్ అనుమతి తప్పనిసరి. రాత్రింబవళ్లు తవ్వకాలు లేకుండా.. అనుమతి పొందిన క్వారీ నుంచే తరలించాలి. అక్రమ రవాణాపై సంబంధిత అధికారుల సమన్వయం తీసుకుంటున్నాం.

చురకలు



## పదిలో పాసైతే నేరుగా ఇంటర్

కొండగల్ : ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుతూ పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి నేరుగా ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కల్పించాలని గురుకుల సొసైటీలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ నిర్ణయంతో పేద విద్యార్థులకు మేలు కలుగనుంది.

**100 శాతం సీట్ల భర్తీకి నిర్ణయం**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇంటర్ గురుకుల కళాశాలల్లో వందశాతం సీట్లను భర్తీ చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు గురుకుల కళాశాలల్లో ప్రవేశం కల్పించడానికి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు సొసైటీలు వేర్వేరుగా ప్రవేశ పరీక్షలు నిర్వహించేవి. అందులో వచ్చిన మార్కుల ఆధారంగా ఇంటర్‌లో అడ్మిషన్ కల్పించేవారు. ఒక్క మైనార్టీ గురుకులాల్లో మాత్రం ఎవరు ముందు ప్రవేశం తీసుకోవడానికి వస్తారో వారికి అడ్మిషన్ ఇస్తారు. అర్హత సాధించని



విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చేరేవారు. పేద విద్యార్థులు ప్రైవేటులో చేరే ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడేవారు. అర్హత సాధించని వారు లేకపోవడంతో చాలా సీట్లు మిగిలిపోయేవి. దీనిని నివారించడానికే గురుకుల సొసైటీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి.

**2,000కు పైగా విద్యార్థులు**

జిల్లాలో ఎస్సీ 6, ఎస్టీ 4, బీసీ 10, మైనార్టీ 6 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పదో తరగతి విద్యార్థులు 2,000కుపైగా చదువుకుంటున్నారు. ఇంటర్ గురుకులాల్లో ప్రవేశాల కోసం ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తుండడంతో అర్హత సాధించిన వారికి మాత్రమే అడ్మిషన్ లభిస్తోంది. దీంతో కొందరు సీట్ల కోసం ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. గురుకుల పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థికి ప్రవేశ పరీక్షతో నిమిత్తం లేకుండా నేరుగా ఇంటర్ గురుకులాల్లో ప్రవేశం కల్పించాలని సొసైటీలు తీసుకున్న నిర్ణయంతో తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గనుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## దందా మారలేదు.. తీరే మారింది

హైదరాబాద్: మత్తు పదార్థాలకు పెరిగిన డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు కొత్తదారులు వెతుకుతున్నారు. పోలీసుల తనిఖీనుంచి తప్పించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరిస్తున్నారు. నగరానికి వివిధ మార్గాల్లో రోజూ భారీగా గంజాయి చేరుతోంది. యంత్రాంగం దాడులు నిర్వహిస్తున్నా పూర్తిగా కట్టడి చేయలేకపోతున్నారు. రాజధానికి చేరుతున్న గంజాయిలో కేవలం 10–20శాతమే గుర్తిస్తున్నారు. ఏవోబీ, ఏపీలో కిలో రూ.6–8వేలకు కొనుగోలు చేస్తారు. హైదరాబాద్ చేరగానే దాని విలువ రూ.10–12వేలకు చేరుతుంది. మహారాష్ట్ర, కర్ణాటక, దిల్లీ వంటి ప్రాంతాల్లో కిలో రూ.60–70వేలు పలుకుతోంది. నిఘా పెరగడం, ఇప్పటికే



జైలుకెళ్లొచ్చిన ముఠా సభ్యులు పీడీ యాక్ట్ భయంతో వెనక్కి తగ్గి.. తెరవెనుక ఉండి కొత్తవారిని రంగంలోకి దింపుతున్నారు.

**నయా పంథా**

ఇటీవల గంజాయి సరఫరా చేస్తున్న రౌడీషీటర్లు అబ్దుల్ ఖదీర్, మహ్మద్ జోయెబ్‌ను అరెస్ట్ చేశారు. వీరివద్ద 2.5 కిలోల గంజాయి దొరికింది. 18 కేసుల్లో నిందితులుగా ఉన్న వీరిపై 7 వరకు నాన్ బెయిలబుల్ వారెంట్లున్నాయి. పోలీసుల కన్నుగప్పి మకాం మార్చి గంజాయి దందా సాగిస్తున్నట్టు గుర్తించారు. పలు ఠాణాల్లో రౌడీ షీటర్లుగా నమోదైన వారిలో 10–15 మంది అనుచరులతో కలసి స్మగ్లింగ్ చేస్తున్నారు. విశాఖలో రైల్లోకి చేరిన ఏజెంట్లు సరకును ఒకచోట ఉంచి.. మరోచోట కూర్చుంటారు. తనిఖీల్లేవని నిర్ధారించుకున్నాక నల్గొండ, అల్వాల్, ఘటకేసర్ వంటిచోట దిగిపోతారు. అక్కడినుంచి సరకును శివారు ప్రాంతాలకు చేరవేసి భద్రపరుస్తారు. చోరీ చేసిన, నంబరు ప్లేట్ తీసేసిన బండ్లను అక్రమ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారు. ఇటీవల చిక్కిన నలుగురు నిందితులు ఏపీలో కొట్టేసిన బైక్‌లను వాడటం గమనార్హం. గంజాయి ప్యాకెట్లను పెడ్లర్లకు చేరవేసేందుకు యాచకులు, ఇంటినుంచి పారిపోయి నగరం చేరి కాలిబాటలపై, డివైడర్ల మధ్య ఉంటున్న మధ్య వయస్కులను ఉపయోగిస్తున్నారు.

## లక్ష్యం అధిగమించేలా.. ఉపాధి పనులు

బోయినపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి పని కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మరికొద్ది రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా జిల్లాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న పని దినాల లక్ష్యం అధిగమించే దిశగా అధికారులు సాగుతున్నారు. వలసల నిరోధానికి...వలసలు నిరోధించి స్థానికంగా ఉపాధి కలించాలన్న లక్ష్యంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి పనులు కల్పించడానికి ప్రతి ఆర్థిక సంవత్సరంలో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఉపయోగకరమైన పనులను గుర్తించడంతో పాటు కూలీ పనిదినాల లక్ష్యాన్ని నిర్దేశిస్తున్నారు. అధికంగా ఫీడర్ ఛానల్, మట్టి రోడ్లు, ఫారంపాండ్స్, వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు గుంతల తవ్వకం, ఇంకుడు గుంతలు, నర్సరీల ఏర్పాటు, పశువుల షెడ్లు, నీటి కుంటల నిర్మాణం, నాటిన మొక్కలకు నీరు పోయడం తదితర పనులను చేయిస్తున్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీ పనులకు హాజరయ్యే విధంగా క్షేత్ర, సాంకేతిక సహాయకులు, ఏపీవోలు కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ పనులు ఉన్న సమయంలో కూలీల హాజరు సంఖ్య తక్కువగా ఉంటుంది. వ్యవసాయ పనులు ముగిసిన అనంతరం కూలీలు అధిక సంఖ్యలో పనులకు హాజరవుతున్నారు. ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా ప్రభుత్వం భూమిలేని కూలీలను గుర్తిస్తోంది. ఉపాధిహామీ పథకంలో పనిచేయాల్సి ఉండటంతో ఇప్పుడు అనేక మంది కూలీలు పనులు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. తొంభై శాతానికిపైగా...జిల్లాలో 12 బ్లాక్‌లు ఉండగా 255 గ్రామపంచాయతీల పరిధిలో 98వేల జాబ్ కార్డులున్నాయి. రెండు లక్షల మంది కూలీలు ఉన్నారు. ఇందులో 64 వేల జాబ్‌కార్డులు యాక్టివ్ కాగా 1.01 లక్షల మంది కూలీలు పనిచేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 17.6 లక్షల పనిదినాలు లక్ష్యం నిర్దేశించుకోగా 21.81 లక్షల పనిదినాలు కల్పించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 21.78 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యం నిర్దేశించుకోగా నేటికి 20.06 లక్షల పనిదినాలు కల్పించారు.

# ఎక్కడెంత..ఎవరిదెంత..?



హైదరాబాద్ : రాష్ట్రంలో నివసిస్తూ.. ఇండో– పాకిస్థాన్ యుద్ధం జరిగినప్పుడు ఇక్కడ ఉండలేక పాకిస్థాన్‌కు వెళ్లిన కొన్ని కుటుంబాల ఆస్తులను ఎనిమీస్ ప్రాపర్టీస్‌గా పిలుస్తుంటారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ త్వరలో వీటి లెక్క తేల్చనుంది. కొన్ని భూములు ఆక్రమణకు గురికాగా.. కొంత ప్రజాప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగించుకోవడంతో వాటి విస్తీర్ణం తగ్గిపోయింది. తాజాగా వాటి స్థితిగతులను తెలుసుకొని కేంద్రం పరిష్కారం చూపనుంది. గ్రేటర్ పరిధిలో ఎనిమీస్ ప్రాపర్టీస్ భూముల విలువ మార్కెట్ ధరల ప్రకారం రూ.50వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా.

**ఎకరా రూ.కోట్లలో..** కొత్వాల్‌గూడలో ఎకరా భూమి రూ.50కోట్లకుపైగా ఉండగా.. మియాపూర్‌లో రూ.50కోట్ల నుంచి రూ.70కోట్ల వరకూ పలుకుతోంది. ముషీరాబాద్‌కు సమీపంలోని బాకారంలో ఉన్న 25వేల చదరపు గజాల స్థలం కూడా గజం రూ.లక్ష నుంచి రూ.2లక్షలు మధ్య ఉంది. ఈ భూములను సర్వే చేసి హద్దులు సక్రమంగా ఉన్నాయా? ఎవరైనా ఆక్రమించుకున్నారా? రైతులు సాగుచేస్తున్నారా? ఆక్రమణదారులు ఎవరికైనా విక్రయించారా? అక్కడ పరిశ్రమలేవైనా ఉన్నాయా? అన్న అంశాలను నివేదిక రూపంలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు మార్చి నెలాఖరులోపు పంపించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కొద్దిరోజుల క్రితం రెవెన్యూ అధికారులను ఆశించారు.

**క్రమబద్ధీకరణకు అవకాశం..**

కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తనకున్న విచక్షణాధికారాలు, ఎనిమీస్ ప్రాపర్టీస్ పరిరక్షణ చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం.. విషయం తెలియకుండా ఆ భూములు కొన్నవారు, పాకిస్థాన్‌కు వలసవెళ్లిన యజమానుల కుటుంబ సభ్యుల వారసులు, రాష్ట్ర ప్రభుత్వం ప్రజాప్రయోజనాల కోసం లీజుకిచ్చిన భూములను క్రమబద్ధీకరించే అధికారం ఉంది.

సెక్షన్8 ప్రకారం రంగారెడ్డి జిల్లాలోని కొత్వాల్‌గూడ, మియాపూర్‌లోని 890 ఎకరాల్లో కొంత భాగం మినహా.. మిగతా భూములు రాష్ట్ర ప్రభుత్వానికే వస్తాయని రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే కొత్వాల్‌గూడలో బాహ్యవలయ రహదారి నిర్మాణం కోసం కొన్ని ఎకరాలను హెచ్‌ఎండీఏ తీసుకుంది.

తప్పుడు పత్రాలతో ఆక్రమించుకున్న వారి నుంచి భూములను స్వాధీనం చేసుకుంటే అవసరాలకు ఉపయోగపడతాయని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.

గ్రేటర్ పరిధిలోనే అత్యధికం..

రంగారెడ్డి జిల్లా – 690 ఎకరాలు

హైదరాబాద్ – 5.26 ఎకరాలు

శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ – 630 ఎకరాలు

మియాపూర్ – 260 ఎకరాలు

# నిధుల్లేక నిరాశ.. ప్రగతికి ప్రయాస



బషీరాబాద్ : పంచాయతీలకు పాలకులు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. దీంతో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. తాగునీటి మరమ్మతులు, విద్యుత్ దీపాలు, ఇతర ఏ చిన్న సమస్య ఉత్పన్నమైనా వెంటనే పనులు చేయించాలంటే డబ్బులు అవసరం. సాధారణ నిధులు, పన్ను వసూలు నిధులపైనే ఆధారపడాల్సి వస్తోందని ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు.

**రావాల్సింది రూ.60కోట్లు..**

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలకు జనాభా ప్రతిపాదికన ప్రతి ఏడాది 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తోంది. వీటితో వార్డుల్లో అత్యవసర పనులు, తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్యం, దోమల నివారణ, పైప్‌లైన్ల మరమ్మతులు, ఇతర ప్రజా ఉపయోగ పనులను చేయాల్సి ఉంటుంది. ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ముగింపు వరకు జిల్లాలోని పంచాయతీలకు రూ.60కోట్ల నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.35–40 కోట్లు మొత్తంగా రూ.100 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవి కాగా, సాధారణ నిధులు, పన్నుల వసూళ్ల రాబడితో పంచాయతీల నిర్వహణ జరుగుతోంది.

**కార్యదర్శులపైనే భారం..:** సర్పంచి ఎన్నికల గడువు ముగిసి ప్రత్యేకాధికారులతో పల్లెపాలన కొనసాగడం ఏడాది కావస్తోంది. సర్పంచులు లేకపోవడంతో కార్యదర్శులపైనే భారం పడుతోంది. ఏసమస్య వచ్చినా సొంతంగా నిధులు ఖర్చు చేయాల్సి వస్తోంది. విద్యుత్ దీపాలకు, మోటర్ల మరమ్మతులకు వెచ్చించిన డబ్బుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోందంటున్నారు. రాష్ట్ర నిధులు పారిశుద్ధ్య కార్మికుల వేతనాలకే సరిపోతుందంటున్నారు.

**సమస్యలు తలెత్తకుండా చూస్తున్నాం**

పంచాయతీల్లో నిధులు లేకున్నా.. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం. సర్పంచులు లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధులు ఆగాయి. స్థానిక సంస్థల ఎన్నికల తరువాతే నిధులు విడుదలవుతాయి. పన్నుల వసూలు, సాధారణ నిధులతో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

జయసుధ, జిల్లా పంచాయతీ అధికారిణి, వికారాబాద్.

పంచాయతీలు: 566

వార్డులు: 5,058

జనాభా: 12,90లక్షలు

15వ ఆర్థిక సంఘం నిధులు: రూ.60 కోట్లు (ఏడాదికి)

రాష్ట్ర నిధులు: రూ.35–40 కోట్లు (ఏడాదికి)

# పనుల జోరు.. పల్లె రోడ్డు మారె



తాండూరు : దారిపొడవునా కంకరతో ప్రయాణ కష్టాలు పడ్డారు. అనేక మంది ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాల పాలయ్యారు. ఆస్పత్రుల్లో చేరి జేబులు ఖాళీ చేసుకున్నారు. రెక్కలుముక్కలు చేసుకొని సంపాదించిన కూలీ డబ్బులు మోటారు సైకిళ్ల మరమ్మతులకు వెచ్చించారు. ఎట్టకేలకు కంకర దారులను తారు రహదారులుగా తీర్చిదిద్దడంతో ప్రయాణ బాధలు తీరాయి. వందల సంఖ్య వాహనదారులకు ఊరట లభించింది.

**రూ.54 లక్షల మంజూరులో ఎట్టకేలకు కదలిక:** తాండూరు మండలం వీరారెడ్డిపల్లి నుంచి జాతీయ రహదారి వరకు ఏళ్లుగా మరమ్మతులు లేక తారు తుడిచిపెట్టుకుపోయింది. దారిపొడవునా కంకరతో రహదారి ఆనవాళ్లు కోల్పోయింది. రహదారి నిర్మించాలంటూ గ్రామస్థులు అధికారులు, ప్రజాప్రతినిధులుకు మొరపెట్టుకున్నారు. మూడు సంవత్సరాలుగా ప్రయాణ బాధలతో ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం రూ.54లక్షలు మంజూరు చేయడంతో నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభించారు. గుత్తేదారు కంకర వేసి మూడు నెలలుగా వదిలేయగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదేశాలతో శనివారం తారు పనులు చేపట్టారు. కంకర మార్గంలో తారు రహదారి అందుబాటులోకి రావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాలకు రహదారి సమస్య తీరిందని సంబురపడుతున్నారు.

**సిరిగిరిపేటకు ఏడాదిన్నరగా..**

సిరిగిరిపేట నుంచి జాతీయ రహదారి వరకు మధ్యమధ్యలో తారు రహదారి దెబ్బతింది. గుంతలుపడి కంకర తేలింది. దీంతో రహదారి నిర్మాణానికి గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈక్రమంలో గుత్తేదారుతో అధికారులు దారిపొడవునా జేసీబీ యంత్రంతో చదును చేయించారు. అంత రహదారి నిర్మిస్తారని భావించారు. కానీ అక్కడక్కడ గుంతలు పడిన రహదారి మార్గాన్ని పూర్తిగా తవ్వేయడంతో కంకరతేల్చి వదిలేశారు. తారు రహదారి నిర్మించకపోవడంతో ఉన్న దారిని చదును చేసి ప్రయాణాన్ని మరింత క్లిష్టతరం చేశారని గ్రామస్థులు మండి పడ్డారు. ఏడాదిన్నర నుంచి కంకర మీదుగా ప్రయాణానికి నానా ఇబ్బందులు పడ్డారు. ఒకదశలో ప్రధాన పార్టీకి చెందిన నియోజకవర్గ స్థాయి నేతలు గ్రామానికి వెళ్లేందుకు నిరాకరించారు. వస్తే గ్రామస్థులు రహదారి నిర్మాణంపై నిలదీస్తారని వెనకడుగు వేశారు. రెండు రోజుల క్రితం రూ.39.80లక్షలతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు తారు రహదారి నిర్మాణ పనులు ప్రారంభింపజేశారు. కొత్తగా తారు రహదారి నిర్మించడంతో రాకపోకలకు సౌలభ్యంగా మారిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## పోలోమంటూ మైదానాలకు

హైదరాబాద్ : చల్‌చల్ గుర్రం.. చలాకీ గుర్రం అంటూ అశ్వాలపై స్వారీ చేసేందుకు సెలబ్రిటీలు... రాజకీయ ప్రముఖులు ఆసక్తి చూపుతున్నారు. నగర శివారు శంకర్‌పల్లి, మొయినాబాద్ ప్రాంతాల్లోని పోలో మైదానాల్లో గుర్రపు స్వారీలో శిక్షణ పొందుతున్నారు. సెలబ్రిటీల వారసులు.. కొత్తగా సినీరంగంలోకి వెళ్లాలనుకుంటున్న వారూ నేర్చుకుంటున్నారు. గుర్రాలను ఇష్టంగా పెంచుకునే సినీ నటుడు రామ్‌చరణ్ పోలో మైదానాల నిర్వాహకులకు సంరక్షణ బాధ్యతలు అప్పగిస్తున్నారు. నాలుగైదేళ్లుగా శిక్షణకు ఔత్సాహికులు ఎక్కువగా వస్తున్నారు. శిక్షణ కాస్త ఖరీదే... గుర్రపు స్వారీ శిక్షణ కాస్త ఖరీదే. వృత్తిపరంగా.. హాబీగా నేర్చుకుంటే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశా లుంటాయన్న భావనతో పిల్లలు.. యువకులు పోలో మైదానాలకు వెళ్తున్నారు. ప్రవేశ కోర్సు 16 రోజులకు రూ.15వేలు, అడ్వాన్స్‌డ్ కోర్సు మరో 16 రోజులు, జంపింగ్ సెషన్స్ 16 రోజుల పాటు శిక్షణ తీసుకోవాలి. ఈ శిక్షణ పూర్తయ్యాక గుర్రపు స్వారీ చేయాలంటే రుసుం చెల్లించాలి.

ఆరేళ్ల చిన్నారుల నుంచి అరవైఏళ్ల వయసున్న వారూ నేర్చుకోవచ్చు.. బరువు 90కిలోలు మించకూడదు. ఉదయం 6 గంటల నుంచి 8.30



వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6.30 కోసం శిక్షణ ఇస్తారు. సినీ నటులు, ఇతర ప్రముఖుల కోసం ప్రత్యేక ఎరీనాలు (మైదానాలు) అందుబాటులో ఉన్నాయి.

రూ.లక్షల్లో ధరలు..

గుర్రాల సంరక్షణకు పోలో మైదానాల నిర్వాహకులు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బ్రీడ్ ఆధారంగా ఒక్కో గుర్రం రూ.2లక్షల నుంచి రూ.30లక్షలుంటుందని ఓ శిక్షణ కేంద్రం నిర్వాహకుడు తెలిపారు. వీటి పోషణ కోసం కూడా భారీగానే వెచ్చిస్తామని చెబుతున్నారు. కొందరు ప్రముఖులు సొంతంగా గుర్రాలను కొనుగోలు చేసి వాటి నిర్వహణ బాధ్యతలను పోలో మైదానాల్లోని వారికి అప్పగిస్తుంటారు. ఇందుకు నెలకు ఒక్కో గుర్రానికి కనీసం రూ.35వేలు తీసుకుంటున్నారు. శిక్షణ ఇచ్చేవారికి నిర్వాహకులు రూ.40వేల నుంచి రూ.లక్ష వరకూ వేతనం ఇస్తున్నారు.

## హైదరాబాద్ మెట్రో.. 40 కి.మీ.లు.. 40 నిమిషాలు

హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించబోతున్న ఫ్యూచర్‌సిటీ వరకు మెట్రోలో 40 నిమిషాల్లో చేరుకునేలా సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక(డీపీఆర్) తయారీపై హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైలు (హెచ్ఏఎంఎల్) అధికారులు కసరత్తు చేస్తున్నారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీలతో కలిసి మెట్రోరైలు విస్తరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. విమానాశ్రయం నుంచి మీర్‌ఖాన్‌పేటలో నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు జరుగుతున్న సర్వే పనులను హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు.

**ఫోర్త్ సిటీకి ఇలా..**

విమానాశ్రయం నుంచి ఫ్యూచర్‌సిటీకి దాదాపు 40 కి.మీ.దూరం ఉంటుంది. టర్మినల్ నుంచి మొదలై.. కొత్తగా చేపట్టే మెట్రో రైలు డిపో సమీపం నుంచి విమానాశ్రయ సరిహద్దు గోడ వెంబడి మెట్రో మార్గం కొంత భూమార్గంలో, మరికొంత ఎలివేటెడ్‌గా వెళ్తుంది.

బహదూర్‌గూడలోని 1000 నుంచి 1500 ఎకరాల ప్రభుత్వ భూమిని అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తోడ్పడేలా బహదూర్‌గూడ, పెద్ద గోల్కొండలో రెండు మెట్రో స్టేషన్లను అత్యంత ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తారు.

పెద్ద గోల్కొండ ఎగ్జిట్ నుంచి తుక్కుగూడ ఎగ్జిట్ మీదుగా రావిర్యాల



ఎగ్జిట్ వరకు 14 కి.మీ. పొడవున మెట్రో ఎలివేటెడ్ మార్గమే. రావిర్యాల నుంచి కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్ పేట వరకు దాదాపు 22 కి.మీ. దూరం ఉంటుంది. ఇందులో 18 కి.మీ. వరకు భూమార్గంలోనే మెట్రో వెళ్తుంది. ఇక్కడ హెచ్ఎండీఏ 100 మీటర్ల వెడల్పున నిర్మించే గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలో 22 మీటర్లు మెట్రోరైలుకు కేటాయించారు. ఇందులో మెట్రోని భూమార్గంలో నిర్మిస్తారు.

మేడ్చల్, శామీర్‌పేట కారిడార్లతో పాటూ ఈ ఫ్యూచర్‌సిటీ మెట్రో కారిడార్ డీపీఆర్‌ను సైతం మార్చి నెలాఖరుకు పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్రానికి సమర్పిస్తామని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు.

ప్రాథమికంగా డీపీఆర్ స్వరూపమిలా...(కి.మీ.లలో..)

ప్రతిపాదిత స్టేషన్ల సంఖ్య 16

భూమార్గం 18

తక్కువ ఎలివేటెడ్ (ఓఆర్ఆర్ వెంట) 14

ఎలివేటెడ్ దూరం 6

భూ గర్భంలో మెట్రో 2

మొత్తం దూరం 40

# సర్కారు బడి.. అభివృద్ధి ఒరవడి

ఖమ్మం : పీఎంశ్రీ పథకం కింద సర్కారు పాఠశాలలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ప్రస్తుతం వివిధ పనులకు ఎంపిక చేసిన మొత్తం 28 పాఠశాలలకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. వచ్చే మూడు నెలల్లోనూ పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యే అవకాశముంది. వీటిలో 60 శాతం కేంద్ర ప్రభుత్వం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తోంది. వచ్చే మార్చి నాటికి పనులు పూర్తి చేయాలి. లేకుంటే ఇవి మురిగిపోయే ప్రమాదముంది. నిధులు సకాలంలో ఖర్చు చేసేందుకు ఆయా పాఠశాలల, జూనియర్ కళాశాల ల ప్రిన్సిపాళ్లతో ఇటీవలే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ ఈ పథకంపై ప్రత్యేక శ్రద్ధపెట్టి నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సకాలంలో ఖర్చు చేయాలని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ సీహెచ్ రామకృష్ణ కోరారు.

**పాఠశాలలకు సౌకర్యాలు**

జిల్లాలోని ఎంపీపీఎస్ సత్తుపల్లి, ఎంపీపీఎస్ సిరిపురంలో ప్రీప్రైమరీ విద్య అభివృద్ధికి అంగన్‌వాడీలను ఆధునికీకరించారు. గదుల లోపల రంగులు వేయడంతో పాటు ఫర్నిచర్, ఆట పరికరాలను కొనుగోలు చేశారు. సిబ్బంది నియామకం, ఇతర అవసరాలన్నింటికీ కలిపి రూ.9 లక్షల వరకు ఖర్చు చేశారు.

స్కూల్ గ్రాంటు కింద రూ.లక్ష మంజూరు చేశారు. ఈ నిధులతో చిన్నచిన్న మరమ్మతులు చేసుకునే అవకాశం ఉంటుంది. గదులకు రంగులు వేయించుకోవడం, అవసరమైన పేపర్లు, పుస్తకాలు కొనుగోలు చేసుకోవచ్చు. దివ్యాంగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు



రూ.5 వేలు, ఎల్ఈడీ విద్యుద్దీపాలకు రూ.5 వేలు మంజూరు చేశారు. పాఠశాలలో పచ్చదనం పెంపొందించుకునేందుకు రూ.10 వేలు మంజూరయ్యాయి. పాఠశాల ప్రాంగణంలోని చెత్తాచెదారం, కిచెన్‌లో వ్యర్థ పదార్థాలు తదితర వాటితో వర్మీ కంపోస్టు తయారు చేసుకునేందుకు రూ.5 వేలు మంజూరు చేశారు. కిచెన్ గార్డెన్‌కు రూ.20 వేలు, డస్ట్‌బిన్‌లకు రూ.2 వేలు, స్వచ్ఛ పక్వాడకు రూ.10 వేలు, మ్యాథ్స్, సైన్స్ సర్కిళ్ల అభివృద్ధి కోసం రూ.10 వేల చొప్పున మంజూరు చేశారు.

**పర్యావరణంపై అవగాహన**

విద్యార్థులకు మొక్కల పెంపకం, పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు అటవీశాఖ సహకారం తీసుకుంటున్నారు. ఖమ్మం నగర సమీపంలోని వెలుగుమట్ల అటవీశాఖ అర్బన్ పార్కు, సత్తుపల్లి సమీపంలోని నీలాద్రి అర్బన్ పార్కులను ఎంపిక చేశారు. జిల్లాలో మొత్తం 8 వేల మంది విద్యార్థులకు నిపుణులతో అవగాహన కల్పిస్తారు. అక్కడే క్షేత్ర సందర్శనలు ఏర్పాటు చేస్తారు. ప్రతి విద్యార్థికి రూ.500 చొప్పున మంజూరు చేశారు. వీటితో నిపుణులకు గౌరవ వేతనం ఇవ్వడంతోపాటు విద్యార్థుల భోజనం కోసం ఖర్చు చేస్తారు.

# కబ్జా దారి!

మధిర : నియోజకవర్గ కేంద్రం మధిరలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. వీటిల్లో ర.భ. శాఖ స్థలాలే ఎక్కువగా ఉన్నాయి. వీటికి సంబంధించిన ఓ దస్త్రం మాయంకావడం కొసమెరుపు. మధిర-రాయపట్నం రహదారిలో వైరానదిపై వంతెన నిర్మాణానికి 1976లో 11 ఎకరాల భూమిని సేకరించారు. పనులకు కావాల్సిన మట్టిని తోలేందుకు రైల్వేట్రాక్ పక్కన మరో పదెకరాలు కేటాయించారు. ఎర్రుపాలెం మండలం మీనవోలు వద్ద కట్లేరుపై వంతెన నిర్మాణ సమయంలో రెండెకరాల ప్రభుత్వ భూమిని సేకరించారు. సంబంధిత భూ యజమానులకు పరిహారాన్నిచ్చారు.



ఇపుడు ఆ భూమలు ఆక్రమణకు గురయ్యాయి.

**మధిర బైపాస్‌లో..**

మధిర బైపాస్ నిర్మాణాన్ని 1983లో చేపట్టారు. మార్కెట్ యార్డు సమీపం నుంచి దర్గా వరకు వంద అడుగులు, అక్కడ్నుంచి వంతెన వరకు 130 అడుగుల చొప్పున భూమిని సేకరించారు. ఆ భూమికి అధికారులు హద్దులు నిర్ధారించి రాళ్లు పాతించారు. ఆ రాళ్లు ప్రస్తుతం కనిపించకుండా పోయాయి. వీటికి సంబంధించిన దస్త్రం ఆ శాఖ కార్యాలయంలో మాయమైంది. బ్రిడ్జి కుడివైపున డంపింగ్ యార్డు ప్రాంతంలోనూ అప్పట్లో కొంత భూమిని సేకరిస్తే.. అందులో సుమారు మూడెకరాలను తప్పుడు ధ్రువపత్రాలపై ఓ వ్యక్తికి ధారాదత్తం చేశారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఇక్కడ ఎకరం రూ.40 లక్షలకు పైగా పలుకుతోంది. బైపాస్ ఇరువైపులా ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. వైరానది ఒడ్డు నుంచి రాయపట్నం వెళ్లేందుకు డొంక రోడ్డు ఉండేది. ఈ రహదారిలో అప్పట్లో ఓ ప్రైవేటు బస్సు మధిర నుంచి నందిగామకు ప్రయాణికులను చేరవేసేది. వైరానది ఒడ్డున కొంతదూరం ఉండాల్సిన ఆర్అండ్‌బీ స్థలం అన్యాక్రాంతమైంది.

మధిర-దెందుకూరు డొంకదారిలో విలువైన స్థలాన్ని కొందరు ఆక్రమించుకొని విలాసవంతమైన భవనాలు నిర్మించారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదులందినా అధికారుల కంటితుడుపు చర్యలు చేపట్టారు. ఇల్లెందులపాడులో ర.భ. శాఖ రహదారి పక్కనున్న 1.25 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా అయింది. సిరిపురం వద్ద వైరానదిపై నిర్మించిన బ్రిడ్జి పక్కనున్న స్థలమూ మాయమైంది.

"ర.భ.శాఖకు చెందిన స్థలాలు ఎక్కడెక్కడ ఎంత ఉన్నాయనే వివరాలు శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయి. వాటిని పరిశీలించి, ఎక్కడైనా శాఖకు చెందిన భూములు కబ్జాకు గురైతే సర్వే చేయిస్తాం. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. మధిర బైపాస్ భూ సేకరణ దస్త్రం కలెక్టరేట్‌లో ఉంటుంది." ఏఈ రాంబాబు, ర.భ. శాఖ

# సమస్య గుర్తింపు ఇక సులువే!



పెద్దపల్లి : ఈదురుగాలులతో విద్యుత్తు తీగలు పరస్పరం తగిలి తెగిపోవడం, ఇన్సులేటర్లు దెబ్బతినడం, స్తంభాలు నేలకొరగడం వంటి సమస్యలతో తరచూ సరఫరా నిలిచిపోతోంది. సమస్య తలెత్తిన ప్రాంతాన్ని గుర్తించేందుకు సిబ్బంది ఆపసోపాలు పడాల్సి వస్తోంది.

ఈ నేపథ్యంలో ఉత్తర విద్యుత్తు పంపిణీ సంస్థ(ఎన్‌పీడీసీఎల్) పరిష్కార చర్యలు చేపట్టింది. 33 కేవీ, 11 కేవీ స్తంభాలకు ప్రత్యేక నంబర్లను కేటాయిస్తూ జియోట్యాగింగ్‌తో అనుసంధానిస్తున్నారు. దీంతో సమస్య తలెత్తిన ప్రాంతాన్ని సులువుగా గుర్తించే వీలుంది.

**నంబర్లతో కచ్చితత్వం**

విద్యుత్తు స్తంభాలకు నంబర్లు కేటాయించడంతో వాటి ఆధారంగా సమస్య ఎక్కడ, ఎంత దూరంలో ఉందో తెలుసుకోవచ్చు. ఇదివరకు ఒక లైన్‌లో అంతరాయం ఏర్పడితే పరిధిలోని మిగిలిన లైన్లకు సరఫరా నిలిపివేసేవారు. ప్రస్తుతం సమస్య ఉన్న ఒక్క లైన్‌కు మాత్రమే నిలిపేస్తే సరిపోతుంది. దీంతో సరఫరాలో అంతరాయం తగ్గడంతో పాటు అనధికారంగా వేసిన స్తంభాల లెక్క తేలనుంది.

సెల్‌ఫోన్‌కు సందేశం

ట్రాన్స్‌ఫార్మరు ప్రాంతాన్ని సూచించేలా నంబరును స్తంభాలపై వేస్తున్నారు. ఈ ప్రక్రియ అన్ని చోట్లా పూర్తయిన తర్వాత జియోట్యాగింగ్‌కు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా, డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో పరికరాలు సమకూర్చనున్నారు. ఈ విధానంతో సంబంధిత అధికారులు, సిబ్బంది సెల్‌ఫోన్‌లో నిక్షిప్తమవుతుంది. దీంతో ఎక్కడైనా అంతరాయం కలిగితే సందేశం వస్తుంది.

**16.72 లక్షల కనెక్షన్లు**

ఉమ్మడి జిల్లాలో 16.72 లక్షల విద్యుత్తు కనెక్షన్లున్నాయి. యాసంగి సాగు పనులు ముమ్మరం కావడంతో నంబర్లు వేసే ప్రక్రియకు విఘాతం కలుగుతోంది. ప్రస్తుతం పనులు లేని చోట్ల వేస్తున్నారు.

**వినియోగదారులకు మెరుగైన సేవలు**

స్తంభాలకు నంబర్లు వేయడం వల్ల సమస్య తలెత్తిన ప్రాంతాన్ని సులువుగా గుర్తించవచ్చు. జియోట్యాగింగ్‌తో సేవలు మెరుగవుతాయి. అనధికారిక స్తంభాలు వేసే అవకాశం ఉండదు. జిల్లాలో నంబర్లు వేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. మాధవరావు, పెద్దపల్లి ఎస్ఈ

# రూపు మార్చి.. బురిడీ కొట్టిస్తూ!



జగిత్యాల : ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తికి వీడియోకాల్ వచ్చింది. ఫోన్ రిసీవ్ చేసుకున్న వ్యక్తికి అవతల పోలీసు కనిపించాడు. తాను హైదరాబాద్ నుంచి ఫోన్ చేస్తున్నాననీ, మీ కుమారుడు డిజిటల్ మోసాలకు పాల్పడ్డాడనీ సదరు పోలీసు చెప్పాడు. ఖంగుతిన్న తండ్రిని తనకు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపిస్తే కేసు నమోదు కాకుండా చూస్తానని చెప్పాడు. దీన్ని నమ్మిన తండ్రి నగదు బదిలీ చేసి అనంతరం కుమారుడికి ఫోన్ చేయగా తాను క్షేమంగా ఉన్నాననీ, పోలీసులెవరూ తనను అరెస్టు చేయలేదనీ చెప్పడంతో మోసపోయానని గుర్తించాడు. సైబర్ మోసాలు రూపు మార్చుకున్నాయనడానికి ఇది ఓ ఉదాహరణగా నిలుస్తోంది. సైబర్ నేరాలపై పోలీసులు అప్రమత్తం చేస్తున్నా.. నేరగాళ్లు తమ మోసాల రూపు మార్చి మరీ బురిడీ కొట్టిస్తున్నారు. ఆన్‌లైన్ ట్రేడింగ్, క్రిప్టో పెట్టుబడులు, ఉద్యోగాలు, ఓటీపీ పేరిట మోసాలు.. ఇలా పలు విధాలుగా మోసాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఆన్‌లైన్ మోసాల బారిన పడుతున్న వారిలో అత్యధికులు విద్యావంతులే ఉండటం నేరగాళ్ల తీవ్రతకు అద్దం పడుతోంది. పోలీసులు పలు విధాలుగా అవగాహన కల్పిస్తున్నా ఏటా బాధితులు పెరుగుతూనే ఉన్నారు..

**మచ్చుకు కొన్ని ఘటనలు**

జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం మద్దునూరుకు చెందిన ముంజల నారాయణకు చెందిన ఆధార్, పాన్‌కార్డులను మార్ఫింగ్ చేసిన సైబర్ నేరగాళ్లు ఏకంగా 7 బ్యాంకుల్లో రూ.20 లక్షల రుణాలు తీసుకున్నారని తెలిసి బాధితుడు లబోదిబోమన్నాడు. 2018 నుంచే జరుగుతున్న ఈ మోసం బ్యాంకర్లు 2024లో రుణం చెల్లించాలంటూ బాధితుడికి ఫోన్ చేయడంతో తెలిసింది.

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతిగల్‌కు చెందిన రిషివర్ధన్‌కు సైబర్ నేరగాళ్లు కొంత పెట్టుబడిపై లాభాలు చూపారు. రూ.2.50 లక్షలు కడితే మరిన్ని లాభాలు ఆర్జించవచ్చని ఆశ చూపారు. ఇంతలోనే ఆయన ఖాతా ఖాళీ కావడంతో తాను మోసపోయానని మథనపడిన రిషివర్ధన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మూడు వారాల కిందట జరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఓ విద్యావంతుడు షేర్ మార్కెట్ మోసాల బారిన పడి ఏకంగా రూ.90 లక్షల మేర నష్టపోయాడు. విద్యావంతులు కూడా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారని ఈ ఘటన తెలియజేస్తోంది.

**కేసుల వివరాలు ఇలా..**

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 2024లో ఆర్థిక నేరాలకు సంబంధించి 726 కేసులు నమోదు కాగా అందులో 46 శాతం సైబర్ నేరాలు ఉన్నాయి. సైబర్ నేరాలకు సంబంధించి 2,282 ఫిర్యాదులు రాగా 270 కేసులు నమోదు చేశారు. 233 కేసుల్లో బాధితులకు సంబంధించిన రూ.9.87 కోట్లు హెూల్డ్‌లో ఉంచారు.

జగిత్యాల జిల్లాలో 2024లో 1,289 కేసులు నమోదు కాగా రూ.8 కోట్ల మేర బాధితులు నష్టపోయారు. జగిత్యాల పట్టణంలో 781 కేసులు నమోదయ్యాయి. సైబర్ నేరాలకు పాల్పడిన 702 మందిపై 438 కేసులు నమోదయ్యాయి. సైబర్ మోసాల్లో నష్టపోయిన రూ.8 కోట్లలో రూ.1.12 కోట్లు రికవరీ చేశారు.

పెద్దపల్లి జిల్లాలో 2024లో 148 సైబర్ కేసులు నమోదు కాగా బాధితులు రూ.3.67 కోట్లు మోసపోయారు.

ఇవి పాటించాలి..

చరవాణులకు వచ్చే సంక్షిప్త సందేశాలకు, కాల్ సెంటర్ల నుంచి వచ్చే ఫోన్లకు స్పందించవద్దు.

క్రిప్టో కరెన్సీలు, మల్టీ లెవల్ మార్కెటింగ్‌లను నమ్మొద్దు.

వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలు చెప్పవద్దు.

వాట్సప్‌లు, ఇతర సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఆన్‌లైన్ లింకులను తెరిస్తే ప్రమాదమే అని నిపుణులు చెబుతున్నారు.

రివ్యూ రేటింగ్, పెట్టుబడుల వల, బెట్టింగుల పేరిట మోసాలు పెరుగుతున్నాయి.

యువకులు, చిన్నారులు సామాజిక మాధ్యమాల వాడకాన్ని విరివిగా వాడటం మానేయడంతో పాటు తల్లిదండ్రులకు ఆన్‌లైన్ మోసాల గురించి తెలిపితే నష్టాలు తగ్గే అవకాశముంటుంది.

అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియోకాల్స్, ఓఎల్ఎక్స్ ప్రకటనలకు దూరంగా ఉండాలని పేర్కొంటున్నారు.

తాజాగా డిజిటల్ అరెస్ట్ పేరిట పోలీసులమంటూ ఫోన్‌కాల్స్ చేస్తూ వలలో వేస్తున్నారు. వీరి పట్ల అప్రమత్తంగా ఉండాలి.

**ఖాకీ కిడ్స్ వినూత్నం**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సైబర్ నేరాల నియంత్రణకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఖాకీ కిడ్స్ పేరిట కార్యక్రమాన్ని రూపొందించి రోడ్డు ప్రమాదాలు నివారణ సహా సైబర్ నేరాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ప్రజలను అప్రమత్తం చేసేందుకు యత్నిస్తున్నారు. సైబర్ నేరాలు జరిగే విధానం, ఓటీపీ మోసాలు, సామాజిక మాధ్యమాల్లో ఉద్యోగ ప్రకటనలపై అవగాహన కల్పిస్తున్నారు.

**తక్షణ ఫిర్యాదుతో న్యాయం**


ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తం చేస్తున్నా బాధితులు పెరుగుతున్నారు. సైబర్ నేరాలపై వస్తున్న ఫిర్యాదులపై కేసులు నమోదు చేస్తున్నాం. ఆన్‌లైన్ మోసాలు జరిగినప్పుడు 1930 నంబరుకు, సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సత్వర న్యాయం జరిగే అవకాశం ఉంటుంది. నేరగాళ్లు నగదు ఖాళీ చేయకుండా ఖాతాను నిలిపివేసే వీలుంటుంది. పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించిన సందర్భాల్లో న్యాయం జరిగింది. ఫిర్యాదులను అనుసరించి కేసులు నమోదు చేసి నిందితులకు శిక్షలు పడేలా చేస్తాం. రఘుచందర్, జగిత్యాల డీఎస్పీ

# భూపరిహారానికి ఎదురుచూపులు

రామడుగు : రామడుగు శివారులోని మోతెవాగు కొత్త వంతెన నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందక, నిరీక్షణ తప్పడం లేదు. 2019లో రూ.7.9 కోట్లతో మంజూరు చేసిన కొత్త వంతెన నిర్మాణ సమయంలో భూసేకరణ ప్రక్రియ చేర్చలేదు. ఈ కారణంతో అయిదేళ్లు గడిచినా కొత్త వంతెన ప్రారంభం కాలేదు. గతేడాది సెప్టెంబరులో రూ.11.20 కోట్లతో సవరణ ప్రతిపాదన చేసి భూనిర్వాసిత రైతులకు పరిహారం ప్రకటించారు. నవంబరులో రూ.1.54 కోట్ల పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ రెండు నెలలైనా పరిహారం రైతులకు అందలేదు.

**ఎమ్మెల్యే చొరవతో రాకపోకలు..**

గత వానాకాలంలో పాత వంతెనపై నుంచి వరద ప్రవహించడంతో రైతులను ఒప్పించి తాత్కాలికంగా రోడ్డు నిర్మించడంలో స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సఫలీకృతులయ్యారు. రామడుగు, పెగడపల్లి, గంగాధర, చొప్పదండి మండలాలకు చెందిన సుమారు 60 గ్రామాల ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థుల ఇబ్బందులు తప్పాయి. కానీ వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డుకు తారు లేకపోవడంతో వాహనదారులు దుమ్ముతో ఇబ్బంది పడుతున్నారు. పరిహారం చెల్లించి,



తారు రోడ్డు పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

**మా ఖాతాలో పడలేదు..**కొత్త వంతెన పనులు మొదలుపెట్టిన నాటి నుంచి మా భూముల్లో వాహనాలు, సామగ్రి నిల్వ చేయడంతో పంటలు సాగు చేయలేకపోయాం. గత ప్రభుత్వం భూపరిహారం ప్రకటించకుండానే రహదారి ఏర్పాటుకు ప్రయత్నం చేస్తే అడ్డుకున్నాం. ఇప్పటి ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. కానీ ఇంతవరకు మా ఖాతాలో పడలేదు. ప్రభుత్వం సత్వరం పరిహారం చెల్లించాలి. కదారి బీరయ్య, రామడుగు రైతు

# లెక్కల్లో పారదర్శకత..

సంగారెడ్డి : పొదుపు సంఘాల లెక్కలు పారదర్శకంగా ఉండాలి. ఇవి సక్రమంగా లేకపోతే గొడవలు జరిగే అవకాశం లేకపోలేదు. దస్త్రాలకు, అంతర్జాలంలో వివరాలకు పొంతన ఉండటం లేదు. ఇది సైతం ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు కట్ అప్ షీట్ల తయారీ విధానాన్ని తెరపైకి తీసుకొచ్చారు. పొదుపు సంఘాల లెక్కల్లో పారదర్శకత పెంపే లక్ష్యంగా దీన్ని ప్రవేశపెట్టడం విశేషం.

**ఏం చేస్తున్నారంటే..**

గ్రామైక్య సంఘం పరిధిలోని మహిళా సంఘాల లెక్కలన్నీ ప్రస్తుతం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు పుస్తకాల్లోనూ నమోదు చేస్తున్నారు. ఇక్కడే తేడా వస్తోంది. బ్యాంకులో జమ చేసిన నగదు, రుణవాయిదాల చెల్లింపుల వివరాల నమోదులో వీవోఏలు చాలా చోట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పుస్తకాలు, అంతర్జా



లం లెక్కలు సమానంగా ఉండని పరిస్థితి. ప్రస్తుతం ఈ లెక్కలను సరిచేసే పనిలో ఐకేపీ సిబ్బంది నిమగ్నమయ్యారు. గతేడాది డిసెంబరు వరకు పొదుపు సంఘాల్లో జరిగిన లావాదేవీలను పరిశీలిస్తూ.. అంతర్జాలం, పుస్తకాల్లో తేడాలు లేకుండా చూస్తున్నారు. దీనివల్ల ఎక్కడైనా వీవోఏలు లేదా గ్రూపు లీడర్లు అక్రమాలకు పాల్పడినా ఇట్టే తెలిసిపోతుంది.

**65 వేలకు పైగా సంఘాలు**

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో కలిపి 65,173 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. అన్నింటిలో కలిపి 6.87 లక్షల మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. సంఘాల సభ్యులకు తమ సంఘం ఆర్థిక పరిస్థితులు తెలిసేలా ప్రతి ఏటా సంఘాల వారీగా ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఉన్న వివరాలు, దస్త్రాల్లో ఉన్న వాటికి సరిపోక సరైన లెక్కలు తేలని పరిస్థితి నెలకొంటోంది.

**ఉన్నతాధికారుల ఆదేశాలతో..: జంగారెడ్డి, అదనపు డీఆర్డీవో, సంగారెడ్డి**

పొదుపు సంఘాలకు సంబంధించిన లెక్కల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా సంఘాల వారీగా కట్ అప్ షీట్లు తయారుచేయిస్తున్నాం. లెక్కలు సక్రమంగా ఉంటేనే సభ్యుల మధ్య సత్సంబంధాలు ఉంటాయి.

# ఇక.. పురాల్లో ప్రత్యేక పాలన

సంగారెడ్డి : పురపాలక సంఘాల పాలకవర్గాల గడువు ఆదివారంతో ముగిసింది. దీంతో జహీరాబాద్ మినహా 7 జిల్లాలోని పురపాలికలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు అమల్లోకి రానున్నాయి. మున్సిపాలిటీలకు సంబంధించిన అన్ని అధికారాలు ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లాయి.

**అధికారులకు బాధ్యతలు**

జిల్లాలో జహీరాబాద్ మినహా మిగతా ఏడు పురపాలక సంఘాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. సంగారెడ్డి, సదాశివపేట, అందోలు-జోగిపేట, నారాయణఖేడ్‌లకు అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) చంద్రశేఖర్, అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్‌లకు పురపాలక శాఖ జాయింట్ డైరెక్టర్ ఫల్గుణ కుమార్‌లను ప్రత్యేకాధికారులుగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరు సోమవారం విధుల్లో చేరనున్నారు. జహీరాబాద్ పురపాలికకు ఎన్నికలు నిర్వహించక పోవడంతో ఐదేళ్లుగా ఆర్డీవో ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్నారు. పట్టణాల్లో ఏ అభివృద్ధి కార్యక్రమం, పనులు జరగాలన్నా.. ఇక నుంచి ప్రత్యేకాధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. రాబోయే వేసవిలో నీటి సమస్య రాకుండా ఇప్పటి నుంచే ప్రత్యేక చర్యలు చేపట్టాలి. పాలకవర్గం గడువు ముగింపులో అన్ని పురపాలికల్లో భారీగా అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు రూపొందించి ఆమోదించుకున్నారు. వీటికి సంబంధించిన పనులు ప్రత్యేకాధికారుల అనుమతితోనే చేపట్టాలి. వీరు అందుబాటులో ఉంటేనే స్థానిక సమస్యలు పరిష్కారమవుతాయి.

**కొత్తవాటికి నియామకాలేవి?**

జిల్లాలో ఇటీవలే కొత్తగా ఇస్నాపూర్, గడ్డపోతారం, గుమ్మడిదల, కోహీర్ పురపాలక సంఘాలుగా ఏర్పాటయ్యాయి. వీటికి సిబ్బందిని నియమించకపోగా.. ప్రత్యేకాధికారులనూ ప్రకటించలేదు. కొత్త వాటిలో కమిషనర్‌తో పాటు ఇతర సిబ్బంది నియామకమైన తర్వాతే ప్రత్యేకాధికారులను నియమించే అవకాశం ఉందని పురపాలక శాఖ అధికారులు తెలిపారు.

# పంటల బీమా.. రైతన్నకు ధీమా

గజ్వేల్: ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో పంటలు నష్టపోయే రైతులను ఆదుకునేలా పంటల బీమా అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పథకం అమలుకు భారతీయ వ్యవసాయ బీమా సంస్థ(ఏఐసీ) ముందుకొచ్చింది. 2021 నుంచి పంటల బీమా అమలు కావడం లేదు. వచ్చే వానాకాలం నుంచి పూర్తిస్థాయిలో అమలు చేయాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తున్నారు. రైతుల తరుపున బీమా ప్రీమియం ఉచితంగా చెల్లించి కేంద్రం సహాయంతో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో జిల్లాలోని లక్షలాది మంది కర్షకులకు బీమా ధీమా కానుంది. బీమా అమలులో లేకపోవడంతో ఇప్పటిదాకా జిల్లాలో చాలా మంది అన్నదాతలు పంట నష్టాలు ఎదుర్కొన్నారు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**వడగళ్ల వానలకు..** ఖరీఫ్ చివర్లో వడగళ్ల వానలకు 2,800 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. పంటలు ఎండిపోయినా సందర్భంలోనూ రైతులను ఆదుకునేలా పంటల ఫసల్‌బీమా ధీమా ఇవ్వనుంది. వచ్చే వానాకాలం సీజన్ నుంచి బీమా అమలు చేసే అవకాశం ఉందని, విధివిధానాలు రాగానే రైతులను సమాయత్తం చేస్తామని వ్యవసాయ అధికారులు తెలిపారు. **గతేడాది యాసంగి పంట నష్టం:** వరి 44,601, ఉద్యాన పంటలు 6158, మొక్కజొన్న 475, ఇతర పంటలు 1173 ఎకరాల్లో నష్టపోయాయి. **జిల్లా వ్యాప్తంగా రెండు సీజన్లలో..** జిల్లా వ్యాప్తంగా 3 లక్షల మంది రైతులు ఖరీఫ్, యాసంగి సీజన్లలో 7 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, ఉద్యాన పంటలు వేస్తారు. ఎకరాకు సరాసరి రూ.15 వేల చొప్పున దాదాపు రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడి పెడుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో వడగళ్లు, అకాల వర్షాలు రావడంతో పూర్తిగా నష్టపోతుంటారు. వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం బీమా పథకం అమలు చేస్తుంది.

చురకలు



# బోధన ఆదర్శం.. భవిత బంగారం

ఆలూరు : పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలనే సంకల్పంతో ఆదర్శ పాఠశాలలకు శ్రీకారం చుట్టారు. ఆదర్శ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ బోధనతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీంతో చాలా మంది తల్లిదండ్రులు పిల్లలను ఆదర్శ పాఠశాలల్లో చేర్పించేందుకు పోటీ పడుతున్నారు. ప్రస్తుతం ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశానికి ప్రకటన జారీ చేశారు. ఈ నెల 24 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకానుంది.

**భవితకు చక్కని అవకాశం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 36 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాలల వద్దే వసతి గృహాలు నిర్మించారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు బాలికలు వసతిగృహంలోనే ఉంటూ చదువుకునే అవకాశం కల్పించారు. పేద ప్రతిభావంతులైన పిల్లలకు పూర్తిస్థాయిలో ఆంగ్ల మాధ్యమ విద్య అందిస్తున్నారు.

**పాఠశాల ప్రత్యేకతలు**

ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఒకే ఆవరణలో చదువుకునే అవకాశం. అత్యాధునిక తరగతి గదుల్లో ఆంగ్ల మాధ్యమం, క్రమ శిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యా బోధన. ఉన్నత విద్యార్హతలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన. ఎన్ఎమ్ఎమ్ఎస్, ఒలింపియాడ్ తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులను ఆరో తరగతి నుంచే సన్నద్ధం చేయడం. శారీరక, మానసిక దృఢత్వం కోసం విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడం.



**ప్రవేశ పరీక్షతో ఎంపిక**

ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నారు. ఏప్రిల్ 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఏ మండలంలో ఆదర్శ పాఠశాలలు ఉంటాయో అక్కడే ప్రవేశ పరీక్ష రాయొచ్చు. ప్రవేశ పరీక్షల్లో ఓసీ, బీసీ విద్యార్థులు కనీసం 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు వచ్చి ఉండాలి. ప్రతిభ ఆధారంగా, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం విద్యార్థులను ఎంపిక చేయనున్నారు.

**ఆన్‌లైన్‌లో నమోదు**

ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రకటన జారీ చేశారు. ఈ నెల 24 నుంచి మార్చి 31వ తేదీ వరకు అంతర్జాలంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థి అర్హతను పరిశీలించి.. అర్హుడని తేలితే క్రెడిట్, డెబిట్, నెట్ బ్యాంకింగ్ కార్డులు ఉపయోగించి గేట్‌వే ద్వారా రుసుం చెల్లించిన తరువాత ఒక జనరల్ నెంబర్ కేటాయిస్తారు. ఈ నెంబరు ఆధారంగా %www.csw. ap.gov.in% -లేదా %www.apms.ap.gov.in%- వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

**ఇవీ అర్హతలు** ఓసీ, బీసీలకు చెందిన విద్యార్థులు 01-09-2013 - 31-08-2015 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01-09-2011 - 31-08-2015 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75, ఓసీ, బీసీ వారు రూ.150 రుసుం చెల్లించాలి. ప్రభుత్వం లేక ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా 2023-2024 - 2024-2025 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివి ఉండాలి. సద్వినియోగం చేసుకోవాలిరాఘవరావు, ప్రిన్సిపల్, ఆలూరు ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో చేరేందుకు ప్రకటన జారీ చేశారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఐదో తరగతి పూర్తిచేసుకున్న ప్రతి విద్యార్థి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆదర్శ పాఠశాలలు కొనసాగుతున్నాయి. నాణ్యమైన విద్యా బోధనతో

# స్థాయి పెరిగి.. సేవలు తరిగి

నంద్యాల : నంద్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిని జీజీహెచ్‌గా మార్పు చేసి రెండేళ్లు దాటింది. గతంలో 200 పడకలు ఉండగా.. ప్రస్తుతం 400 పడకలు చేశారు. త్వరలో 650 పడకల ఆసుపత్రిగా సిద్ధం చేయనున్నారు. అయినప్పటికి వైద్యశాలలో అవసరమైన సేవలు అందడం లేదు. గుండె పోటుతో ఆస్పత్రికి వచ్చే రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు లేదా 80 కి.మీ దూరంలో ఉన్న కర్నూలు జీజీహెచ్ ఆసుపత్రికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. నంద్యాల సర్వజన ఆసుపత్రిలో గుండె వైద్య నిపుణులు ఎప్పుడు వస్తారో అని ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. **అవసరమైన భవనాలు లేక..**

ప్రస్తుతం నంద్యాల సర్వజన ఆసుపత్రిలో 400 పడకలు ఉన్నాయి. మరో 250 పడకల వరకు పెంచాల్సి ఉంది. దీనికి కావాల్సిన వైద్య పరికరాలు, ఫర్నిచర్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అవసరమైన భవనాలు లేక పడకలు పెంచడం లేదు. ఆసుపత్రి ఆవరణలోని డీఎంహెచ్‌వో, డీసీహెచ్ కార్యాలయాలను ఖాళీ చేస్తే సుమారు 70 పడకలు పెరిగే అవకాశముంది. ఎంసీహెచ్ భవనంపై మరో అంతస్తు నిర్మించి పడకలు పెంచాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

**కర్నూలు వెళ్లాల్సిందే..**

నంద్యాల జిల్లా పరిధిలో.. ముఖ్యంగా గుండె సమస్యలతో వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. ప్రతిరోజు ప్రైవేటు ఆసుపత్రుల్లో వందకు పైగా ఓపీ ఉంటోంది. స్థానిక జీజీహెచ్‌లో కార్డియాలజీ వైద్యుడు లేకపోయినప్పటికీ రోజుకు 10 నుంచి 15 మంది ఓపీకి వస్తున్నారు. వైద్యులు గుర్తించి టెనెక్టిప్లస్ ఇంజెక్షన్లు వేసి కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు. దీంతో రోగులు 108 సాయంతో కర్నూలు వెళ్తున్నారు. 108 వాహనం అందుబాటులో రాకుంటే ప్రైవేటు అంబులెన్సులో రూ.2,500 చెల్లించి వెళ్తున్నారు. సూపర్ స్పెషాలిటీ సేవలైన న్యూరో, నెఫ్రాలజీ వైద్యం అందుతున్నప్పటికీ కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, అంకాలజీ, రేడియాలజీ వైద్య సేవలు అందడం లేదు.

ఉన్నతాధికారులకు తెలియ జీజీహెచ్‌లో ఏకో యంత్రం ఉంది. కార్డియాలజీ వైద్యులు లేరు. గుండె సంబంధిత బాధితులు పెరుగుతున్నారు. గుండెపోటు వచ్చిన వారికి టెనెక్టిప్లస్ ఇంజెక్షన్ ఇస్తున్నాం. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ ఇంజెక్షన్ ఖరీదు రూ.30 వేలకుపైగా ఉంటుంది. ఈ ఇంజెక్షన్ వేసి కర్నూలుకు రెఫర్ చేస్తున్నాం. కార్డియాలజీ వైద్యుడిని నియమించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

జీజీహెచ్‌లో పడకలు 400 చికిత్స పొందేవారి సంఖ్య 300

ప్రతిరోజూ ఓపీ 1300 రోజుకు శస్త్రచికిత్సలు 2025

# డెస్టినేషన్ వెడ్డింగ్ ట్రెండ్.. పెళ్లిళ్లకు పర్యాటక హోటళ్లు!



విశాఖపట్నం: డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు ఆదరణ పెరుగుతోంది. దూర ప్రాంతాల నుంచి పరిమిత సంఖ్యలో బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో వచ్చి వివాహాలు చేసుకునేందుకు ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారు. ఈ ట్రెండ్‌ను అందిపుచ్చుకునేలా ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ప్రత్యేక ప్రణాళిక చేస్తోంది. సంస్థకు చెందిన హోటళ్లను అందుకు అనుగుణంగా సిద్ధం చేస్తోంది. కొత్తగా నవీకరించిన వాటిల్లోనూ అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు. వివాహ వేదికలు, మందిరాలు, విడిది గదులు, ప్రత్యేక భోజన మెనూ సమకూర్చనున్నారు. ఉన్నతాధికారులు వీటి మీద దృష్టి సారించాలని ఆదేశించడమే కాకుండా 2025 వివాహ ముహూర్తాల క్యాలెండర్‌ను ప్రత్యేకంగా అందించడం గమనార్హం.

**డీవీఎం ఆధ్వర్యంలో..**

డివిజన్ పరిధిలో ఏపీటీడీసీకు విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఏడు రిసార్టుల్లో 200 గదులున్నాయి. వీటిలో అరకు, అనంతగిరి, లంబసింగి, విశాఖలోని రిసార్టులను డెస్టినేషన్ వెడ్డింగ్, పుట్టినరోజు, వార్షికోత్సవాలు, కంపెనీల మీట్లు, అధికారిక సమావేశాలకు విరివిగా వినియోగించాలని చూస్తున్నారు. వాటిల్లో బిజినెస్ డెవలప్‌మెంట్ కోసం డీవీఎం ఆధ్వర్యంలో ముగ్గురు అధికారుల బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, విశ్వవిద్యాలయాలు, కార్పొరేట్ సంస్థలు, కంపెనీలతో నిత్యం అందుబాటులో ఉండి డిమాండు కల్పించేలా చేయాలి. అరకులోని మయూరి, వ్యాలీ రిసార్టులను ఇటీవల నవీకరించారు. గదులను విలాసవంతంగా మార్చారు. ఇక్కడ క్రాఫ్ట్ హట్స్ ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. అనంతగిరి, లంబసింగిలో ఆరుబయట వేడుకలకు ఏర్పాట్లున్నాయి. ఇందుకోసం లంబసింగి వద్ద అదనపు గదులు నిర్మించాలని చూస్తున్నారు.

టూరిజం రిసార్టులను సినిమాలు, లఘు చిత్రాల చిత్రీకరణకు ఇచ్చి వారికి తగిన సౌకర్యాలు కల్పిస్తారు.

డిజిటల్ ప్రాచుర్యంతో... డివిజన్‌లోని ఏపీటీడీసీ రిసార్టులకు తగిన ప్రాచుర్యం కల్పించి రెవెన్యూ పెంచుకోవాలని చూస్తున్నారు. ముఖ్యంగా డిజిటల్ వేదికలైన ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, ట్రావెల్స్ గ్రూపులతో వాట్సప్‌గ్రూపులు నిర్వహించడం వంటివి చేయాలనుకుంటున్నారు. రిసార్టుల్లోని అందాలు, సహజ వాతావరణ పరిస్థితులు, ఇతర ప్రత్యేకతలను వీడియోలు చిత్రీకరించి డిజిటల్ వేదికల్లో తరచూ పంచుకునేలా ప్రణాళిక చేస్తున్నారు. అలాగే పలు రంగాల్లో పేరొందిన వ్యక్తులను ప్రచారకర్తలుగా నియమించుకోవాలని చూస్తున్నారు. వారితో టూరిజం హోటళ్ల ప్రత్యేకతలను వివరింపజేయనున్నారు. స్థానికంగా ఇది కొంత సత్ఫలితాలు ఇస్తుందని భావిస్తున్నారు.

**ఆదాయం రెట్టింపయ్యేలా..** గత కొంతకాలంగా విశాఖ కేంద్రంగా ఏపీటీడీసీకు వస్తున్న ఆదాయం తక్కువగా ఉంది. దీన్ని రెట్టింపు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇందుకు తగిన ప్రణాళికలను రూపొందించాం. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు ఆరు రిసార్టులు, బొర్రా గుహలు, టూరిజం ప్యాకేజీలు, జల విన్యాసాలతో రూ.19.77 కోట్ల ఆదాయం వచ్చింది. దీన్ని రూ.40 కోట్లకు పెంచడానికి వ్యూహాలు అమలు చేస్తున్నాం. ఎక్కడెక్కడి నుంచి ఎంత వస్తుందో సమీక్షించుకొని పెంచుకునే అవకాశాలున్న చోట పరిశీలిస్తున్నాం. జి.జగదీష్, డీవీఎం, ఏపీటీడీసీ

# కస్తూర్బా విద్యాలయాలకు తాజా పాలు



విశాఖపట్నం: అనాథ, నిరుపేద బాలికలకు వసతితో కూడిన బోధన అందిస్తున్న కస్తూర్బా విద్యాలయాల భోజన విషయంలో కూటమి సర్కార్ వచ్చిన తర్వాత మరింత నాణ్యతపై దృష్టి సారించింది. దీనిలో భాగంగా ఎప్పటికప్పుడు తాజా పాలను అందించేలా సంబంధిత శాఖ జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. దీనికోసం గుత్తేదారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లాలో నక్కపల్లి, ఎస్.రాయవరం, వేములపూడి, రోలుగుంట, గొలుగొండ, చోడవరం, అచ్యుతాపురం, మునగపాక, రాంబిల్లి, బుచ్చెయ్యపేట, దేవరాపల్లి, చీడికాడ ఇలా 20 చోట్ల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు నడుస్తున్నాయి. ఇక్కడ ఆరు నుంచి ఇంటర్ వరకు బోధన, వసతితోపాటు భోజనం ఉంటుంది. మెనూలో భాగంగా వారానికోసారి మాంసాహారం, ప్రతిరోజూ కూరగాయలతో భోజనం ఉంటుంది. అదేవిధంగా పాలు, మజ్జిగ, గుడ్డు, అల్పాహారం, స్నాక్స్ ఇస్తుంటారు. వీటిని అందించేందుకు ఏటా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో టెండర్లు పిలుస్తుంటారు. ఈ ఏడాది ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా ఉన్నతాధికారులు ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. పిల్లలకు తాజా పాలను మాత్రమే అందించేలా మార్పు చేశారు. ఆ మేరకు ఇంతవరకు ఇస్తున్న టెట్రా ప్యాకెట్ల స్థానంలో తాజా పాల ప్యాకెట్లను పంపిణీ చేయిస్తున్నారు. టెట్రా ఇస్తే నెలలో రెండు మూడుసార్లు మాత్రమే సరఫరా చేసేవారు. దీనికి బదులు తాజా పాల ప్యాకెట్లు కచ్చితంగా రెండు రోజులకోసారి సరఫరా చేసేలా నిబంధన పెట్టారు. జిల్లా వ్యాప్తంగా రోజూ వెయ్యి లీటర్లకు పైగా వినియోగిస్తున్నారు

ఒక్కో కేంద్రానికి అవసరమైన పాలను ఆరు లీటర్ల ప్యాకెట్ల రూపంలో అందిస్తున్నారు. ఇవి రెండు రోజులపాటు నిల్వ ఉండటానికి వీలుగా సంబంధిత గుత్తేదారు మినీ ఫ్రిజ్‌లను విద్యాలయాలకు పంపించారు. పాల ప్యాకెట్లను వీటిలో భద్ర పరిచి వాడుతున్నారు. ఒక్కో విద్యార్థికి రోజుకు 200 మి.లీ. పాలు ఇస్తారు. ఇందులో 80 మి.లీ. బూస్ట్‌లో కలిపి తాగేందుకు ఇస్తుండగా, 20 మి.లీ. పాలను రాగిజావలో కలుపుతారు. మిగిలింది మజ్జిగ రూపంలో రెండుపూటలా అందిస్తారు.

**నాణ్యత లేకుంటే వెనక్కి**

ప్రభుత్వ ఆదేశాలతో కస్తూర్బా విద్యాలయాలకు సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యతపై దృష్టి పెట్టాం. దీనిలో భాగంగానే తాజా పాలను అందించాలని గుత్తేదారుకు సూచించాం. ఇలా అనకాపల్లి జిల్లాలో మాత్రమే తొలిసారి అమలు చేస్తున్నాం. ఇందుకోసం వారే ఫ్రిజ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో పాటు కూరగాయలు తాజాగా, నాణ్యతగా ఉండాలని సూచించాం. సరకు బాగుంటేనే తీసుకోవాలని ప్రత్యేకాధికారులకు ఆదేశించాం. అదేవిధంగా బోధన నాణ్యత మరింత మెరుగుపడేలా చూస్తున్నాం. జయప్రకాశ్, ఏపీసీ, సమగ్ర శిక్ష, అనకాపల్లి

కేజీబీవీలు 20

విద్యార్థినులు 5129

రోజుకు వినియోగించే పాలు 1025 లీటర్లు

# ఉపాధికి బకాయిల బెడద



నంద్యాల : ఉపాధిహామీ పథకంలో పెండింగ్ బిల్లులు భారీగా పేరుకుపోయాయి. రూ.100 కోట్ల మెటీరియల్ నిధుల విడుదలలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో పెండింగ్ బిల్లులు రూ.144 కోట్లకు చేరుకున్నాయి. మరో రూ.15 కోట్ల పనులకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. నిధులు రాకపోవడంతో రెండు జిల్లాల్లోని అత్యధిక మండలాల్లో పనులు మందకొడిగా సాగుతున్నాయి. మరోవైపు తొమ్మిది వారాలుగా కూలీలకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది.

**నెలన్నరగా ఎదురుచూపులు**

ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు కర్నూలు జిల్లాలో రూ.23 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.21 కోట్ల మేర చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది జనవరి 9 తర్వాత చెల్లింపులు ఆగిపోయాయి. నిబంధనల మేరకు ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ అప్‌లోడ్ చేసిన 15 రోజుల తర్వాత కూలీలకు వేతనాలు చెల్లించాలి. కానీ అలా జరగడం లేదు.

**సీసీ రోడ్ల నిర్మాణంపై ప్రభావం**

ఉమ్మడి జిల్లాలో గత నవంబరు నుంచి పెద్ద ఎత్తున సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది మార్చి నెలాఖరుకు రెండు జిల్లాల్లో సుమారు రూ.210 కోట్లతో 2,039 రహదారుల పనులు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. మూడు నెలల్లోనే 80 శాతానికిపైగా పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం వీటికి మెటీరియల్ నిధుల విడుదల కాకపోవడం ఇబ్బందికరంగా మారింది.

**నెమ్మదించిన పనులు**

కేంద్రం నుంచి మెటీరియల్ నిధులు రూ.100 కోట్ల వరకు రాకపోవడంతో ఉమ్మడి జిల్లాలో ఉపాధి పనులు నెమ్మదించాయి. నిధులు వస్తాయనే ధీమాతో రెండు జిల్లాల్లో మార్చి ఆఖరు నాటికి లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ప్రణాళికలు రూపొందించుకున్నారు. తరచూ సమీక్షలు నిర్వహిస్తూ పనులు వేగవంతం చేశారు. వెనకబడిన మండలాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ క్రమంలో నిధుల కొరత ప్రతిబంధకంగా మారింది.

ప్రత్యేకించి గ్రామాల్లో రహదారులు, మురుగు కాల్వ పనులపై నిధుల కొరత ప్రభావం చూపుతోంది.

నంద్యాల జిల్లాలోని వెలుగోడు, సంజామల, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, బండిఆత్మకూరు, గడివేముల మండలాలు, కర్నూలు జిల్లాలోని కోడుమూరు, పెద్దకడబూరు, మంత్రాలయం, కోసిగి, చిప్పగిరి, సి.బెళగల్, కృష్ణగిరి, వెల్దుర్తి తదితర మండలాల్లో పనులు నెమ్మదించాయి.

నంద్యాల మండలంలోని కొత్తపల్లి, మిడుతూరు, పగిద్యాల, రుద్రవరం, కర్నూలు జిల్లాలోని హాలహర్వి, తుగ్గలి, గోనెగండ్ల మండలాల్లో పనులు ముందుకు సాగడం లేదు.

# అక్రమాలకు ఆధార్

ఆలూరు :కర్నూలుకు చెందిన స్వర్ణలత 2000 సంవత్సరంలో మునగాలపాడు పరిధిలో స్థలాలు కొనుగోలు చేశారు. ఈ స్థలంపై కర్నూలుకు చెందిన రఘు కన్నేశాడు. రమాదేవి అనే మహిళను మీసేవా కేంద్రానికి తీసుకెళ్లి స్వర్ణలత పేరిట తప్పుడు ఆధార్ కార్డు సృష్టించారు. ఆమె స్థల యజమాని అని చూపి ఇంకొందరికి స్థలం విక్రయించారు. ఈ విషయం బయటపడటంతో 2012లో కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.

2. కర్నూలుకు చెందిన లక్ష్మీదేవి అనే మహిళ 20 ఏళ్ల కిందట కర్నూలు సమీపంలోని జొహరాపురం రోడ్డులో స్థలం కొనుగోలు చేశారు. ఆమె హైదరాబాద్‌లో స్థిరపడినట్లు ఓ మాజీ కార్పొరేటర్ కుమారుడు తెలుసుకున్నాడు. ఓ మహిళను మీ సేవా కేంద్రానికి తీసుకెళ్లి లక్ష్మీదేవి పేరుతో ఆధార్ కార్డు తీసుకుని స్థల యజమానిగా చూపి మరొకరికి విక్రయించారు. దీనిపై పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, ఆదోని నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2002 తర్వాత మాత్రమే ఫొటోతో కూడిన రిజిస్ట్రేషన్ విధానం అమలులోకి వచ్చింది. అంతకుముందు వరకు




ఆస్తి కొనుగోలుదారులు, విక్రయదారుల పేర్లు, చిరునామా వివరాలు నమోదు చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసేవారు. అప్పట్లో ఆధార్ కార్డులు కూడా ఉండేవి కావు. ఆ తర్వాత నుంచి ఆధార్ కార్డు అమలులోకి రావడంతో దీనిని రిజిస్ట్రేషన్‌కు తప్పనిసరి చేశారు. ఇదే అవకాశంగా తీసుకుని పలువురు అక్రమార్కులు బరితెగిస్తున్నారు. 2002 ముందు ఆస్తులు కొనుగోలు చేసిన వారి వివరాలు సేకరించి వారి పేర్లతో ఆధార్ కార్డులు, నకిలీ పత్రాలు తయారుచేసి మోసాలకు పాల్పడుతున్నారు. ఫొటోతో కూడిన రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో స్థల యజమాని ఎవరో తెలియక, తప్పుడు ఆధార్ కార్డులను చూసి యజమానులుగా నమ్మి కొనుగోలుదారులు మోసపోతున్నారు. అసలైన స్థల యజమానులు కొన్నేళ్ల తర్వాత వారి స్థలాలకు అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలుసుకొని న్యాయం చేయాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, పోలీసుస్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. కంప్యూటర్ సెంటర్లే అడ్డాలు

ఆధార్ కార్డును అన్నింటికీ తప్పనిసరి చేయంతో ఉమ్మడి జిల్లాలో పలు జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలు నకిలీ ఆధార్ కార్డుల తయారీ కేంద్రాలుగా మారుతున్నాయి. డబ్బులిస్తే చాలు.. ఆధార్ కార్డులో చిరునామా మార్చేస్తున్నారు. ఫొటోలు మార్ఫింగ్ చేయడం తదితరాలు చేస్తున్నారు. కర్నూలులోని ఓ ఇంటర్‌నెట్ సెంటర్ నిర్వాహకులు రూ.వెయ్యి తీసుకుని నకిలీ ఆధార్ కార్డు తయారుచేసి ఇవ్వడంతో హైదరాబాద్‌లో స్థలాన్ని అక్రమ రిజిస్ట్రేషన్ చేసేశారు. కోర్టు విచారణకు హాజరుకాని వారి గురించి ఆరా తీసేందుకు వెళ్లే పోలీసులు సైతం తప్పుడు ఆధార్ కార్డుల చిరునామాతో కంగుతింటున్నారు.

# వరుస కట్టి.. కొండను కొల్లగొట్టి

ఆలూరు : అర్ధరాత్రి అయితే చాలు.. వరుస కట్టి ఎర్రమట్టిని దోచేస్తారు. మళ్లీ పొద్దు పొడిచిందంటే చాలు తమకేం తెలియదన్నట్లుగా ఎవరి పనులు వారు చేసుకుంటుంటారు. ఆలూరులో అడ్డూఅదుపు లేకుండా ఎర్రమట్టి దందా కొనసాగుతున్నా అధికారులు మాత్రం అటువైపు తొంగి చూడటం లేదు.

**ఒప్పందం చేసుకుని..**

ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 915/బిలో 16 ఎకరాలు, 969లో 662.01 ఎకరాల కొండ, 557 సర్వే నంబరులో 105.04 ఎకరాల్లో కృష్ణాపురం కొండలు విస్తరించాయి. కృష్ణాపురం కొండ నుంచి ప్రతిరోజూ రాత్రి ఎర్రమట్టి తరలిస్తూ అక్రమ సంపాదనకు తెరలేపారు. ఈ మట్టిని పవన విద్యుత్తు సంస్థలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్ల యజమానులతో ఒప్పందం చేసుకున్నవారు రాత్రైతే చాలు.. ఆ కొండలోకి ట్రాక్టర్లు తీసుకెళ్లి పొక్లెయిన్‌తో ఎర్రమట్టి తవ్వి ట్రాక్టర్లలో యథేచ్ఛగా



తరలిస్తున్నారు. ఈ విషయం పోలీసులు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

**అనుమతులు లేకుండానే..**

ఆలూరు నుంచి గుంతకల్లు వెళ్లే దారిలో ఏబీసీ కాల్వ గట్టుపై ఓ కి.మీ. దూరంలో ఎర్రమట్టి కొండను తవ్వి మట్టి విక్రయిస్తున్నారు. మట్టి తరలించాలంటే ఆయా శాఖల అనుమతి తప్పనిసరి. కానీ అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకున్న దాఖలాలు ఎక్కడా లేవు. ఈ విషయమై ఆలూరు తహసీల్దారు గోవింద్ సింగ్ వద్ద ప్రస్తావించగా.. రాత్రిళ్లు జరిగే మట్టి అక్రమ రవాణా సంగతి తమ దృష్టికి రాలేదని చెప్పారు. రెండు చోట్ల బోర్డులు ఏర్పాటు చేశామని.. అక్రమ రవాణాపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లాలో చాలాచోట్ల ఎర్రమట్టి దందా జరుగుతున్నా మైనింగ్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇకనైనా స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**బోర్డులున్నా..అడ్డేది**

హత్తిబెళగల్, అగ్రహారం గ్రామ పరిధిలోని ఓ కొండలో మట్టి తవ్వకాలు చేపట్టొద్దని రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వాటిని వదిలిపెట్టి మరోచోట గ్రామానికి దూరంగా ఉన్న కృష్ణాపురం కొండల్లో తవ్వకాలు చేపడుతున్నారు.

చురకలు



## ఉమ్మడి పరీక్ష.. వద్దే వద్దు

తిరుపతి : రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పీజీ ప్రవేశాలు అంతకంతకూ పడిపోతున్నాయి. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన విభాగాలు సైతం బోసిపోయి మనుగడ కోసం పోరాటం చేస్తున్నాయి. గత ప్రభుత్వంలో వేళ్లూనుకున్న రాజకీయాలు, ఉమ్మడి ప్రవేశాలతో పెద్దఎత్తున నష్టం జరిగిందని, కూటమి ప్రభుత్వం స్పందించి ఆయా వర్సిటీలకే పీజీ ప్రవేశాలు నిర్వహించుకునే అవకాశం కల్పిస్తే మంచిదనే అభిప్రాయం అటు విద్యార్థులు ఇటు ఆచార్యుల్లో వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో కోర్సుల ప్రక్షాళనపైనా దృష్టి సారించి నైపుణ్యాభివృద్ధితోపాటు ఉపాధికి ఊతమిచ్చే చర్యలు తీసుకోవాలన్న విన్నపాలున్నాయి. 2019 వరకు ఆయా వర్సిటీలే ప్రత్యేకంగా పీజీ సెట్‌లు నిర్వహించేవి. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటికి మంగళం పలికి రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ప్రవేశాలకు 2020-21లో మొదటిసారి ఏపీ పీజీసెట్ నిర్వహించింది. అలా ఇప్పటి వరకు ఉమ్మడిగా నాలుగు పీజీసెట్‌లు జరిగాయి. సుదీర్ఘ చరిత్రగల ఎస్వీయూలోనూ విద్యార్థులు లేక పలు కోర్సులు మూతపడ్డాయి. కొన్నింటిలో ఒకే అంకెలో విద్యార్థులుంటున్నారు. పలు విభాగాల్లో ఆచార్యులు తప్ప విద్యార్థులు లేరన్న విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో రాజకీయాలకు కేంద్రంగా వర్సిటీలు మారిపోవడంతో పెద్దఎత్తున



నష్టం జరిగింది.

**మహిళా వర్సిటీలో ఇలా..**

శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో 28 విభాగాలు 50 కోర్సులున్నాయి. ఇందులో 5,700 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఎంబీఏ, ఎంసీఏ, నర్సింగ్, ఇంజినీరింగ్, ఫార్మసీ వంటి కోర్సులు కాకుండా పీజీ కోర్సుల్లో మాత్రమే 984 సీట్లు ఉన్నాయి. 2019-20 వరకు ఎస్పీఎంవీవీ పీజీసెట్ నిర్వహించేవారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన వర్సిటీ కావడంతో ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల విద్యార్థినులు 42:36:22 నిష్పత్తిలో ప్రవేశాలు పొందేవారు. 2020 ముందువరకు కోరుకున్న కోర్సుల్లో ప్రవేశాలు దొరక్క నిరాశ చెందేవారు. అప్పటి గిరాకీ ఇప్పుడు కనిపించడం లేదు. వర్సిటీలకు ప్రత్యేకంగా పీజీసెట్ నిర్వహణకు అనుమతి ఇవ్వడంతో పరిస్థితిలో కొంత మార్పు వచ్చే అవకాశం ఉందని విద్యార్థి నేతలు, ఆచార్యులు పేర్కొంటున్నారు.

**పరీక్షతో నష్టం ఇలా..**

దరఖాస్తు చేసుకున్నా పరీక్షకు హాజరుకాకపోవడం
హాజరైనా సరైన కోర్సును ఎంపిక చేసుకోలేకపోవడం.
దగ్గరలోని వర్సిటీలో చేరేందుకు అవకాశం లేకపోవడం.
వ్యయభారం పెరగడం.

దగ్గరలో ఉన్నా సీటు రాలేదు

మాది కర్నూలు జిల్లా. దగ్గరలో రాయలసీమ వర్సిటీ ఉంది. కౌన్సెలింగ్‌లో అక్కడ కాకుండా మహిళా వర్సిటీలో సీటు వచ్చింది. రానుపోను ఖర్చులు, వసతి అదనపు భారం అయ్యాయి. పక్కనే యూనివర్సిటీ ఉండి ఇంతదూరం రావాల్సి వచ్చింది. కోర్సు పూర్తిచేసేలోపు ఖర్చు మరింత పెరగనుంది. సెలవుల్లో ఇంటికి వెళ్లాలన్నా కష్టమే. గాయత్రి, పీజీ విద్యార్థిని

## ఆలయాల పునర్వ్యవస్థీకరణ

చిత్తూరు : దేవాదాయ శాఖలో సంస్కరణలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆలయాలకు సంబంధించిన వివరాల నవీకరణ జరగకపోవడంతో వాటి అభివృద్ధి కార్యకలాపాలు, ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియలో స్తంభన నెలకొంది. పరిస్థితిని గుర్తించిన రాష్ట్ర దేవాదాయ శాఖ ఆలయాల పునర్వ్యవస్థీకరణపై ఉత్తర్వులు జారీ చేసింది. ఆదాయ పరిమితిని సవరిస్తూ జిల్లాలో 18 ఆలయాలను జాబితాలో చేర్చింది. వివరాలిలా ఉన్నాయి. జిల్లాలో 6(ఏ) కేటగిరీలో ఉన్న శ్రీ మొగిలీశ్వరస్వామి దేవస్థానం-బంగారుపాళ్యం మండలం, శ్రీ మాణిక్య



వరదరాజస్వామి ఆలయాన్ని (పుంగనూరు)

6(బి) కేటగిరీ కింద మార్పు చేశారు. శ్రీ 6(బి) కేటగిరీలో చిత్తూరు నగరంలోని శ్రీ నవ్వకన్నికలమ్మ ఆలయం-దొడ్డిపల్లి, శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం, శ్రీ ముత్యాలమ్మ దేవస్థానం-తేనెబండ, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం-గిరింపేట, శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ శివకామ సుందర వినాయకస్వామి దేవస్థానం, శ్రీ పొన్నియమ్మ ఆలయంతోపాటు శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం-కార్వేటినగరం, శ్రీ సత్యగంగమ్మ దేవత ఆలయం-పాతపేట(పలమనేరు), శ్రీ రణభేరి గంగమ్మ దేవత ఆలయం-దిగువపల్లి(చౌడేపల్లి), శ్రీ ప్రసన్న వరదరాజస్వామి ఆలయం-లక్ష్మీపురం(కుప్పం), శ్రీ ఆలియెలమ్మ దేవత ఆలయం-జీడీనెల్లూరు, పుంగనూరులోని శ్రీ భోగనంజుండేశ్వర స్వామి ఆలయాల్ని 6(సి) కేటగిరీ కింద చేర్చారు.

## అడిగేదెవరు.. దోచేయ్

చిత్తూరు : గ్రామీణ మండలం కన్నికాపురం, సిద్ధంపల్లె రెవెన్యూ పరిధిలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారు.. చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారి గుత్తేదారు సంస్థ సిబ్బంది కన్నికాపురం గుట్ట నుంచి కొద్ది రోజులుగా అక్రమంగా రవాణా సాగిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకపోకపోవడంపై వాహనదారులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రోడ్లు పునరుద్ధరించాలి**టిప్పర్లలో మట్టి రవాణాతో రోడ్లు ధ్వంసమయ్యాయి. దుమ్మూధూళి పశుగ్రాసంపై పడటంతో మేతకు పనికిరాదు. రోడ్డు పక్కన పంటలు సాగు చేసిన రైతులకు నష్టపరిహారం ఇవ్వడం సహా ధ్వంసమైన రోడ్లను వెంటనే పునరుద్ధరించాలి. ధనంజయనాయుడు, రైతు, ఎల్‌బీపురం

# పేరు మార్చేసి.. సొమ్ము ఎగ్గొట్టి!



అనంతపురం : నగరపాలికలో ఏదైనా వ్యాపారం చేయాలంటే ట్రేడ్ లైసెన్స్ పొందాల్సిందే. ప్రతి సంవత్సరం కొంత సొమ్ము చెల్లించి రెన్యువల్ చేసుకొని వ్యాపారాలు చేసుకోవచ్చు. రూ.కోట్లలో వ్యాపారాలు చేసుకుంటున్నా రెన్యువల్ సొమ్ము ఏళ్ల తరబడి చెల్లించకుండా దుకాణం పేరు ఒక అక్షరం మార్చో, లేక పేరు మొత్తం మార్చో కొత్త లైసెన్స్ పొందుతూ.. నగరపాలికకు రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. నగరంలో కమలానగర్ ప్రధాన వ్యాపార కేంద్రం. ఇక్కడ వేలల్లో వ్యాపార సముదాయాలున్నాయి. రోజుకు సరాసరి రూ.5 వేల వ్యాపారం మొదలుకొని రూ.కోట్లలో లావాదేవీలు సాగించే దుకాణాలెన్నో ఉన్నాయి. ఇందులో ఏ లైసెన్సూ పొందని దుకాణాలు వేల సంఖ్యలో ఉన్నా అడిగేవారే లేరు. అప్పుడప్పుడు అధికారులు తనిఖీల పేరుతో సొమ్ము వసూలు చేసుకొని ఏ చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలున్నాయి.

**అక్రమాలు మచ్చుకు కొన్ని..**

ఈ నెల 13న కమలానగర్‌లోని ఓ దుకాణం వద్దకు నగరపాలక అధికారులు వెళితే లైసెన్సు లేకుండానే రూ.లక్షల్లోనే వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. కేవలం రూ.5 వేలు అపరాధ రుసుం విధించి వదిలేశారు.

2019 కంటే ముందు నగరంలో 26 వరకు మద్యం దుకాణాలుండేవి. కొన్నేళ్లుగా ఆయా దుకాణాల నుంచి రూ.25 లక్షలకు పైగానే కట్టాల్సి ఉన్నా శానిటేషన్ విభాగం అధికారులు, ఇన్‌స్పెక్టర్లు కుమ్మక్కై వారితో కట్టించుకోకుండా వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరంలో 34 మద్యం దుకాణాలు వెలిశాయి. వాటికి ట్రేడ్ లైసెన్సులు వేయకుండా వదిలేయడంపై విమర్శలు వస్తున్నాయి.

బార్ అండ్ రెస్టారెంట్లు, హోటళ్లు, పాఠశాలలు, రెసిడెన్సీలు, ఆసుపత్రులు, ద్విచక్ర వాహన విక్రయించే దుకాణాలు, పెట్రోలు బంకులు రెన్యువల్ సొమ్ము కట్టకుండా పేర్లు మార్చి కొత్త లైసెన్సులు పొందుతున్నారు. ఇలాంటివి 4 కొత్త లైసెన్సులు పొందినవారూ ఉన్నారు. కొన్ని దుకాణాలపై పాత బకాయి రూ.50 వేల నుంచి రూ.2 లక్షలకు పైగానే ఉంది. సొమ్ము కట్టించుకోకుండానే కొత్త లైసెన్సులు ఇవ్వడంపై భారీగా డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై విజిలెన్స్ మొట్టికాయ వేయడంతో బకాయిలు చెల్లించని యజమానుల వివరాలు సేకరించారు.

పాత బకాయిలు చెల్లిస్తేనే రెన్యువల్
- విష్ణుమూర్తి, నగర ప్రజారోగ్య అధికారి

గతంలో పాత బకాయిలున్నా వేర్వేరు పేర్లతో కొత్త లైసెన్సులు ఇచ్చారు. ప్రస్తుతం పాత బకాయిలు కడితేనే రెన్యువల్ చేస్తున్నాం. లైసెన్సులు లేకుండా ఏ తరహా వ్యాపారం చేసినా సంబంధిత శానిటేషన్ సెక్రటరీలు బాధ్యత వహించి చర్యలు తీసుకోవాలి.

# ఆదుకుంటామన్నారు.. నట్టేట ముంచేశారు



అనంతపురం : చిన్న ఉద్యోగమైనా దక్కింది. ఇక ఎటువంటి కుటుంబ సమస్యలుండవు. జీవితం సాఫీగా సాగుతుంది. పిల్లల్ని ఉన్నత చదువులు చదివించుకోవచ్చునుకున్న వారి ఆశలను తుంచేసి నట్టేట ముంచేసింది రెడ్డి ఎంటర్‌ప్రైజెస్ సంస్థ. వైకాపా ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీల్లో చెత్తను సేకరించి డంపింగ్‌యార్డులకు తరలించేందుకు క్లాప్(క్లీన్ ఆంధ్ర) పథకం కింద ఆటోలను ఏర్పాటు చేసింది. ఈ పనులను రాష్ట్రవ్యాప్తంగా రెడ్డి ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థకు అప్పజెప్పింది. మున్సిపాలిటీల్లో ఆటోల ద్వారా ఇంటింటా చెత్త సేకరించినందుకుగాను పన్ను వసూలు చేసి ఈ సంస్థకు ప్రతినెలా రూ.63,000 చొప్పున ఇచ్చేలా ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థే ఆటోలకు చోదకులను నియమించుకొని వారికి ప్రతినెలా రూ.16,000 (పీఎఫ్‌తో కలిపి) వేతనం ఇస్తామంది. దీని కోసం ప్రతి మున్సిపాలిటీలో సూపర్‌వైజర్లను నియమించుకుంది. ఉమ్మడి అనంత జిల్లావ్యాప్తంగా 130 క్లాప్ ఆటోలను ఏర్పాటు చేసిన రెడ్డి ఎంటర్‌ప్రైజెస్ సంస్థ అంతే సంఖ్యలో చోదకులను నియమించుకుంది. మున్సిపాలిటీ నుంచి ప్రతినెలా డబ్బులు వసూలు చేసిన సంస్థ చోదకులకు వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపింది. 2023 నవంబరు, డిసెంబరు నుంచే పలువురు చోదకులకు వేతనాలు ఇవ్వలేదు. సంస్థ ప్రతినిధులను అడిగితే అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశారు. 2024 ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటింటా చెత్త పన్నును రద్దు చేసింది. దీంతో క్లాప్ వాహనాలు మున్సిపాలిటీ కార్యాలయానికే పరిమితమయ్యాయి. వేతనాల కోసం చోదకులు ఆందోళనలు చేసినా.. వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. 13 నెలల వేతనం అందాల్సి ఉంది. చోదకులకే సుమారుగా రూ.8 కోట్లకు పైగా రెడ్డి ఎంటర్‌ప్రైజెస్ సంస్థ బకాయిపడింది.

**సూపర్‌వైజర్ ఉద్యోగానికి రూ.లక్ష ఇచ్చాను- రుక్మాంద, సూపర్‌వైజర్, ధర్మవరం** చెత్త తరలించే వాహనాలను సూపర్‌వైజ్ చేసే ఉద్యోగానికి రూ.లక్ష ఇవ్వాలని, ప్రతినెలా రూ.18,000 జీతం ఇస్తామని కర్నూలుకు చెందిన వీరాంజనేయప్రసాద్ అనేవ్యక్తి చెప్పడంతో నగదు అందజేశా. మొదటి మూడు నెలలు మాత్రమే వేతనం ఇచ్చారు. ఆ తరువాత 15 నెలలుగా ఇవ్వలేదు. డబ్బు తీసుకున్నవ్యక్తి, ఏజెన్సీ నిర్వాహకుల చరవాణులు స్విచ్ఛాఫ్ వస్తున్నాయి.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం - విశ్వనాథ్, మున్సిపాలిటీ ఆర్టీ**

క్లాప్ వాహనాల చోదకులకు రెడ్డి ఎంటర్‌ప్రైజెస్ సంస్థే వేతనాలు ఇస్తామని గతంలో ఒప్పందం చేసుకున్నారు. మా నుంచి వేతనాలు అందేవి. సంస్థ పనులను ప్రభుత్వం రద్దు చేసింది. క్లాప్ వాహనాలను తీసుకెళ్ళాలన్న విషయంలో మాకు సంబంధం లేదు. చోదకుల సమస్యలు వింటే బాధగా ఉంది. ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

# జ్ఞానజ్యోతి.. సృజన క్రాంతి



హిందూపురం : అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువులు కొత్తరూపు సంతరించుకోనున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు 'జ్ఞానజ్యోతి' పేరుతో విద్యా శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యా బోధనలో మార్పులు తీసుకురానున్న నేపథ్యంలో వాటికి అనుగుణంగా అంగన్‌వాడీ కార్యకర్తలను సుశిక్షిత బోధకులుగా తీర్చిదిద్దనున్నారు. దశల వారీగా వివిధ అంశాలపై 120 రోజులపాటు శిక్షణ తరగతులు కొనసాగనున్నాయి. ఇప్పటికే బత్తలపల్లి ప్రాజెక్టు పరిధిలోని ముదిగుబ్బలో కార్యకర్తలకు ఎంఈఓలు, ఐసీడీఎస్ పర్యవేక్షకుల ఆధ్వర్యంలో ఆరు రోజులుగా శిక్షణ ఇచ్చారు. కార్యకర్తలే స్వయంగా బొమ్మలు, చార్టులు తయారు చేసి ప్రదర్శించారు. పుట్టపర్తి ప్రాజెక్టు పరిధిలోని ఓడీసీలోనూ శిక్షణలో భాగంగా బొమ్మలు తయారుచేశారు.

**ఈ అంశాలపై తర్ఫీదు..**

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఒకటో తరగతి విద్యను అందిపుచ్చుకునేలా బోధించాలని కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,206 మెయిన్, 618 మినీ ఆరోగ్య కేంద్రాల నుంచి కార్యకర్తలు, ఆయాలు శిక్షణలో పాల్గొంటున్నారు. ప్రాథమిక దశలోనే మెరుగైన విద్యను అభ్యసించేలా క్షేత్రస్థాయిలో అమలు చేయడం కోసం అవగాహన కల్పిస్తున్నారు. మొదటి దశలో చిన్నారుల మేథోభివృద్ధికి, రెండో దశలో శారీరక అభివృద్ధి, మూడో దశలో భాషాభివృద్ధి, నాలుగు, ఐదు దశల్లో సాంస్కృతిక, సృజనాత్మకత పెంపు అంశాలపై తరగతులు నిర్వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో సులువుగా నేర్చుకునేలా బొమ్మలు, చార్టులను తయారు చేయించి, సృజనాత్మకత జోడించి ఎలా బోధించాలో వివరిస్తున్నారు. చిన్నారుల్లో సామర్థ్యాలు పెంపొందించేందుకు, అవసరమైన మెలకువలు, అంశాలకు అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దడంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇలా మూడేళ్లలో అంగన్‌వాడీ కార్యకర్తలకు విడతల వారీగా ఏడాదికి 40 రోజుల చొప్పున శిక్షణ కార్యక్రమం రూపొందించారు.

ప్రాథమిక దశలో మెరుగైన విద్య- వరలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, శ్రీసత్యసాయి జిల్లా చిన్నారులకు ప్రాథమిక దశలోనే మెరుగైన విద్య అందించడమే జ్ఞానజ్యోతి శిక్షణ ముఖ్య ఉద్దేశం. ఐసీడీఎస్, విద్యా శాఖ కలిసి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రధానంగా చిన్నారులకు అన్ని విధాల తీర్చిదిద్దాలని కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నాం.

# వలసల నివారణకు చర్యలు

అనంతపురం : వలసల నివారణ కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇప్పటి వరకు ఒక కుటుంబానికి వందరోజులు మాత్రమే పనిదినాలు ఉండేవి. వంద రోజులు పనిదినాలు అయిపోయిన తరువాత సదరు కుటుంబానికి ఉపాధి పనులు ఉండేవి కావు. కూటమి ప్రభుత్వం కరవు మండలాల్లో వంద రోజుల పనిదినాలను 150 రోజులకు పెంచుతూ కీలకం నిర్ణయం తీసుకుంది. కూలీలకు స్థానికంగానే ఉపాధి కల్పిస్తే వారు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా నివారించవచ్చునని ప్రభుత్వం ఆలోచించింది. ఈ నిర్ణయాన్ని కూలీలు స్వాగతిస్తున్నారు. కరవు మండలాల్లో పనిదినాలు పెంచడం ద్వారా కూలీలకు ఆర్థిక భరోసా దక్కుతుందని అధికారులు చెబుతున్నారు.

**అడిగినవారందరికీ పనులు- సలీంబాషా, విజయేంద్రప్రసాద్, ఉమ్మడి జిల్లా పీడీలు** అడిగినవారందరికీ ఉపాధి పనులు కల్పిస్తాం. రోజువారీ ఒక్కో వేతనదారుడికి రూ.300 కూలి ఇవ్వాలని నిర్ణయించారు. అయితే వారు చేసేపనిని బట్టి సగటున ప్రస్తుతం రోజుకు రూ.263 వరకు వేతనం పొందుతున్నారు. వలసలు నివారించడంలో భాగంగానే కూటమి ప్రభుత్వం అదనపు పనిదినాలు కల్పించింది. కూలీలు సద్వినియోగం చేసుకోవాలి.

## మన ఆరోగ్యం పదిలమేనా..?

పుత్తూరు: కొద్దిరోజులుగా ఎవరినోట విన్నా గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) గురించే. మహారాష్ట్రలోని పుణెలో అధిక సంఖ్యలో జీబీఎస్ రోగులు ఉన్నారు. దీనికి ప్రధాన కారణం కలుషిత నీరు, ఆహారం, పారిశుద్ధ్య లోపాలేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. తిరుపతిలో ఇటీవల ఆహార కల్తీ నియంత్రణ అధికారులు దాడులు చేసి నమూనాలు సేకరించి ఆహార కల్తీ జరిగినట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. చిత్తూరు నగరం, ఉమ్మడి జిల్లాలోని కుప్పం, పలమనేరు, పుంగనూరు, నగరి, పుత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు తదితర పట్టణాల్లోనూ ఆహార తనిఖీ కేంద్రాల పర్యవేక్షణలో అలసత్వం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమై చక్కదిద్దాల్సిన అవసరం ఉంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరాలు, పట్టణాలకు సుదూర ప్రాంతాల నుంచే తాగునీటిని అందిస్తున్నారు. తిరుపతి నగర ప్రజల దాహార్తి తీర్చడానికి కండలేరు నుంచి తరలిస్తున్నారు. శ్రీకాళహస్తికి సైతం అక్కడి జలాలే విడుదల చేస్తున్నారు. చిత్తూరు ప్రజలకు పెనుమూరు సమీపంలోని ఎన్టీఆర్ జలాశయం నుంచి తాగునీటిని అందిస్తున్నారు. పలమనేరుకు కౌండిన్య ప్రాజెక్టు నుంచి తాగునీటి సరఫరా జరుగుతోంది. మిగిలిన మున్సిపాలిటీల్లో స్థానికంగా ఉన్న బోర్ల నుంచి పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లీకేజీలు తోడు సుచిత్వత లేని బయటి ఆహారంతో జీబీఎస్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. జిల్లాలో నగరపాలక సంస్థ: 1



మున్సిపాలిటీలు: 4
జనాభా: 4.5 లక్షలు

కాలువల్లోనే తాగునీటి పైపులైన్లు..

తిరుపతి, చిత్తూరు నగరపాలక సంస్థలు పట్టణాలు, పంచాయతీల్లో మురుగునీటి కాలువల్లోనే తాగునీటి పైపులైన్లు ఉన్నాయి. వర్షాకాలంలో అయితే మురుగునీటి కాలువల్లో ఉన్న పైపులైన్లలో నీరు చేరి ఒక్కోసారి డయేరియా ప్రబలిన సందర్భాలు ఉన్నాయి. గతేడాది పుత్తూరులోని నందిమంగళంలో తాగునీటి కలుషితం కారణంగా డయేరియా ప్రబలి ఇద్దరు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. అప్పటికప్పుడు పైపులైన్లు కొత్తవి వేయడంతో అదుపులోకి వచ్చింది. కాలువల్లో పైపులైన్లు, కుళాయిలు ఆందోళన కలిగించే అంశం. దీనికితోడు పలు ప్రాంతాల్లో కుళాయిల పక్కనే చెత్తాచెదారాలు ఉంటున్నాయి. కాలువల్లోని పైపులైన్లు త్వరితగతిన బాగుచేసి ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

**అధికారులు అప్రమత్తంగా ఉండాలి..** నగరాలు, పట్టణాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి. ముందస్తుగా తాగునీటి లీకేజీలు, పైపులైన్ల మరమ్మతులు, మురుగునీటి కాలువల్లో ఉన్న పైపులైన్లు వ్యవస్థను పర్యవేక్షించాలి. ఆహార కల్తీ జరగకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. విశ్వనాథ్, ఆర్టీ, అనంతపురం

## అండగా.. ఆపద్బంధు

గూడూరు : రైతుల కోసం వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీల్లో రైతు బంధు పథకం ద్వారా ధాన్యం నిల్వ చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. గూడూరు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్లలో రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయి. పెద్ద రైతులు పండించిన ధాన్యాన్ని రైసు మిల్లుల ద్వారా ఎగుమతి చేసి గిట్టుబాటు ధరకు విక్రయిస్తున్నారు. నిల్వచేసుకునే అవకాశం లేని సన్న, చిన్నకారు రైతులు పండించిన ధాన్యాన్ని రుణ బాధలతో కోతలు కోసిన రోజున తక్కువ ధరకు స్థానిక వ్యాపారులు, దళారులకు విక్రయిస్తూ



నష్టపోతున్నారు. ప్రస్తుతం సీజన్‌లో వ్యవసాయశాఖ ఈ పథకం గురించి అవగాహన కల్పించడం ద్వారా రైతులు ధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకునే అవకాశం ఉంది.

మార్కెట్ కమిటీల వివరాలు
మొత్తం కమిటీలు: 12
గోదాములు: 30
ధాన్యం నిల్వ సామర్థ్యం: 70 వేల టన్నులు

**12 మార్కెట్ కమిటీల్లో పథకం అమలు**

జిల్లాలో నాయుడుపేట, వాకా డు, సూళ్లూరుపేట గూడూరు వెంకటగిరి, శ్రీకాళహస్తి, తొట్టంబేడు బీఎన్‌కండ్రిగ, పుత్తూరు, నాగలాపురం, చంద్రగిరి, పాకాల మార్కెట్ కమిటీల్లో రైతుబంధు పథకం ద్వారా ధాన్యం నిల్వచేసుకునే అవకాశం ఉంది. ఐదెకరాల లోపు ఉన్న రైతులు 550 బస్తాలు వరకు ఈ పథకంలో 270 రోజులు ఉచితంగా ధాన్యం నిల్వచేసుకునే వెసులుబాటు ఉంది. నిల్వచేసిన ధాన్యం విలువలో 75 శాతం రుణం పొందొచ్చు. వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. అవసరమైనప్పుడు విక్రయం.. సన్న, చిన్న రైతులు 270 రోజులు వరకు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. దాచిన ధాన్యంపై రుణం ఇస్తాం. ఇంటి దగ్గర ధాన్యం నిల్వ చేసుకునేందుకు అవకాశం లేని రైతులు దరఖాస్తు చేసుకుంటే గోదాములో వసతి కల్పిస్తాం. అవసరమైనప్పుడు అమ్ముకునే అవకాశం ఉంది. ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి, నాయుడుపేట, వాకాడు

# కరుగుతున్న కొండలు

బనగానపల్లి : బనగానపల్లి అటవీ శాఖ పరిధి అక్రమార్కులకు వరంగా మారుతోంది. డోన్ ఫారెస్టు రేంజ్‌లో ఉన్న బనగానపల్లి ప్రాంతాన్ని రెండేళ్ల కిందట ప్రత్యేకంగా బనగానపల్లి రేంజ్‌గా మార్చారు. డోన్ పరిధిలోని బేతంచెర్ల, బనగానపల్లి, అవుకు, నొస్సం, కోవెకులకుంట్ల, ఉయ్యాలవాడ పరిధిలోని కొంత భాగం కలిపి బనగానపల్లి రేంజ్ పరిధిలోకి తెచ్చారు. ఇక్కడే కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో సిబ్బంది లేక అధికారులు పర్యవేక్షించకపోవడంతో అటవీసంపద అక్రమార్కులకు వరంగా మారుతోంది. అటవీ, రెవెన్యూ, గనులకు సంబంధించిన పరిధి పక్కపక్కనే ఉండటంతో కొంతమంది అధికారులు ఎవరికి వారు తమ పరిధికాదని పట్టించుకోవడం లేదనే విమర్శలు రేగుతున్నాయి. దీన్ని అదునుగా తీసుకున్న అక్రమార్కులు తోచినంత దోచేస్తున్నారు. ఎలాంటి రుసుం చెల్లించకుండా చెట్ల నుంచి మట్టి వరకు ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల మధ్య సమన్వయలేమి కారణంగా అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. అటవీ శాఖ అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడం, గనుల శాఖ అధికారులు బయటకు రాకపోవడం, రెవెన్యూ



అధికారులు తమ పనుల్లో మునిగి పోవడంతో అటవీ సంపదను అక్రమార్కులు కొల్లగొట్టేస్తున్నారు. పట్టపగలు చెట్లు నరికి తీసుకెళు న్నా చర్యలు తీసుకోలేకపోతున్నారు. కొంతమంది మాముళ్లు తీసుకుని అక్రమార్కుల్ని వదిలేస్తున్నారనే విమర్శలు రేగుతున్నాయి.

**నిబంధనల పాటింపు ఏదీ..?**

ఎక్కడైనా చెట్లు నరకాలంటే తహసీల్దారు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. సర్వే నంబరుతో సహా చెట్లు ఉన్న పొలం కాని, స్థలం కాని ఉంటే రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. రెవెన్యూ అధికారులు పరిశీలించి అటవీశాఖ అధికారులకు నివేదిక పంపిస్తారు. అటవీశాఖ అధికారులు పరిశీలించి అనుమతి కోసం రూ.400 (ట్రాక్టరుకు) చెల్లించాల్సి ఉంటుంది. అప్పుడు చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలించాలి. ఇవేమీ లేకుండా చెట్లను నరికి కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. బనగానపల్లి డివిజన్‌లో నిత్యం చెట్లను 30 వరకు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుండగా, టిప్పర్లు, ట్రాక్టర్లు సుమారు 50కి పైగా వాహనాల్లో నిత్యం ఎర్రమట్టిని ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నాయి. అటవీ శాఖ పరిధిలో బీటు ఆఫీసర్లు, సెక్షన్ అధికారులు, గార్డులు లేకపోవడం, పరిధి ఎక్కువగా ఉండటంతో పర్యవేక్షణ లేకపోతోంది. **చర్యలు తీసుకుంటాం రామకృష్ణ, ఫారెస్టు రేంజ్ అధికారి** అటవీశాఖ పరిధిలో ఎలాంటి అక్రమాలు జరిగినా చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ అధికారుల నుంచి వచ్చిన దరఖాస్తులను తప్పకుండా పరిశీలించి అనుమతులు ఇస్తాం. వాల్టా చట్టాన్ని పరిరక్షించాల్సింది రెవెన్యూ అధికారులు. ఇందు కోసం ప్రత్యేకంగా సిబ్బంది ఉన్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. బనగానపల్లి పరిధిలో ఉన్న అధికారులు అక్కడే నివాసం ఉండి పర్యవేక్షిస్తున్నారు. తగినంత మంది లేకపోయినా నిఘా ఉంచాం. అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేస్తాం.

## అడ్డగోలు తవ్వకాలు.. చెరువుల్లా పొలాలు

మహానంది: మహానంది మండల పరిధిలోని నందిపల్లె, గోపవరం గ్రామాల పంట పొలాల్లో ఎర్రమట్టి తవ్వకాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. నందిపల్లె, ఆర్ఎస్ గాజులపల్లె గ్రామాల్లో నూతనంగా చేపట్టే రైల్వే పనుల కోసమంటూ భారీగా తరలిస్తున్నారు. గుత్తేదారులు పొక్లెయిన్లతో 20 అడుగులకుపైగా లోతున తవ్వేస్తున్నారని జనం పేర్కొంటున్నారు. ఇష్టానుసారంగా తవ్వేయడంతో నీరు ఉబికి వస్తుండటం గమనార్హం. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో టిప్పర్ల ద్వారా మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.



**నిబంధనలకు విరుద్ధంగా..**

నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్న పొలాల్లో సైతం భూమిపై నుంచి 3 అడుగుల లోతు వరకు మాత్రమే తవ్వాల్సి ఉంది. కానీ ఇష్టానుసారంగా తవ్వేస్తుండటంతో పొలాలు పనికిరాకుండా పోతున్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎక్కువ లోతు తవ్వేయడంతో భూములు సాగు చేసుకోలేని పరిస్థితులు ఏర్పడుతాయని.. చివరికి చదును చేసేందుకు రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ఈ విషయమై తహసీల్దారు పి.రమాదేవి మాట్లాడుతూ రైల్వే పనుల కోసమంటూ ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందారని చెప్పారు. రైతులకు సంబంధించిన పొలాల నేపథ్యంలో వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని చెప్పారు. అయినప్పటికీ గ్రామాల్లో పర్యటించి తవ్విన పొలాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు.

## నిలువ నీడలేని.. నగర పాలన

తిరుపతి : ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో పలు కీలక ప్రాజెక్టులు పడకేశాయి. స్మార్ట్‌సిటీగా ఎంపికై జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన నగరపాలక సంస్థకు ఐదేళ్ల వైకాపా పాలనతో చివరకు నిలువనీడ కరవైంది. స్మార్ట్‌సిటీ వాటాకింద పైసా విదల్చకపోవడంతో వాటి ప్రాజెక్టులు అటకెక్కినట్లే సిటీ ఆపరేషన్ సెంటర్ సైతం పడకేసింది. 18 నెలల కాలపరిమితితో ప్రసూతి ఆసుపత్రిలో పాలన మొదలుపెట్టిన నగరపాలిక అధికారులు, ఉద్యోగులకు అదే శాశ్వత భవనంగా మిగిలే దుస్థితి నెలకొంది.

సిటీ సెంటర్ పురోగతి ఇలా..

విస్తీర్ణం : 2,900 చ.మీ., ఆరు అంతస్తులు

పనుల ప్రారంభం: 2023 ఆగస్టు 21న

గడువు : రెండేళ్లు, అంచనా వ్యయం రూ.94 కోట్లు

వెచ్చించిన నిధులు: రూ.16 కోట్లు, కావాల్సిన నిధులు రూ.78 కోట్లు

ఇన్నాళ్లూ అడ్డంకులు : స్మార్ట్‌సిటీ నిధుల మళ్లింపుతో ఖజానా ఖాళీ

# కొండల ఆనవాళ్లు మాయం!



చోడవరం : గోవాడ నుంచి భోగాపురం వెళ్లే రహదారిలో ఎడమ వైపున ఉన్న కొండ వద్ద తవ్వకాలు చేపట్టారు. 30 మీటర్ల ఎత్తులో తవ్వకాలు చేసేందుకు తాత్కాలికంగా రహదారి నిర్మాణం చేసి పొక్లెయిన్‌తో కొండను డొల్ల చేస్తున్నారు. కూటమి పార్టీలకు చెందిన ఓ నాయకుడు ఈ తవ్వకాలకు నేతృత్వం వహిస్తున్నారు. అంభేరుపురంలోనూ ఇదే పరిస్థితి. మాజీ సర్పంచి ఒకరు తవ్వకాలు, ట్రాక్టర్‌తో తరలింపులో కీలకంగా వ్యవరిస్తున్నారు. ముద్దుర్తి, గంధవరం, నర్సాపురంలోనూ నాయకుల కనుసన్నల్లోనే తవ్వకాలు జరుగుతున్నాయి. చోడవరంలో వ్యవసాయ భూములను లేఅవుట్లుగా మార్చేస్తున్నారు. పొలాలను చదును చేసి అభివృద్ధి చేస్తుండటంతో గ్రావెల్‌కు డిమాండ్ పెరిగింది. సాగు భూముల్లో లేఅవుట్లు వేస్తున్నారా?, పునాదులు నింపేందుకు మట్టి కావాలా?, స్థలాలను ఎత్తు చేసేందుకు గ్రావెల్ సరఫరా చేసేందుకు మేం సిద్ధమంటూ గ్రామ స్థాయి నాయకులు యథేచ్ఛగా మట్టి దందా చేస్తున్నారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో తవ్వకాలతో కొండల ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. గోవాడ, బెన్నవోలు, ముద్దుర్తి, నర్సాపురం, అంభేరుపురం, ఖండేపల్లి గ్రామాల్లో తవ్వకాలు నిరాటంకంగా జరుగుతున్నాయి. పేదలకు పట్టాలుగా ఇచ్చిన కొండపోరంబోకు భూముల్లోనూ తవ్వకాలు చేస్తున్నా.. సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. పట్టాలున్న వారికి కొంత చేతిలో పెట్టి మట్టిని తవ్వేసుకుంటున్నారు. **తాగునీటి పైపులైన్ దెబ్బతిన్నా..** బెన్నవోలులో పది ఎకరాల మేర కొండ ప్రాంతాన్ని పొక్లెయిన్‌తో తవ్వేయడంతో కొండంతా గుండులా మారింది. కొద్ది రోజులుగా తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. రాత్రిళ్లు ట్రాక్టర్లలో తరలిస్తుండ టంతో బెన్నవోలుకు తాగునీరందించే పైపులైను పగిలింది. గ్రామ పెద్దలు ట్రాక్టర్లను అడ్డుకుని నిలదీయడంతో పైపులైన్‌ను మరమ్మతు చేయించారు. పైపులైను పగిలిన ఘటనపై పంచాయతీ, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు మౌనం దాల్చడం గమనార్హం. మట్టి తవ్వకాలపై రెవెన్యూ అధికారిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. తవ్వకాలకు సంబంధించి అనుమతులు ఇచ్చే విషయం గనుల శాఖ అధికారులు చూస్తున్నారన్నారు. అక్రమ తవ్వకాలపై సమాచారం ఇస్తే అక్కడకు వెళ్లి అనుమతులు ఉన్నాయా, లేవా అని పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

# అక్రమాలకు సహకారం



కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సహకార సంఘాల పరిధిలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. పలువురికి భూములు లేకున్నా సభ్యులుగా చేర్పించారు. కొందరు నాయకులు పెత్తనం చేశారు. రుణాలు సైతం మంజూరు చేయించారన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో సభ్యుల వివరాలను డిజిటలైజేషన్ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. సభ్యత్వమున్న అందరి ఖాతాలకు ఈ-కేవైసీ తప్పనిసరి చేయాల్సి ఉంది. ఖాతా వివరాలు, ఆధార్, చరవాణి నంబరు తదితర వివరాలను సచివాలయ సిబ్బంది కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. ప్రతి సంఘంలో పదుల నుంచి వందల సంఖ్యలో సభ్యుల ఆచూకీ కానరావడం లేదు.

**35,579 మంది ఆచూకీ ఏదీ..**

ఉమ్మడి జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. ఇందులో 1,62,634 మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారు. ఇందులో ఇప్పటివరకు 35,579 మంది ఆచూకీ కానరావడం లేదు. సహకార సంఘాల్లో సభ్యత్వం కలిగి ఉన్నారే తప్ప వారు ఎక్కడున్నారో తెలియడం లేదు. గత వైకాపా ప్రభుత్వ పాలనలో కేవలం సహకార రుణాల కోసం ఇతర నియోజకవర్గాలకు చెందినవారు ఇక్కడ సభ్యత్వం చేయించుకున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. జిల్లాలో పలు సొసైటీల పరిధిలో వందలాది మంది సభ్యుల ఆచూకీ తెలియడం లేదు.

**పలువురు సహకరించక..**

సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని సంఘాల సభ్యులకు నేరుగా ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటున్నారు. కొందరు ఓటీపీలు సక్రమంగా చెప్పడం లేదు. భూములు కొనుగోలు చేసినవారు మ్యుటేషన్లలో పేర్లు మార్చకపోవడంతో విక్రయదారులు ఓటీపీలు చెప్పడం లేదు. భూములున్న ఉద్యోగులు కూడా కొందరు ఈ-కేవైసీ చేయించేందుకు ముందుకు రావడం లేదు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి సహకార సంఘాల్లో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో ఈ-కేవైసీ చేయించేందుకు సచివాలయ ఉద్యోగులు కృషి చేస్తున్నారు.

**వీటిల్లో నమోదు అంతంతే..**

పత్తికొండ సహకార సంఘం పరిధిలో 5,480 మందికి సభ్యత్వం ఉండగా గడిచిన నెల రోజుల్లో 3,694 మంది సభ్యులకు సంబంధించిన ఈ-కేవైసీని సచివాలయ ఉద్యోగులు పూర్తి చేశారు. ఇంకనూ 1,786 మంది సభ్యుల వివరాలు లభించకపోవడం గమనార్హం. బదినేహాల్ సహకార సంఘంలో 151 మంది సభ్యులు ఉండగా.. వీరిలో 67 మందికి మాత్రమే ఈకేవైసీ పూర్తైంది. చిన్న తుంబళం సొసైటీ పరిధిలో 667 మందికిగాను 440 వివరాలు మాత్రమే లభ్యమయ్యాయి.

**కంప్యూటరీకరణ పూర్తైతే..**

ఖాతాల కంప్యూటరీకరణతో ఇకపై బినామీ సభ్యత్వాలు చెల్లుబాటు కావు. గతంలోలా రైతుల రుణాలు, వడ్డీ వివరాలు తెలుసుకునేందుకు సంఘాల కార్యదర్శులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. బ్యాంకు వ్యవహారాలను సులువుగా తెలుసుకోవచ్చు. బ్యాంకుల్లో లాగానే ఏ లావాదేవీలు జరిగినా ఇకపై చరవాణులకు సంక్షిప్త సమాచారం వెళుతుంది. వడ్డీతో కలిపి రుణం ఎంత చెల్లించాలి.. డిపాజిట్‌పై ఇప్పటివరకు ఎంత వడ్డీ జమైంది.. నగదు ఎంత నిల్వ ఉంది తదితర వివరాలు సులువుగా తెలుసుకోవచ్చు.

**ఆ రెండింటిలో పురోగతి బాగు**

కర్నూలు రూరల్ మండలం ఉల్చాల సహకార సంఘంలో 1,267 మంది రైతులకు సభ్యత్వం ఉండగా ఇప్పటి వరకు 1,177 మంది ఈ-కేవైసీ చేయించుకున్నారు.. ఇక 90 మంది సభ్యుల ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉంది. పెద్దతుంబళం సహకార సంఘంలో 330 మంది సభ్యులుండగా.. 298 మంది వివరాలు నమోదు చేశారు.

జిల్లా :కర్నూలు

సహకార సంఘాలు 43

మొత్తం సభ్యులు 76,258

ఆచూకీ లేని సభ్యులు 17,575

ఈ-కేవైసీ పూర్తైంది 58,683

# పాడి మెడకు పూచీకత్తి



ఒంగోలు : పాడి పోషకులను ప్రోత్సహిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అంతగా ప్రయోజనం చేకూర్చడం లేదు. పశు కిసాన్ క్రెడిట్ కార్డులే ఇందుకు నిదర్శనం. జిల్లాలో పశు పోషణ ఎక్కువ. ఈ రంగంపైనే ఆధారపడి దాదాపు నాలుగున్నర లక్షల మంది జీవనం సాగిస్తున్నా... వీరిలో రెండు శాతం మందికి కూడా కార్డుల ప్రయోజనం చేకూరడం లేదు.

**అన్ని విధాలా మేలు...**

ఈ కార్డులు ఉంటే ఎలాంటి పూచీకత్తు లేకుండా ఒక పాడి గేదె ఉన్న రైతుకు రూ.30 వేలు, అయిదు ఉంటే రూ.1.50 లక్షల చొప్పున రుణం మంజూరు చేయాలి. మేకలు, గొర్రెల పోషకులకూ ఇదే తరహాలో రూ.30 వేల నుంచి రూ.1.60 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించాలి. ఈ మొత్తాన్ని ఏడాదిలోగా తిరిగి చెల్లిస్తే... 7 శాతం వడ్డీలో 3 శాతాన్ని రాయితీ రూపంలో కేంద్రం ఇస్తుంది. మిగతా 4 శాతం రైతు చెల్లిస్తే సరిపోతుంది. సాధారణ క్రెడిట్ కార్డుల మాదిరిగానూ దీనిని వినియోగించుకోవచ్చు. పోషకులు అవసరమైనప్పుడు సొమ్ము వాడుకుని నెల రోజుల్లోగా తిరిగి జమ చేస్తే... మళ్లీ నగదు తీసుకోవచ్చు. ఇలా వడ్డీ భారం లేకుండానూ అవసరాలు తీర్చుకోవచ్చు. ఆన్‌లైన్ చెల్లింపులూ చేయవచ్చు.

ఈ లెక్కలు చూసి జిల్లాలో పరిస్థితి చాలా బాగుందనుకుంటే తప్పులో కాలేసినట్లే. బ్యాంకర్లు చూపుతున్న లెక్కలు బాగున్నా... ఇక్కడి లబ్ధిదారులంతా గతంలో రుణాలు తీసుకున్నవారే. కొత్త వారికి ఇచ్చింది చాలా తక్కువ. లక్ష్యాలు పూర్తిచేయాల్సి ఉండడంతో... రెగ్యులర్ ఖాతాదారులను సైతం పథకం కింద లబ్ధి పొందినట్లు చూపిస్తున్నారు. ఏదైనా పూచీకత్తు పెడితే తప్ప... పశుసంవర్ధకశాఖ వారు గుర్తించిన పోషకులకు కార్డులు, రుణాలు ఇవ్వడం లేదు. పైపెచ్చు అటువంటి వారి పేర్లే సిఫారసు చేయాలని అధికారులకు సూచిస్తున్నట్లు సమాచారం. దీనివల్ల అసలు లక్ష్యం నీరుగారుతోంది. జిల్లా అధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దాల్సిన అవసరం ఉంది.

## ప్రాథమిక వైద్యం.. అంగన్‌వాడీలకు దూరం

నంద్యాల : ఆటపాటలతో విద్య, పౌష్టికాహారం అందిస్తూ చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక వైద్యం అందడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. చిన్నారులు ఆటలాడేటప్పుడు కిందపడి గాయపడితే ప్రాథమిక చికిత్స అందించలేని పరిస్థితి నెలకొంటోందని అంతా వాపోతున్నారు. గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అంగన్‌వాడీ కేంద్రాలకు ఏడాదికోసారి పంపిణీ చేసే ప్రాథమిక వైద్యానికి సంబంధించిన మందులను 2023 అక్టోబరులో చివరగా అందించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మందుల సరఫరా లేకపోవడంతో చాలా కేంద్రాల్లో ఆరోగ్య పెట్టెలను అటకెక్కించారు.

కర్నూలు జిల్లా ఐసీడీఎస్‌లోని తొమ్మిది ప్రాజెక్టుల పరిధిలో 1886 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ఆరు నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు 1,17,282 మంది, 3-6 ఏళ్లలోపు పిల్లలు 79,342 మంది ఉన్నారు. నంద్యాల జిల్లా ఐసీడీఎస్‌లోని ఆరు ప్రాజెక్టుల



పరిధిలో 1663 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా...వాటిలో 6నెలల నుంచి 3 ఏళ్ల లోపు పిల్లలు 60,065, 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలు 28,124 మంది ఉన్నారు.

**ఏయే మందులు ఉంటాయంటే...?**

ఆరోగ్య పెట్టెలో ఏడు రకాల మందులు ఉంటాయి. పారాసిటమల్ సిరప్, నులిపురుగుల నివారణ మందులు, అయోడిన్ సొల్యూషన్, కంటి, చెవి చుక్కల మందు, దూది, బ్యాండేజ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంటాయి. జీర్ణశక్తికి సిరప్, వాంతులు, విరేచనాలకు మాత్రలు, జ్వరం, నులిపురుగుల నివారణ మాత్రలు, గజ్జి, చర్మవ్యాధులు, కండ్ల కలక, గాయాలైతే తక్షణం వైద్యం అందించేందుకు ఈ మందులు ఎంతగానో ఉపయోగపడతాయి. గర్భిణులు, బాలింతలకు అత్యవసర సమయంలో ఇవ్వాల్సిన మందులు అంగన్‌వాడీ కేంద్రాల్లో తప్పనిసరిగా ఉండాలి. స్త్రీ, శిశు సంక్షేమ శాఖల అధికారులు మందుల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అత్యవసర సమయంలో కేంద్రాలకు వెళ్లే ప్రథమ చికిత్స పెట్టెలు ఎక్కడా అందుబాటులో ఉండటంలేదని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చిన్నారులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

చంద్రకళ, సీడీపీఓ, నంద్యాల అర్బన్ ప్రాజెక్టు

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. ప్రథమ చికిత్స మందులు తాత్కాలికంగా సరఫరా కాకపోవడంతో పీహెచ్‌సీ సిబ్బంది ఇచ్చిన మందులను వినియోగిస్తున్నారు. ఆరోగ్య పెట్టెల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే వచ్చేలా చర్యలు తీసుకుంటాం. కేంద్రానికి అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూస్తాం.

## ఉపాధికి శ్రమశక్తి

ఆలూరు : గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఉపాధి పథకం అక్రమార్కులకు వరంగా మారింది. బోగస్ పేర్లు చేర్చి పెద్దఎత్తున నిధులు పక్కదారి పట్టించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ అక్రమాలపై దృష్టి పెట్టింది. వీటిని నిలువరించేందుకు శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అప్పట్లో ఈ సంఘాల ద్వారానే ఉపాధి పనులు జరిగేవి. వచ్చే నెల నుంచి ఈ సంఘాల ద్వారా పనులు చేయనున్నారు. ఉపాధి హామీలో మేటి ఏర్పాటుతో పాటు శ్రమశక్తి సంఘాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటు లాంటి సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుంది.

**రూ.300కు పెరగనున్న రోజు కూలీ**

ప్రస్తుతం జిల్లాలో రోజు కూలీ రూ.276గా ఉంది. దీనిని రూ.300లకు పెంచేందుకు ఇప్పటికే అధికారులు చర్యలు చేపట్టారు. వేతనం పెంచి కూలీల సంఖ్య పెరిగేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 3 లక్షలకుపైగా జాబ్ కార్డులు ఉండగా 6.26 లక్షల మంది కూలీలు ఉన్నారు. పని వేళలు సక్రమంగా నిర్వహించడం, శ్రమశక్తి సంఘాల్లోని వేతనదారులకు.. క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకుల మధ్య సమన్వయం కుదిర్చేలా చర్యలు చేపడుతారు.

**ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటుకు సన్నాహాలు**

ఉపాధి పనుల పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. స్క్వాడ్ బృందంలో ఆరుగురు నుంచి ఏడుగురు వరకు టెక్నికల్ అసిస్టెంట్లు ఉంటారు.



ఈ బృందంలో విజిలెన్స్ అధికారితో పాటు క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఉంటారు. వీరందరిని కూడా ఉపాధి హామీ పథకం నుంచే ఎంపిక చేస్తారు.

**పనితీరు ఇలా..** ప్రతి సంఘంలో ఒక మేటిని ఏర్పాటు చేస్తారు. వీరికి క్షేత్ర, సాంకేతిక సహాయకులు పని చూపెడుతారు. చేసిన పనికి వీరి ద్వారా కొలతలు వేయిస్తారు. కూలీల పర్యవేక్షణను మేటి ద్వారా నిర్వహిస్తారు. కూలీలతో కలిసి ఇతను పనిచేస్తారు. మొత్తం పని పర్యవేక్షణను క్షేత్ర సహాయకుడు, సాంకేతిక సహాయకులు చేస్తారు. గతంలో పర్యవేక్షణంతా క్షేత్ర సహాయకుడే చేసేవారు. ప్రస్తుతం అలాకాక కూలీలో నుంచి మేటిని ఎంపిక చేస్తారు. నూతన పద్ధతి నేపథ్యంలో రెండు విడతల్లో పర్యవేక్షణ ఉండనుంది. శ్రమశక్తి సంఘంలో.. ఒక్కో సంఘంలో 20 మంది సభ్యులు ఉంటారు. ఇలా మండలానికి 500 నుంచి 600 శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు కానున్నాయి.

# బండరాళ్లు జారితే.. బాధ్యులెవరు?

కొత్తచెరువు : కొత్తచెరువు కూడలి మీదుగా పెద్ద గ్రానైట్ బండరాళ్లను లారీల్లో తరలించడం స్థానికులకు భయాందోళన కలిగిస్తోంది. బక్కపట్నం మండలంలోని క్వారీల నుంచి టెన్ వీలర్ లారీల్లో రాత్రివేళల్లో గ్రానైట్ బండరాళ్ల తరలింపు ప్రమాదకరంగా సాగుతుండటం చర్చనీయాంశంగా మారింది. శనివారం అర్ధరాత్రి సమయంలో లారీలో తరలిస్తున్న మూడు పెద్ద బండరాళ్లు ఒకవైపునకు ఒరిగి కిందకుపడతాయేమో అన్న భయాందోళన కలిగించాయి. రోడ్డు మలుపుల్లో లారీ వేగంగా వెళితే రాళ్లు ఒకవైపు పడిపోయే ప్రమాదముందన్న అభిప్రాయాలు వాహనదారుల్లో వ్యక్తమవుతున్నాయి. జనవాసాల్లో, వాహనాల రద్దీ రహదారుల్లో పెద్ద బండరాళ్లు అనూహ్యంగా కిందపడితే



ఊహకందని ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉంది. నిరంతరం గ్రానైట్ రాళ్లు రాత్రివేళ తరలిస్తుండటంతో అనుమతులున్నాయా లేదా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. దీనిపై యూపీఎస్‌సీఐ ఇందిరను వివరణ కోరగా రాత్రి సమయాల్లో తరలింపు జరుగుతున్నట్లు సమాచారం ఉంది. అయితే తగిన రక్షణ ఏర్పాట్లు లేకుండా ప్రమాదకరంగా రాళ్ల తరలింపుపై పరిశీలించి చట్టప్రకారం తగుచర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కుళ్లుతున్న మృతదేహాలు

పలమనేరు : జిల్లాలోని వంద పడకల ఆసుపత్రిలో మృతదేహాలు భద్రపరచడానికి ఫ్రీజర్లు అందుబాటులో లేవు. ఒకేసారి నాలుగైదు వచ్చేస్తే ఒక మూలన పడేయాల్సిందే. వైకాపా హయాంలో పలమనేరులో వంద పడకల కోసం రూ.16 కోట్లతో అదనపు భవన నిర్మాణాన్ని చేపట్టింది. అందులో పది మృతదేహాల శవ పరీక్ష గదిని నిర్మించింది. రెండింటికి వీలైన ఫ్రీజర్ అందజేసింది. ఇక్కడ తరచూ రోడ్డు ప్రమాదాలతో పదుల సంఖ్యలో మృతదేహాలు తీసుకొస్తుంటారు. కుటుంబసభ్యులు వచ్చేదాకా నేలమీద, స్ట్రెచర్ల మీద ఉంచుతారు. ఇటీవల పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె నుంచి మూడు మృతదేహాలు వచ్చాయి. ఆ సమయంలో కూర్మాయికి చెందిన మహిళ మృతదేహం



రావడంతో రెండు బాక్సులో ఉంచి మిగిలినవి నేలపై పడేశారు. నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలకు ఇదొకటే ఆసుపత్రి. కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వంద పడకలున్నా అక్కడా ఫ్రీజర్ బాక్సులు అందుబాటులో లేవు. పుంగనూరు వంద పడకల ఆసుపత్రిలోని రెండు ఫ్రీజర్లు దాతలు సమకూర్చినవే.

**హెడీఎస్ నిధులతో తీసుకోవచ్చు**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫ్రీజర్లు దాతల సహకారంతో, హెచ్‌డీఎస్ నిధులు, ఆరోగ్యశ్రీ నిధుల ద్వారా ద్వారా వైద్యాధికారులు సమకూర్చుకోవచ్చు. పద్మావతి, డీసీహెచ్‌ఎస్, చిత్తూరు

# ప్రయోగ పరీక్షలు గట్టెక్కేదెలా...?

చిత్తూరు : ప్రయోగాలు, పరిశీలనతో కూడిన చదువులతో నూతన అవిష్కరణల సాధ్యం. ఇందుకు పాఠశాల, ఇంటర్మీడియట్ స్థాయిలోనే బీజాలు పడాలి. ఇంటర్ విద్యార్థులు గత పాలనలో నాణ్యమైన విద్యతోపాటు పరిశోధనలకు దూరమయ్యారన్నది అక్షర సత్యం. తూతూమంత్రంగా ప్రవేశపెట్టిన ప్లస్-2 విధానం నేడు అగమ్యగోచరంగా మారింది. త్వరలో నిర్వహించే ప్రయోగ పరీక్షలు పాసయ్యేదెలా అనే ఆందోళన విద్యార్థుల్లో నెలకొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 53 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 57 వరకు ప్లస్-2లు ఉన్నాయి. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో నాలుగవేలకు పైగా విద్యార్థులు ఉన్నారు. జూనియర్ కళాశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నా నాణ్యమైన పరికరాలు అందుబాటులో లేక ఉన్నవాటితోనే అక్కడి విద్యార్థులు ప్రయోగ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. మరోపక్క ప్లస్2 విద్యార్థులకు ప్రాక్టికల్ పాఠాలు కరవయ్యాయి. గత ప్రభుత్వం ఆగమేఘాల మీద ప్లస్-2లను ఏర్పాటు చేసి, అధ్యాపకులను నియమించింది. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అన్ని సందర్భాల్లోనూ



అది సాధ్యం కాకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు.

**గుర్తించడం కష్టమే..** గత విద్యా సంవత్సరంలో ప్రాక్టికల్ పరీక్షలు లేకుండానే నేరుగా తుది పరీక్షల్లో పాల్గొనాల్సి రావడంతో విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. గత ఏడాది మాదిరే ఈ విద్యాసంవత్సరం కొనసాగింది. పూర్తిస్థాయిలో ప్రాక్టికల్స్‌కు నోచుకోని దుస్థితి. చూసీచూడనట్లు వదిలేసి మార్కులు వేసి పాస్ చేసినా భవిష్యత్తులో ఇదివారి జీవితాలను తీవ్రంగా నష్టం చేస్తుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాధికారులు పేర్కొంటున్నారు.

# సొంతూళ్లోనే పాఠశాల విద్య




కదిరి : పాఠశాల ఉన్నత విద్య కోసం పొరుగూళ్లకు వెళ్లాలంటే చిన్నారులకు అవస్థే. ప్రమాణ సదుపాయం లేని మార్గాల్లో పిల్లలు నాలుగైదు కి.మీ. నడిచి వెళ్లాలంటే సమస్యే. రాకపోకల ప్రయాసతో చదువుపై ధ్యాస పెట్టక పరీక్షలు తప్పడం, దారి నడకలో బాలికలకు అభద్రత, నడిచి వెళ్లలేని కారణాలతో బడిబయటి పిల్లలుగా మారుతున్నారు. అందుకే కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యలో మార్పులు చేస్తోంది. 60 మందికి మించిన యూపీ స్కూళ్ల ఉన్నతీకరణతో గ్రామీణ విద్యార్థులకు ఉన్నత పాఠశాల విద్యకు దూరాభారం తగ్గిస్తోంది. స్థానికంగానే పాఠశాల ఉన్నత విద్య పూర్తికి సదుపాయం కలుగనుంది. దీంతో దూరం వెళ్లాల్సిన అవసరం ఉండదు. ప్రైవేటుకు వెళ్లి ఫీజు చెల్లించాల్సిన భారమూ లేదు. విద్యార్థుల సంఖ్య కలిగిన యూపీ స్కూళ్ల అప్‌గ్రేడ్, మెరుగైన బోధనతో స్థానికంగా పదో తరగతి పూర్తికి వెసులుబాటు దొరుకుతోంది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో సంతోష పడుతున్నారు.

**విద్యాశాఖలో కొత్త మార్పులు**

ప్రభుత్వం విద్యాశాఖలో కొత్త మార్పులు తీసుకొస్తోంది. పాఠశాలలను ఐదు విభాగాలుగా వర్గీకరిస్తోంది. 1.శాటిలైట్ ఫౌండేషనల్ స్కూల్స్, 2. ఫౌండేషనల్ స్కూల్, 3. మోడల్ ప్రైమరీ స్కూల్స్, 4. బేసిక్ ప్రైమరీ స్కూల్స్, 5. ఉన్నత పాఠశాలలుగా నిర్ణయించారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు 60 మందికి మించి విద్యార్థులున్న చోట ఏర్పాటు చేస్తారు. ప్రతి తరగతికి ఉపాధ్యాయుడు, పిల్లలు 120 మంది దాటితే ఒక ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు 150కి మించితే అదనంగా ఎస్జీటీని నియమిస్తారు.

ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు 75కి పైగా ఉంటే ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామోపాధ్యాయుడిని నియమిస్తారు. 54 విద్యార్థులకు రెండో సెక్షన్, ప్రతి 40 మందికి కొత్త సెక్షన్ ఏర్పాటు చేస్తారు. వీటి అమలు ప్రక్రియ మండల, క్లస్టర్ కమిటీల ఏర్పాటు. ఎస్ఎంసీ సంప్రదింపులు, తల్లిదండ్రుల అంగీకారంతో ఉంటుంది. అవరోధాలు ఉన్నచోట్ల బేసిక్ స్కూల్స్, 3 కి.మీ.ల లోపల ఉన్నత పాఠశాల లేకుంటే ప్రత్యేక ఏర్పాట్లు, అవసరమైన చోట రవాణా భత్యం ఇస్తారు.'కదిరి మండలం కాళసముద్రం యూపీ స్కూల్‌లో 162 విద్యార్థులు ఉన్నారు. ఇందులో ఆరు నుంచి 8వ తరగతి వరకు 67 మంది చదువుతున్నారు. వీరు ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే 3 కి.మీ. పైగా ప్రయాణించాల్సిందే. సమీపంలోని పట్నం పాఠశాలకు బస్సు ప్రయాణం చేసినా కి.మీ. మేర కాలినడక తప్పదు. లేదంటే 10 కి.మీ. ప్రయాణంలో కదిరిలోని ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సిందే. ప్రస్తుతం పాఠశాలగా ఉన్నతీకరిస్తుండటంతో సొంతూరులోనే పదో తరగతి పూర్తయ్యేందుకు సౌకర్యం కలుగుతోంది.'

# ఉపాధి.. ఉన్నతీకరణ



అనంతపురం : ఉపాధి వేతనాదారుల (కూలీలు) జీవితాల్లో వెలుగులు నింపేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. కూలి పనులు చేసుకుంటూనే జీవనం సాగించడమే కాకుండా వారికి స్వయం ఉపాధి శిక్షణలు ఇచ్చి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీలకు ఇది శుభవార్త. వంద రోజులు పూర్తి చేసిన వేతనదారులతోపాటు వారి కుటుంబసభ్యులు ఎవరైనా పదోతరగతి ఉత్తీర్ణత సాధించి ఉండి వారి వయసు 18 నుంచి 35 సంవత్సరాలలోపు ఉంటే వారి ఆసక్తి మేరకు వివిధ రకాల స్వయం ఉపాధి శిక్షణలు 'ఉన్నతి' పథకం కింద ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికే వంద రోజుల పనిదినాలు పూర్తి చేసిన వేతనదారుల వివరాల ప్రకారం వారి ఇళ్ల వద్దకు ఉద్యోగులు వెళ్లి ప్రభుత్వం ఇవ్వనున్న శిక్షణలు గురించి తెలియజేసి అందులో ఏ రకమైన స్వయం ఉపాధి శిక్షణ పొందుతారో తెలుసుకుంటున్నారు. పదోతరగతిపైన చదివిన వారికి వారి విద్యార్హతను బట్టి శిక్షణను ఎంపిక చేసుకోవచ్చు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో సర్వే ప్రారంభమైంది.

**వీటిలో శిక్షణ**

శిక్షణలకు ఎంపికైన వేతనాదారులు, వారి పిల్లలకు 31 రంగాల్లో 215 కోర్సులలో 90 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కాలంలో రోజుకు రూ.300 చొప్పున 90 రోజులకు రూ.27 వేలు భృతిగా చెల్లించనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రకటించింది. కుట్టు, ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రిక్, డ్రైవింగ్, ప్లంబర్, కంప్యూటర్, వ్యవసాయం, బ్యాంకింగ్, మార్కెటింగ్, సేల్స్ సూపర్ వైజర్స్, మార్కెటింగ్ సర్వీసెస్‌కు, హోటల్ మేనేజ్‌మెంట్ తదితర వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ ఇస్తారు. శిక్షణ కాలంలో వసతితోపాటు భోజన సౌకర్యం కల్పిస్తారు. యూనిఫామ్ ఉచితంగా అందజేయనున్నారు.

**వివరాలు సేకరిస్తున్నాం:** సలీంబాషా, పీడీ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)వందరోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల వివరాలను సేకరిస్తున్నాం. ప్రభుత్వం ఇవ్వనున్న శిక్షణల గురించి తెలియజేసి వారు ఏ రంగంలో శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి ఉందో తెలుసుకుం టున్నాం. అర్హులైన వేతనదారులు, వారి కుటుంబ సభ్యులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ అనంతరం వారికి ధ్రువీకరణ పత్రం ఇవ్వటంతోపాటు ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగం కల్పిస్తాం. వివరాల సేకరణ పూర్తైన శిక్షణ ప్రారంభం అవుతుంది.

# కందుల కొనుగోలుకు నిబంధనల ఛత్రం

ఉరవకొండ : ఉరవకొండ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసిన కంది కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. కేంద్రాన్ని అధికారులు ఈ నెల 23న ప్రారంభించారు. కాని ఇప్పటి వరకు ఒక్క క్వింటా కూడా కొనుగోలు చేయలేదు. ఈ ప్రక్రియను అధికార యంత్రాంగం సీఎం యాప్‌లో వివరాల ఆధారంగా చేపట్టాల్సి ఉంది. ఉరవకొండ వ్యవసాయ డివిజన్‌లోని నాలుగు మండలాల్లో 37,247 హెక్టార్లలో కంది పంట సాగయ్యింది. అయితే ఈ-పంట నమోదు, పంటకోత ప్రయోగాల ఆధారంగా ఉరవకొండ వ్యవసాయ డివిజన్‌లో ఎకరాకు సగటున 3 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు వ్యవసాయ అధికారులు నమోదు చేశారు. ఆ వివరాలే సీఎం యాప్‌లో నమోదు అయ్యాయి. వాస్తవంగా ఒక్కో ఎకరాకు సగటున 5 క్వింటాళ్లకుపైగా దిగుబడి వచ్చింది. ఈ లెక్కన నాలుగు మండలాల్లో 50,207 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. సీఎం యాప్ ఆధారంగా ఒక్కో రైతుకు సంబంధించి సగం నిల్వలు కూడా కొనుగోలుకు అవకాశం లేదు. దీంతో చాలా మంది రైతులు విక్రయించడానికి ముందుకు రావడం లేదు. సగం కొనుగోలు కేంద్రంలోనూ, మిగతా సగం ఎక్కడ అమ్ముకోవాలో తెలియక రైతులు అవస్థలు పడుతున్నారు.

**తేమ సమస్యతో..**

కొనుగోలు కేంద్రంలో కందులను అమ్ముకోవాలంటే తేమ శాతం 12లోపు ఉండాలి. చాలా మంది నెల రోజుల కిందటే కంది పంటను కోశారు. దిగుబడిని ఆరబెట్టుకుంటున్నారు. నేటికీ తేమ శాతం 15పైనే వస్తోంది. నిబంధనల ప్రకారం వాటిని కొనుగోలు చేయడానికి



అవకాశం లేదు. ఇది పెద్ద సమస్యగా మారింది. ఒక్క రైతుకు సంబంధించిన నిల్వలు కూడా తేమశాతం 12 రాకపోవడం కొనుగోలుకు ఆటంకంగా మారింది. ఇప్పటికే ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి రైతులు తీసుకుపోయారు. నిబంధనను సడలించే దిశగా చర్యలు చేపట్టింది లేదు. యాప్‌లో వివరాలను ఆధునికీకరిస్తేనే కొనుగోలు కేంద్రంలో కందుల కొనుగోలుకు అవకాశం ఉంటుంది. ఆ దిశగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. దీనిపై మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరిని వివరణ కోరగా, సమస్యను వ్యవసాయ జిల్లా ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. ఆయన ఆదేశాల మేరకు తగిన చర్యలు చేపడతామని చెప్పారు.

# కాగితాల్లో కోట్లు.. కలలకు తూట్లు

శ్రీకాళహస్తి : పక్కా ఇళ్లు.. అభివృద్ధి లోగిళ్లు.. పేదల కలలను సాకారం చేసేలా కాలనీల్లా కాకుండా ఊళ్లలా అభివృద్ధి అంటూ ఆశలు గుప్పించిన జగనన్న కాలనీకి వెచ్చించిన నిధులు తెలిస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగకమానదు. అందులోనూ.. స్వయంగా మాజీ సీఎం జగన్ ప్రారంభించిన ఊరందూరు జగనన్న కాలనీని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వెచ్చించిన వ్యయానికి, కాగితాల్లో ఉన్న రూ.కోట్లకు పొంతన లేకుండా పోతోంది. ఒక్క కాలనీలోనే ఇంత వ్యత్యాసం ఉంటే.. రాష్ట్ర వ్యాప్తంగా ఎంత మేరకు నిధులు దుర్వినియోగం అయ్యాయన్నది ఆరా తీస్తే దేశంలోనే ఇదో అదిపెద్ద కుంభకోణమైనా ఆశ్చర్య పడాల్సిన పనిలేదంటున్నారు.. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి.

**లబ్ధి వేలల్లో.. వచ్చింది పదుల్లో**

ఊరందూరు జగనన్న కాలనీలో వెచ్చించిన నిధులకు అక్కడ ఒనగూరిన అభివృద్ధికి పొంతన లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇక్కడ లబ్ధిదారుల పంపిణీ కోసం 6,231 ఇళ్లు మంజూరైతే ఇప్పటి వరకు లబ్ధిదారులకు కేటాయించినవి 4,873 మాత్రమే. జగనన్న కాలనీలో ఇటీవల నిర్వహించిన పట్టాల పరిశీలన, సమస్యలపై బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ నేపథ్యంలో నిర్వహించిన సమావేశంలో కేవలం 40 మంది లబ్ధిదారులు హాజరుకాకపోవడంపై అనుమానాలు



వ్యక్తమవుతున్నాయి. మిగిలిన పట్టాలన్నీ ఎవరికి ఇచ్చారు..? లబ్ధిదారులు ఎవరు..? ఒకరికే ఏక మొత్తంలో పట్టాలు కట్టబెట్టారా..? ఇలాంటి ఎన్నో సందేహాలు విస్మయానికి గురిచేస్తున్నాయి. దీన్ని పూర్తి స్థాయిలో విచారణ జరిపే విధంగా లబ్ధిదారులు, వాళ్ల చిరునామాల జాబితాను తయారు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

**రూ.కోట్లు ఏమైనట్లు ?**

ఊరందూరు కాలనీలో వేసిన ఆరు బోర్లల్లో రెండు కాలిపోగా మిగిలినవాటికి రూ.80 లక్షలు, అంతర్గత రోడ్లకు రూ.2.85 కోట్లు, విద్యుద్దీకరణకు రూ.5 కోట్లు, భూసేకరణకు రూ.250 కోట్లు కాకుండా గృహ నిర్మాణాలకు సిమెంటు, స్టీలు, ఇసుక తదితర వాటికి రూ.వేల కోట్లల్లో వ్యయం చేసినట్లు కాగితాల్లో లెక్కలున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా ఉండటంతో పట్టాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**భూసేకరణపైనే విమర్శలు**

ఇక్కడున్న ప్రభుత్వ, ప్రైవేటు భూములను గత ప్రభుత్వం కొనుగోలు చేసింది. భూసేకరణకు సంబంధించి నిర్వాసితుల వ్యక్తిగత ఖాతాలకు పడిన నగదు 60 శాతం మేరకు మళ్లీ వాళ్ల అకౌంట్ల నుంచి మళ్లింపు చేసినట్లు ప్రాథమికంగా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ధారణకు వచ్చారు. ఇలా ఎంత మేరకు నిధులు మళ్లింపు చేశారన్న వివరాలు సిద్ధం చేయాలంటూ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందులోనే భారీగా అవకతవకలు జరిగాయని, అన్నీ వెలుగులోకి తీసుకొస్తామంటూ ఎమ్మెల్యే స్పష్టం చేయడం విశేషం.

**చాలా మోసపోయాం**

ఇల్లు కట్టుకునే స్తోమత లేక ప్రభుత్వం తరఫున కట్టించమని అడిగా. శ్లాబ్ వేసి ద్వారం పెట్టారంతే. ఎలాంటి అభివృద్ధి చేయలేదు. చాలా మోసపోయాం. బిల్లులు అన్నీ వచ్చేశాయి. ఇల్లు చూసి కన్నీళ్లు ఆగలేదు. షరీఫాబీ, శ్రీకాళహస్తి


**బిల్లు కోసం లంచం ఇచ్చా**

జగనన్న లేఔట్‌లో పక్కా ఇల్లు ఇచ్చారు. బిల్లులు వేసేందుకు రూ.30 వేలు లంచం ఇచ్చా. అది ఇచ్చాక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిల్లులు జమయ్యాయి.దండి జయశంకరయ్య, ముచ్చివోలు

# మళ్లీ తెరపైకి కిడ్నీ రాకెట్

విశాఖపట్నం : హైదరాబాద్‌లో కలకలం సృష్టిస్తున్న కిడ్నీ అక్రమ మార్పిళ్ల కేసు డొంక విశాఖలో కదులుతోంది. నగరానికి చెందిన పవన్, పూర్ణ, లక్ష్మణ్‌లకు ఈ కేసుతో సంబంధమున్నట్లు అక్కడి పోలీసులు గుర్తించారు. పెందుర్తి లోని ఓ ఆసుపత్రిలో అనధికారికంగా కిడ్నీ తొలగించారని 2023లో బాధితుడు ఫిర్యాదు చేయడంతో 10 మందికి పైగా నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నాటి సీపీ త్రివిక్రమ వర్మ బదిలీపై వెళ్లిపోయిన తర్వాత ఆ ముఠా కార్యకలాపాలపై ఎవరూ దృష్టి పెట్టలేదు. అప్పట్లో సూత్రధారులు బయటకు రాకుండా.. లోతైన దర్యాప్తు జరగకుండా పోలీసులు కేసును పక్కన పెట్టేశారనే ఆరోపణలు వచ్చాయి. తాజాగా కిడ్నీ రాకెట్ బయటపడటంతో ఇప్పటికీ విశాఖ నుంచి ముఠాను నడిపిస్తున్నారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

**మళ్లీ అదే వైద్యుడు..:** విశాఖలో అప్పట్లో కలకలం సృష్టించిన కేసులో చెన్నైకు చెందిన వైద్యుడు రాజశేఖర్ పెరుమాళ్లను పెందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. ఆయన హైదరాబాద్‌లోని పలు కార్పొరేట్ ఆసుపత్రుల్లోనూ వైద్య



సేవలు అందిస్తుంటారు. కిడ్నీ ముఠా ప్రణాళిక ప్రకారం ఆయన పెందుర్తి వచ్చి అప్పట్లో బాధితుడికి శస్త్రచికిత్స చేసి కిడ్నీ తొలగించారు. తాజాగా హైదరాబాద్ కేసులోనూ అదే వైద్యుడికి సంబంధమున్నట్లు పోలీసులు గుర్తించారు. 2023లో కిడ్నీ రాకెట్ కేసులో పవన్ అనే వ్యక్తికి సంబంధముందని పోలీసులు గుర్తించారు. అతడికే హైదరాబాద్ కేసుతో సంబంధముందా? అనే కోణంలో ఆరా తీస్తున్నారు.

**ల్యాబ్ సిబ్బంది పాత్రపై ఆరా..** గతంలో విశాఖలో కిడ్నీ ముఠాకు సహకరించిన ల్యాబ్ సిబ్బంది పాత్రపైనా అనుమానిస్తున్నారు. రక్తపరీక్షలు చేసి క్రాస్ మ్యాచింగ్ కోసం హైదరాబాద్‌కు నమూనాలు పంపేవారు. అక్కడి నుంచి రిపోర్టు వచ్చిన తర్వాత నగరంలో ఆపరేషన్లు చేయడంతో ఆ కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. అప్పట్లో వైద్యారోగ్యశాఖ నగరంలోని కొన్ని ఆసుపత్రులను తనిఖీ చేసింది. బాధితులు, గ్రహీతల వివరాలను సేకరించింది. తాజాగా పోలీసులు ఆ వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. వాటి ద్వారా ఏమైనా ఆధారాలు దొరుకుతాయేమోనని భావిస్తున్నారు.

# ఐశ్వర్య మీనన్.. సన్నని నడుముతో హై వోల్టేజ్ వైబ్

టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంటున్న ఐశ్వర్య మీనన్ మరోసారి స్టన్నింగ్ లుక్స్‌తో మెరిసింది. తాజాగా ఆమె పర్పుల్ కలర్ స్టైలిష్ అవుట్‌ఫిట్‌లో ఫోటోషూట్ చేయగా, ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. స్టన్నింగ్ స్టైలింగ్, పెర్ఫెక్ట్ ఫిట్‌నెస్‌తో ఆమె అందాలను మరింత హైలైట్ చేస్తూ లైమ్‌లైట్‌లోకి వచ్చేసింది. అభిమానులు ఆమె లేటెస్ట్ లుక్‌ను చూసి ఫిదా అవుతున్నారు. పర్పుల్ కలర్ స్లీవ్‌లెస్ టాప్, హై-వైస్టెడ్ ట్రౌజర్స్‌లో ఐశ్వర్య సింపుల్‌గా ఉండేలా స్టైలింగ్ చేసినా, అది ఓ గ్లామరస్ టచ్‌ను తెచ్చింది. ఆమె మేకప్, సన్‌లైట్‌లో మెరుస్తున్న అందం మరింత ఆకర్షణగా మారాయి. కెమెరా ముందు వయ్యారంగా పోజులిస్తూ తన గ్లామర్ యాంగిల్స్‌ను ఎలివేట్ చేయడం, ఆమె



ఫోటోషూట్‌లో ప్రత్యేకత. ఇటీవల ఐశ్వర్య మీనన్ తెలుగు, తమిళ, మలయాళ పరిశ్రమల్లో వరుసగా అవకాశాలు అందుకుంటోంది. ‘స్పై’ చిత్రంలో నిఖిల్ సిద్ధార్థ్‌తో కలిసి నటించిన ఆమెకు నటిగా మంచి గుర్తింపు దక్కింది. కానీ ఆ సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో సక్సెస్ కాలేకపోయింది.. ప్రస్తుతం మలయాళంలో ‘బజూక’ అనే సినిమాతో బిజీగా ఉండగా, తెలుగులో మరో ప్రాజెక్ట్ కోసం చర్చలు జరుగుతున్నట్లు టాక్. ఈ ఫోటోలు చూసిన అభిమానులు, నెటిజన్లు ఆమె అందాన్ని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. స్టన్నింగ్ గ్లామర్..అంటూ కామెంట్స్ పెడుతుంటే, మరికొందరు ఆమెకు తెలుగులో మరిన్ని అవకాశాలు రావాలని కోరుకుంటున్నారు. స్టైలిష్ అండ్ బోల్డ్ లుక్స్‌తో హాట్ టాపిక్ అవుతున్న ఐశ్వర్య, టాలీవుడ్‌లో మరో ఛాన్స్ దక్కించుకుంటుందేమో చూడాలి.

# 41 వయసులోను అందాల త్రిష అదే జోరు

వయసు, మారుతున్న కాలంతో సంబంధం లేకుండా స్టార్ డమ్ ని ఆస్వాధించే నటీమణులు చాలా అరుదు. 40 వయసులోను త్రిష ఇప్పటికీ క్యూట్ గా అందంగా కనిపిస్తోంది. ఇప్పటికీ త్రిషకు ఉన్న ఫాలోయింగ్ చెక్కు చెదరలేదు. జయాపజయాలతో సంబంధం లేకుండా, ఈ భామ బ్యాక్ టు బ్యాక్ అగ్ర హీరోల సరసన అవకాశాలు అందుకుంటోంది. ఇటీవల పొన్నియన్ సెల్వన్ లాంటి భారీ బ్లాక్‌బస్టర్ అందుకున్న త్రిష తదుపరి పలు తమిళ ప్రాజెక్టులలో ఆఫర్లను అందుకుంది. తళా అజిత్ తో విదాముయార్చి (తెలుగులో పట్టుదల) లో నటించింది. ఈ సినిమా ఇటీవలే విడుదలై, ఆశించిన విజయం సాధించకపోవడం నిరాశపరిచింది. తదుపరి కమల్ హాసన్ థగ్ లైఫ్



లో ను త్రిష కనిపించనుంది. తెలుగులో విశ్వంభర లో మెగాస్టార్ చిరంజీవి సరసనా కథానాయికగా నటిస్తోంది. అజిత్‌తో సినిమా ఫ్లాపైనా కానీ, ప్రస్తుతం చిరంజీవి, కమల్ హాసన్ లాంటి అగ్ర హీరోల సరసన త్రిష నటిస్తోంది. ఈ రెండూ తన కెరీర్ లో కీలకమైన సినిమాలు. ఈ రెండిటిపైనా భారీ అంచనాలున్నాయి. ఇవి బ్లాక్ బస్టర్లు సాధిస్తే త్రిషకు మరో ఐదారేళ్ల పాటు వెనుదిరిగి చూసుకునే పనే లేదు. మరోవైపు విజయ్ సేతుపతితో కలిసి తన బ్లాక్ బస్టర్ సినిమా 96 కి సీక్వెల్ లోను నటిస్తుందని కథనాలొస్తున్నాయి. అయితే ఈ మూవీ గురించి అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.




# చైతూతో మసుద దెయ్యం ఫోటో.. నెట్టింట వైరల్



యువ సామ్రాట్ అక్కినేని నాగ చైతన్య హీరోగా సాయి పల్లవి హీరోయిన్ గా నటించిన సినిమా తండేల్. చందూ మొండేటి దర్శకత్వం వహించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లను సాధించి బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఆల్రెడీ ఈ సినిమా రూ.110 కోట్లకు పైగా కలెక్షన్లు సంపాదించి, ఇప్పటికీ మంచి ఆక్యుపెన్సీలతో దూసుకెళ్తుంది. ఎన్నో సినిమాలుగా సరైన సక్సెస్ లేక ఇబ్బంది పడుతున్న నాగ చైతన్య, తండేల్ తో సాలిడ్ సక్సెస్ ను అందుకున్నాడు. ఎంతో కాలంగా చైతన్య వెయిట్ చేస్తున్న విజయం ఈ సినిమాతో తనకు దక్కింది. ఇదిలా ఉంటే ఈ సినిమా గ్రాండ్ సక్సెస్ అయినందుకు హీరో నాగ చైతన్య ఫిల్మ్ నగర్ లోని ఓ పబ్ లో గ్రాండ్ గా పార్టీ ఇచ్చాడు. ఈ పార్టీకి చిత్ర యూనిట్ సభ్యులతో పాటూ పలువురు సినీ తారలు హాజరయ్యారు. ఈ పార్టీలో చైతన్య తో కలిసి ఓ అమ్మాయి దిగిన ఫోటో ప్రస్తుతం నెట్టింట ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఆ అమ్మాయి ఎవరో కాదు, మసూద సినిమాలో దెయ్యంగా నటించి అందరినీ ఎంతగానో భయపెట్టిన బాంధవి శ్రీధర్. మసూదలో దెయ్యంలా కనిపించినా సోషల్ మీడియాలో మాత్రం బాంధవి తన గ్లామర్ ఫోటోలతో అందరినీ ఆకట్టుకుంటుంది. 2019లో మిస్ ఇండియా రన్నరప్ అయిన బాంధవి, మిస్ ఇండియా ఫ్యాషన్ ఐకాన్ 2019గా కూడా నిలిచింది. అలాగే మిస్ ఆంధ్రపదేశ్2019గా కూడా బాంధవి గెలిచింది. మొదట్లో మళ్లీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ సినిమాల్లో నటించిన బాంధవికి మసూద సినిమా వరకు సరైన ఫేమ్ రాలేదు. మసూద తర్వాతే బాంధవి సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ అయింది. ఇప్పుడు చైతన్య ఇచ్చిన స్పెషల్ పార్టీలో మెరిసి మరోసారి సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుంది. ఇదిలా ఉంటే ఈ పార్టీకి నిర్మాతలైన స్వప్న, నాగవంశీ, అల్లు అరవింద్, బన్నీ వాస్, సుప్రియ, బాపినీడుతో పాటూ డైరెక్టర్ కార్తీక్ దండు, గీతా ఆర్ట్స్ సన్నిహితులు కూడా హాజరయ్యారు.

# ‘మై టూర్ ఎంఎంకే’కి మెగాస్టార్ ప్రమోషన్ హెల్ప్ అయ్యేనా?




విదేశాల్లో మ్యూజిక్ కన్సర్ట్‌లకు మంచి డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా యూఎస్‌ఏలో పాప్ సింగర్స్ మ్యూజిక్ కన్సర్ట్‌లకు, లైవ్ షోలకు ఏ స్థాయిలో స్పందన ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఒకప్పుడు మైకేల్ జాక్సన్ లైవ్ షోల కోసం ఫ్యాన్స్ ప్రాణాలు ఇచ్చే వారు. ఇప్పటికీ యూఎస్‌తో పాటు పలు దేశాల్లో లైవ్ షోలకు మంచి డిమాండ్ ఉంది. అక్కడితో పోల్చితే ఇండియాలో కాస్త ఆదరణ తక్కువ అని చెప్పాలి. ముంబై, చెన్నై, బెంగళూరులో ఒక మోస్తరు ఆదరణ లభించిన తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఇలాంటి లైవ్ షో లకు, మ్యూజిక్ కన్సర్ట్‌లకు పెద్దగా స్పందన రావడం లేదు. ఇప్పటికే కొన్ని సంస్థలు, ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్స్, సింగర్స్ హైదరాబాద్‌లో లైవ్ కాన్సర్ట్‌లు చేసి ఆశించిన స్పందన దక్కించుకోలేక పోయారు. హైదరాబాద్‌లో మ్యూజిక్ కన్సర్ట్‌లకు పెద్దగా స్పందన ఉండదు అనే విషయం తెలిసి కూడా ఆస్కార్ అవార్డ్ గ్రహీత కీరవాణి లైవ్ షోకి సిద్ధం అయ్యారు. ప్రముఖ సింగర్స్‌తో ఈ షో జరగబోతుంది. ఇప్పటికే బుకింగ్ ప్రారంభం అయింది. హైదరాబాద్ ప్రేక్షకులు సినిమాలను థియేటర్‌లలో చూసేందుకు క్యూ కడతారు. కానీ ఇలాంటి కన్సర్ట్ కి ఇంకా అలవాటు కాలేదు. అందుకే కీరవాణి కన్సర్ట్‌కి ఎలాంటి స్పందన వస్తుంది అనేది కాస్త అనుమానంగా ఉంది. మెగాస్టార్ చిరంజీవి ఈ మ్యూజిక్ కన్సర్ట్‌కి తన మద్దతు తెలిపారు. ఒక వీడియోను షేర్ చేసి కీరవాణి మ్యూజిక్ కన్సర్ట్‌ను ప్రమోట్ చేశారు. దాంతో మ్యూజిక్ కన్సర్ట్ గురించి జనాల్లో చర్చ మొదలైంది. తెలుగు రాష్ట్రాల్లో గతంలో జరిగిన మ్యూజిక్ కన్సర్ట్‌లకు గొప్ప స్పందన రాలేదు. జనాలు ఒక మోస్తరుగా వస్తారు, అయితే యూఎస్‌లో వచ్చినంత రెస్పాన్స్ మాత్రం రాదని చెప్పాలి. ఇంతకు ముందు ఏ మ్యూజిక్ కన్సర్ట్‌కు చేయనంత ప్రచారంను చేస్తున్నారు. మార్చి 22న మై టూర్ ఎంఎంకే పేరుతో కీరవాణి ఈ కన్సర్ట్‌ను నిర్వహించబోతున్నారు. అందుకోసం ప్రమోషన్‌ను పెద్ద ఎత్తున చేస్తున్నారు. ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి తన మద్దతు తెలుపగా త్వరలోనే రాజమౌళి, మహేష్ బాబు సైతం బైట్స్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు సినిమాకు కీరవాణి సంగీతాన్ని అందిస్తున్నారు. పవన్ సైతం ఈ మ్యూజిక్ కన్సర్ట్ కి సంబంధించి ప్రమోషన్‌లో హెల్ప్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇంత మంది మద్దతు తెలిపితే కచ్చితంగా మై టూర్ ఎంఎంకే కి మంచి స్పందన దక్కే అవకాశాలు ఉన్నాయి.

ఇలాంటి మ్యూజిక్ కన్సర్ట్‌లకు పెద్ద మొత్తంలో టికెట్ రేట్లను పెట్టి కొనుగోలు చేసేందుకు తెలుగు ప్రేక్షకులు ఆసక్తి చూపించరు అనే అభిప్రాయం ఉంది. కానీ ఈసారి పలువురు ప్రముఖ స్టార్స్ ప్రమోషన్ చేస్తే తప్పకుండా పెద్ద మొత్తంలో టికెట్స్ తెగే అవకాశాలు ఉన్నాయి. కీరవాణి మ్యూజికల్ కన్సర్ట్ సక్సెస్ అయితే కచ్చితంగా భవిష్యత్తులో హైదరాబాద్‌లో మరిన్ని కన్సర్ట్ లు, లైవ్ షో లు జరిగే అవకాశాలు ఉన్నాయి.

# వాళ్లిద్దరి పాలిట రష్మిక అదృష్ట దేవతవ్వాలా!

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా ఎదురు లేకుండా దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. వరుస విజయాలతో పాన్ ఇండియాలోనే అమ్మడు ఓ బ్రాండ్ గా మారిపోయింది. టాలీవుడ్ అయినా..బాలీవుడ్ అయినా? రష్మిక సినిమా చేసిందంటే? అదో బ్రాండ్ గా మారిపోతుంది. యానిమల్ లో రణబీర్ కి కపూర్ కి జోడీగా నటించింది. ఆ సినిమా బ్లాక్ బస్టర్ అయింది. బాక్సాఫీస్ వద్ద 900 కోట్ల వసూళ్లను సాధించింది. రణబీర్ కపూర్ కి ఇమేజ్ ని తెలుగులోనే పెంచింది. ఇక పుష్ప-2 లో శ్రీవల్లిగా అమ్మడు ఏ రేంజ్ లో పెర్ఫార్మెన్స్ ఇచ్చిందో చెప్పాల్సిన పనిలేదు. నటనతో పాటు ఫీలింగ్స్ ఫీలింగ్స్ అంటూ ఓ ఊపు ఊపేసింది. ఈ సినిమా ఏకంగా బాహుబలి2 రికార్డులనే చెరిపేసింది. బాక్సాఫీస్ వద్ద 1870 కోట్లకు పైగావ సూళ్లను సాధించింది. ఇక ఇటీవల రిలీజ్ అయిన ఛావాతో కొత్త ఇమేజ్ ని క్రియేట్ చేసుకుంది. ఏసుబాయి పాత్రలో రష్మిక నటన నటిగా మరో మెట్టు పైన నిలబెట్టింది. ఈ సినిమా 400



కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. వరుస విజయాల్లో ఉన్న విక్కీ కౌశల్ ని ఈ విజయం మరింత గొప్ప స్థానంలో నిలబెట్టింది. ఇలా వరుసగా రష్మిక మొత్తంగా 3000 కోట్లకు పై వసూళ్ల ప్రాజెక్ట్ ల్లో భాగమైంది. వాటిలో రష్మిక పాత్ర ఎంతో కీలకమైందన్నది కాదనలేని నిజం. దీంతో రష్మిక పై బరువైన బాధ్యత పడింది. ప్రస్తుతం రష్మిక-సల్మాన్ ఖాన్ జంటగా మురగదాస్ సికిందర్ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. భారీ యాక్షన్ థ్రిల్లర్ ఇది. రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో మంచి హైప్ క్రియేట్ అవుతుంది. అయితే సల్మాన్ ఖాన్ -మురగదాస్ ఇద్దరు ఫ్లాప్ ల్లోనే ఉన్నారు. కొంత కాలంగా వారు చేస్తోన్న ప్రయత్నాలేవి బాక్సాఫీస్ వద్ద ఫలించడం లేదు. ఇంకా చెప్పాలంటే టైగర్ 3 తర్వాత సల్మాన్ కి సరైన హిట్ ఒక్కటీ లేదు. సర్కార్ తర్వాత మురగదాస్ కి కూడా సక్సెస్ పడలేదు. ఆ తర్వాత చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ నేపథ్యంలో ఇద్దరికీ రష్మిక తనలో సక్సెస్ సెంటిమెంట్...లక్ ని షేర్ చేయాల్సిన సమయం ఇది. రష్మిక సక్సెస్ వేవ్ లో భాగంగా సికిందర్ కూడా బ్లాక్ బస్టర్ అవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# అనుపమ ఫ్యాన్స్ అప్సెట్ లో ఉన్నారెందుకు..?

మలయాళ భామ అనుపమ పరమేశ్వరన్ టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ క్రేజ్ తెచ్చుకోవాల్సిన రేంజ్ ఉన్నా కూడా ఆమె ఆ రేంజ్ లో వెళ్లలేకపోయింది. చేస్తున్న సినిమాలు కూడా ఆమె స్థాయికి తగినవి కాదని కూడా ఆమె ఫ్యాన్స్ ఫీలవుతున్నారు. అనుపమ కెరీర్ స్టార్టింగ్ లోనే మంచి సినిమాలు చేసింది. అంతేకాదు అప్పట్లో కాస్త బొద్దుగా కనిపించిన అమ్మడు ఆడియన్స్ ని ఆకట్టుకుంది. ఐతే స్లిమ్ గా అవ్వాలన్నది తన ఆలోచనో లేదా ఎవరైనా సలహా ఇచ్చారో కానీ అమ్మడు ఎప్పుడైతే స్లిమ్ గా మారిందో ఆమెకు ఛాన్స్ లు కూడా కరువయ్యాయి. ఆశించిన పాత్రలు రాక చేసేది ఏమి లేక వచ్చిన సినిమాలనే చేస్తుంది అనుపమ. తెలుగులో రవితేజ లాంటి స్టార్స్ తో ఛాన్స్ అందుకున్నా లక్ కలిసి రాలేదు. ఇక తమిళ్ లో అమ్మడు యువ హీరోల సరసన నటిస్తుంది. లేటెస్ట్ గా ప్రదీప్ రంగనాథన్ తో డ్రాగన్ సినిమాలో నటించింది అనుపమ. అందులో అనుపమ ఫస్ట్ హాఫ్ వరకు హీరోయిన్ గా కనిపించినా సెకండ్ హాఫ్ అది సపోర్టింగ్ రోల్ లా అనిపిస్తుంది. అనుపమతో పాటు ఈ సినిమాలో నటించిన



కయదు లోహర్ స్క్రీన్ ని ఎట్రాక్ట్ చేసింది. అనుపమ ఈ పాత్రలో కనిపించి తన ఖాతాలో ఒక సినిమా పడేలా చేసుకుంది కానీ ఆమె ఫ్యాన్స్ మాత్రం ఆమెను ఇలా చూడాలని అనుకోవట్లేదు. ప్రేమం, అ ఆ సినిమాల్లో అనుపమ రేంజ్ వేరని అంటున్నారు. మళ్లీ తన లుక్ మార్చే విషయం పక్కన పెడితే అనుపమ ఇక మీదట ఎంచుకునే పాత్రల్లో అయినా బెటర్ మెంట్ ఉండాలని కోరుతున్నారు. ఐతే ఎలాంటి అవకాశాలు లేని టైం లో వచ్చిన ఏ ఛాన్స్ అయినా చేయాలని అనిపిస్తుంది. ఐతే అనుపమ తన ఫ్యాన్స్ అందరు తనని క్లాస్ గా ఉండాలని కోరుతుంటే అమ్మడు మాత్రం అసలు వాటిని పట్టించుకోకుండా వచ్చిన పాత్రలను చేస్తుంది. అనుపమ లో ఈ మార్పు ఆమె కెరీర్ కు ప్లస్ అవుతుందో లేదో చూడాలి. డ్రాగన్ సినిమా సక్సెస్ అయినా అనుపమ ఫ్యాన్స్ మాత్రం అప్సెట్ లో ఉన్నారు. మరి ఇక మీదట అయిన అనుపమ తన ఫ్యాన్స్ గురించి కాస్త పట్టించుకుంటే బాగుంటుందని అనిపిస్తుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536